ముహూర్తం
శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం,
శరదృతువు, ఆశ్వయుజ మాసం, కృష్ణపక్షం;
తిథి: తదియ రాత్రి మొత్తం;
నక్షత్రం: భరణి మ.2.22 వరకు;
అమృతకాలం: ఉ.9.12 నుండి 10.55 వరకు;
వర్జ్యం: గురువారం తె.3.07 నుండి 4.49 వరకు;
దుర్ముహూర్తం: ఉ.11.38 నుండి 12.24 వరకు;
రాహుకాలం: మ.12.01 నుండి 1.28 వరకు;
యమగండం: ఉ.7.39 నుండి 9.07 వరకు;

Estd. 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంబరాల జీవితం సౌభాగ్యాల సారథం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం

సంపుటి:58 • సంచిక: 177 • బుధవారం 16 అక్టోబర్ 2019 • హైదరాబాద్ ❋ పేజీలు:10+4 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati|Kurnool|Anantapur|Nellore

# పంతాలు వీడండి

**సమ్మె విరమించాలని ఆర్టీసీ కార్మికులకు హితవు.. జేఏసీ నేతలను చర్చలకు పిలవాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

పండగ వేళ బస్సులు నిలిపేస్తారా అని కార్మిక సంఘాలపై ఆగ్రహం • ముందస్తు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అసంతృప్తి • పట్టువిడుపులు ప్రదర్శించాలని సూచన




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రజా రవాణా వ్యవస్థ పునరుద్ధరణకు ప్రభుత్వం, కార్మిక సంఘాలు ప్రయత్నించాలని హైకోర్టు హితవు పలికింది. సమ్మె విరమించాలని కార్మికులకు సూచిస్తూనే, వారిని చర్చలకు ఆహ్వానించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. పంతాలు వీడి పట్టువిడుపులు ప్రదర్శించాలని ఉపదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ ఏ అభిషేక్ రెడ్డి తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా వేసింది.

ఆర్టీసీ సమ్మెపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం మరోదఫా విచారణ చేపట్టింది. సమ్మె విరమణ కు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది.కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించేలా ప్రభుత్వానికి చెప్పాలని తెలంగాణ ఏజీ బీఎస్.ప్రసాద్, అదనపు ఏజీ జె.రామచంద్రరావుకు న్యాయస్థానం సూచించింది. సమ్మె విరమణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటో వచ్చే విచారణ తేదీ రోజు తమకు చెప్పాలని ఆదేశించింది. ప్రజలకు సమస్య లేకుండా చూడాలని ఆదేశించింది. రెండ్రోజుల్లో సమ్మెపై కోర్టుకు నివేదిక సమర్పించాలని ప్రభుత్వానికి సూచించింది. కార్మికులు తొందరపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని కోరింది. డిమాండ్లు సమంజసమే అయినప్పటికీ, పండుగ సందర్భంలో బస్సులు నిలిపివేయడం ఏమిటంటూ కార్మికుల పట్ల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎస్మా ఎందుకు ప్రయోగించరాదో చెప్పాలని కార్మిక సంఘాలను ప్రశ్నించింది. కార్మికుల్లో నమ్మకం కల్గిం చేందుకు ముందుగా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌ను వెంటనే ➪ 5వ పేజీలో...

## ప్రభుత్వం పిలిస్తే చర్చలకు వెళతాం

ఆర్టీసీ జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి

సమ్మెకు మద్దతు తెలిపిన టీఎన్జీవో

అదే బాటలో ఉపాధ్యాయ జాక్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ 5

కార్మికుల కోర్కెలు నెరవేర్చాలి: సీపీఎం


ఢిల్లీలో ప్రధాని మోడీతో రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందరరాజన్

## సమ్మెపై కేంద్రానికి గవర్నర్ నివేదిక

రాష్ట్రంలో తాజా పరిణామాలపై ప్రధాని మోడీకి వివరణ... 40 నిమిషాల పాటు భేటీ

యోగాకు యోగం.. ప్లాస్టిక్‌కు నిషేధం

రాజ్‌భవన్‌లో కార్యక్రమాలపై రిపోర్టు

హోంమంత్రి అమిత్ షాతోనూ సమావేశం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** తెలంగాణ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ, శాంతిభద్రతల పరిస్థితులపై కేంద్రం ఆరా తీస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌ను హుటాహుటిన ఢిల్లీ పిలిపించింది. మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీ చేరుకున్న గవర్నర్, సాయంత్రం గం. 6.00 సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సమావేశమై, సుమారు 40 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గవర్నర్‌గా బాధ్యతలు ➪ 3వ పేజీలో...

## హుజూర్‌నగర్‌పై ఈసీ షాడో!

**ధనప్రవాహం.. మద్యం పంపిణీపై ప్రత్యేక నజర్**




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మరో ఐదు రోజుల్లో జరగనున్న హుజూర్‌నగర్ ఉపఎన్నికపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. ఈనెల 21న జరగనున్న ఈ ఉపఎన్నికను అత్యంత పారదర్శకంగా జరిపేందుకు ముగ్గురు ఉన్నతాధికారులను ఎన్నికల సంఘం పరిశీలకులుగా నియమించింది. ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన రాజకీయ పక్షాలన్నీ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో నగదు, మద్యాన్ని విచ్చలవిడిగా పారించే అవకాశముందని ప్రచారం జరుగుతుండడంతో ఎన్నికల సంఘం ఈ ఉపఎన్నికకు పటిష్ట చర్యలు చేపట్టింది.

ఎమ్మెల్యేగా పోటీకి దిగే అభ్యర్థి గరిష్టంగా రూ.28 లక్షలను ఖర్చు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం నిర్ణ యించిన సంగతి తెలిసిందే. కానీ హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో వ్యయ పరిమితికి మించి 400 రెట్లకు పైగా అభ్యర్థులు ఈ ఎన్నికలో ఖర్చు చేస్తారన్న నిఘా వర్గాల సమాచారంతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ముగ్గురు పరిశీలకులను నియమించింది. ముగ్గురు సీనియర్ అధికారులను ఈ నియోజకవర్గంలో మకాం వేయించి పరిస్థితులను సమీక్షిస్తున్నట్టు తెలుస్తోంది. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సత్యేంద్ర సింగ్ సాధారణ పరిశీలకుడిగా, ఇదే రాష్ట్రానికి చెందిన మరో సీనియర్ ఐఏఎస్ అధికారి జీకే గ్లోకని, మరో ఐఆర్ఎస్ అధికారి బాలకృష్ణన్‌ను అదనపు వ్యయ పరిశీలకుడిగా ఎన్నికల సంఘం నియమించిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో ఖర్చుకు డబ్బు ఎక్కడి నుంచి వస్తున్నది? ఏ మార్గాల ద్వారా హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చేరుతున్నది? ఎవరెవరికి ఈ నిధులు అందుతున్నాయన్న అంశంపై ముగ్గురు పరిశీలకులు ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఓటర్లను ప్రభావితం చేసేందుకు డబ్బును ఎలా, ఎవరి ద్వారా పంచుతున్నది, అంతిమంగా అభ్యర్థులు చేస్తున్న ఖర్చు ఎంత, ఎన్నికల ప్రచారానికి పెడుతున్న వ్యయం అంశాలపై వివిధ కోణాల్లో ➪ 3వ పేజీలో...

## కృష్ణా జలాల పంపకాలివే!

తెలంగాణకు 79 టీఎంసీలు

ఏపీకి 69 టీఎంసీలు

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఉత్తర్వులు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కృష్ణా నదీ యాజమాన్య బోర్డు మంగళవారం తెలుగు రాష్ట్రాలకు నీటిపంపిణీ ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణకు 79 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 69.346 టీఎంసీల నీరు విడుదలకు అనుమతి తెలిపింది.

తెలంగాణ నీటి అవసరాల కోసం కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 15టీఎంసీలు, నాగార్జునసాగర్ ఎడమకాల్వ ద్వారా 45 టీఎంసీలు కేటాయించింది. హైదరాబాద్ తాగు నీటి అవసరాల కోసం 17టీఎంసీలు, మిషన్ భగీరథ కోసం మరో 2 టీఎంసీలు కేటాయిస్తూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఉత్తర్వులు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ కృష్ణాడెల్టా అవసరాలకు పులిచింతల నుండి నీటిని వినియోగించు కోమని సూచించింది. మూడురోజుల క్రితం జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో నవంబర్ నెలాఖరు వరకు వినియోగానికి రెండు రాష్ట్రాల నుండి ఇండెంట్లు తీసుకున్న అధికారులు మంగళవారం కేటాయింపులకు సంబంధించి ఉత్తర్వులు జారీచేశారు.




## దరఖాస్తుల కిక్



మద్యం దుకాణాలకు ఒక్కరోజే 10వేలకు పైగా దరఖాస్తులు • నేడు చివరి రోజు • భారీ అంచనాలతో ఏర్పాట్లు 8

## ఎల్‌ఆర్‌ఎస్‌కు ఎస్


జిల్లా కలెక్టర్లతో మంత్రి కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్

అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లకు అవకాశం

కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకే చాన్స్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో వెలిసిన అనధికార లే అవుట్లలోని ప్లాట్ల(ఇంటి స్థలాల) రెగ్యులైజేషన్‌కు మరోసారి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ అవకాశం కేవలం కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకే వర్తించనుందని ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో వెల్లడించింది.

2018 మార్చి 30 నాటికి రెన్యూవల్ అయిన ప్లాట్లకే వర్తించనుంది. ఇందుకు హెచ్ఎండీఏ, నూతన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు ఆయా పరిధిల్లో బాధ్యతలు తీసుకుంటాయి. ఇతర మున్సిపాలి టీలు, కార్పొరేషన్లలో జిల్లా టౌన్ ప్లానింగ్ శాఖ క్రమబద్ధీకరిస్తుందని ప్రభుత్వం తెలిపింది. జీవో 111, ఎఫ్‌టీఎల్, నాలా, చెరువు శిఖం, బఫర్ జోన్ల పరిధిలోని వాటిని క్రమబద్ధీకరించేందుకు అవకాశం లేకపోగా, మాస్టర్ ప్లాన్, ఇండస్ట్రియల్ జోన్లు, జోనల్ డెవలప్‌మెంట్ పరిధిల్లోని ప్లాట్లను కూడా క్రమబద్ధీకరించరు. ఇందుకు ప్యానల్ నిర్దేశిత రుసుములను వసూలు చేయనున్నారు. అన్ని మున్సిపాలిటీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందుకు 90 రోజుల సమయమిచ్చిన ప్రభుత్వం రూ. 10వేలు లేదా 10శాతం ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని దరఖాస్తుతో పాటు చెల్లించాల్సి ఉంటుంది. 6 నెలల్లో పూర్తి మొత్తం చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలని తెలిపింది.

## మున్సిపల్ సిబ్బందికీ బీమా

పట్టణాలకు ప్రగతి ప్రణాళిక

జిల్లా కలెక్టర్లతో మంత్రి కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్ 3

## కౌలు లేదు.. లీజే!



వ్యవసాయ భూముల విధానంలో కొత్త విధానం

కౌలు రైతుల గుర్తింపు, రుణఅర్హత కార్డుల జారీ నిలిపివేత

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కౌలు రైతుల పేరు తెలంగాణలో ఇక వినిపించదు. వీరి గుర్తింపు గతమే అయింది. నిజమైన భూ యజమానులకు ఇబ్బందులొస్తున్నాయని భావించిన ప్రభుత్వం కౌలు పూర్తిగా తొలగించి భూముల లీజును తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగానే ఇ-పట్టాదార్ పాస్ పుస్తకాల్లో కౌలు కాలమ్‌ను ప్రభుత్వం తొలగించింది. దీంతో కౌలు రైతుల అధికారిక గుర్తింపుతోపాటు రుణ అర్హత కార్డుల జారీని పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీఎం కేసీఆర్ ఇటీవల శాసనసభలో చేసిన ప్రకటన నేపథ్యంలో కౌలుకు కాలం చెల్లిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో కౌలు రైతుల రక్షణ చట్టం-1950 ద్వారా కౌలు రైతులకు గతంలో గుర్తింపు దక్కేది. వారి పంట పెట్టుబడికి వీలుగా ప్రభుత్వాలు, ఆర్థిక సంస్థలు రుణాలు మంజూరు చేసేవి. వీటికి రుణ అర్హత కార్డులను కొలమానంగా గుర్తించేవారు. తాజాగా ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలతో పాటు త్వరలో ఉచితంగా యూరియా అందజేతకు శ్రీకారం చుడుతోంది. ఈ సమయంలో భూ రికార్డుల ప్రక్షాళన, రైతు సర్వే తర్వాత కౌలు రైతుల పేరుతో నిజమైన భూ యజమానులకు కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. రాష్ట్ర ఆవిర్భావం నుంచే తెలంగాణ సర్కార్ కౌలును గుర్తించేది లేదని, కౌలు రైతుల గుర్తింపుతో భూ యజమానులకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంటూ వచ్చింది. కౌలు రక్షిత చట్టం ప్రకారం కౌలుదారులకు రుణ అర్హత కార్డులు ఇస్తే అనేక సమస్యలు వస్తాయని భావించిన ప్రభుత్వం దీనికి విరుగుడుగా మొత్తం ఈ వ్యవస్థ రద్దే మంచిదని అంచనాకు వచ్చింది. ఇక ఇందుకు ఆర్డినెన్స్ జారీ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల్లో కౌలు రైతుల పరిరక్షణ అత్యంత కీలకమైందిగా ➪ 3వ పేజీలో...

## సేంద్రీయ సాగు బాగు



చిన్న, సన్నకారు రైతులకు పాడి ఆవుల పంపిణీ

మంత్రి హరీష్‌రావు 3

## ఎస్సీ, ఎస్టీల పథకాలపై సమీక్ష

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఇండస్ట్రీస్, లిడ్‌క్యాప్ సంస్థ ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఉద్యోగుల వివరాలు, వాళ్ల సమస్యలు, ఆర్వోరు అమలుపై వివరాలను ఇవ్వాల్సిందిగా కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ సూచించారు. ఆయా వర్గాలకు చెందిన లబ్దిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలపైన కూడా ఆరా తీశారు. లిడ్ క్యాప్‌కు వచ్చిన ఆర్డర్లు, పని చేస్తున్న యూనిట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్దిదారుల కోసం శాఖ ద్వారా చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు, 2018- 19, 2019-20 సంవత్సరాల్లో ఎస్సీ డెవలప్‌మెంట్ ఫండ్ ఖర్చు, స్కీం వారిగా కేటాయింపు, ఖర్చులకు సంబంధించిన వివరాలపైన ఆరా తీశారు.

## ఫరూక్ అబ్దుల్లా సోదరి, కుమార్తె అరెస్టు

**శ్రీనగర్:** జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా కుమార్తె, సోదరి సహా పలువురు మహిళా నిరసనకారులను మంగళవారం శ్రీనగర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిరసనకారుల్లో అబ్దుల్లా సోదరి సురయ్య అబ్దుల్లా, ఆయన కుమార్తె సఫియా అబ్దుల్లా ఖాన్, జమ్మూ కాశ్మీర్ మాజీ చీఫ్ జస్టిస్ బషీర్ అహ్మద్ ఖాన్ భార్య హవా బషీర్‌తో పాటు ప్రముఖ విద్యావేత్తలు, మహిళా కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా సురయ్య అబ్దుల్లా విలేఖరులతో మాట్లాడుతూ ఆగస్టు 5న మమ్మల్ని మా ఇళ్లల్లో బంధించి ఆర్టికల్ 370 రద్దు చేశారన్నారు. ఇది బలవంతంపు వివాహం వంటిదని చెల్లదన్నారు. శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ సమీపంలోని ప్రతాప్ పార్క్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకుని వారిని సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం ఆగస్టు నుంచి మాజీ సీఎంలు ఫరూక్ అబ్దుల్లా, ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లాతో పాటు మెహబూబా ముఫ్తీ గృహ నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నారు. శ్రీనగర్‌లోని ఫరూక్ అబ్దుల్లా (83) స్వగృహంలో నిర్బంధంలో ఉన్న ఆయనపై ప్రభుత్వం పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ (పీఎస్ఏ) ప్రకారం అభియోగాలు మోపింది. ఈ చట్టం ప్రకారం మూడు నుంచి ఆరునెలలు వరకు విచారణ లేకుండానే నిర్బంధించవచ్చు.

## విక్రమ్ కోసం నాసా అన్వేషణ

**చెన్నై:** ఇస్రో ప్రయోగించిన మూన్ ల్యాండర్ విక్రమ్ ఆచూకీని యూఎస్ అంతరిక్ష సంస్థ నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) త్వరలో తెలిపే అవకాశం ఉంది. అక్టోబర్ 14న తమ లూనార్ ఆర్బిటర్ (ఎల్ఆర్ఓ) విక్రమ్ ల్యాండ్ అయిన ప్రాంతంగా అంచనావేస్తున్న ఉపరితల పరిధిలో పయనించిందని నాసా సీనియర్ అధికారి ఒకరు న్యూయార్క్‌లో మీడియాకు తెలిపారు. అయితే ఇంతకుముందు యూఎస్ స్పేస్ ఏజెన్సీ తమ ఎల్ఆరఓ విక్రమ్ ల్యాండింగ్ సైట్‌ను దాటిందని ప్రకటించినా లూనార్ రికనైసెన్స్ ఆర్బిటర్ కెమెరా (ఎల్ఆర్ఓసీ) ల్యాండర్‌ను గుర్తించలేకపోయిందని నాసా తెలిపింది. మూన్ ల్యాండర్ విక్రమ్ చంద్రునిపై ఎత్తయిన మృదువైన మైదాన ప్రాంతం సింపెలియన్ ఎన్ మరియు మాంజినస్ సి క్రేటర్స్ మధ్య ల్యాండ్ అయినట్లు నాసా తెలిపింది. విక్రమ్ ల్యాండింగ్ సైట్ దక్షిణ ధ్రువం నుంచి 600 కిలోమీటర్లు (370 మైళ్లు) 70.8ఏఓఎస్ అక్షాంశం, 23.5ఏఓఈ రేశాంఖం మధ్య ఉన్నట్టు యూఎస్ ఏజెన్సీ తెలిపింది.

# అయోధ్య కేసు విచారణలో తుది అంకం!

## నేటితో ముగియనున్న వాదనలు

- పొడగింపునకు అవకాశమేలేదని సీజే స్పష్టత
- నవంబర్ 17న గొగోయ్ పదవీ విరమణ
- అప్పటికలోగా ఏ క్షణంలోనైనా తీర్పు!
- చివరి దశలో కీలకమైన వాదనలు
- తీర్పుపై ఎనలేని ఉత్కంఠ
- అనుకూల తీర్పుపై ఎవరికి వారే ధీమా







**న్యూఢిల్లీ :** రాజకీయ, మత, సామాజికపరమైన సున్నిత అంశాలతో ముడిపడిన దశాబ్దాల నాటి చారిత్రక అయోధ్య భూవివాదం కేసు విచారణ తుదిదశకు చేరుకుంది. కేసులో వాదనలు అక్టోబర్ 16 వరకు మాత్రమే కొనసాగుతాయని, ఆ తర్వాత పొడగింపు ప్రసక్తేలేదని ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న సీజే జస్టిస్ రంజన్ గొగోయ్ ఇదివరకే చెప్పిన ఆయన మరోసారి స్పష్టం చేశారు. దీంతో వాదనలకు రేపు చివరి రోజవ్వడంతో వాదనలు ఇక ముగిసినట్టేననే భావన ఏర్పడింది. సీజే రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేయనున్న నవంబర్ 17 లోపు ఏ క్షణం లోనైనా అయోధ్య కేసులో తీర్పు వెల్లడయ్యే అవకాశాలుంటాయి. చివరి అంకంలో సీజే రంగన్ గొగోయ్ నేతృత్వంలోని జస్టిస్ ఎస్ఏ బొబ్డే, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎస్ఏ నజీర్‌లు ఇరుపక్షాల వాదనలు శ్రద్ధగా వింటున్నారు. కేసు విచారణలో అత్యంత ముఖ్యమైన చివరి వారంలో ఇరుపక్షాలు బలమైన వాదనలు వినిపిస్తున్నా యి. ఇప్పటికే హిందూ పక్షాల వాదనలు పూర్త వ్వడంతో సున్నీ వక్ఫ్ బోర్డ్ తరపున సీనియర్ అడ్వకేట్ రాజీవ్ ధవన్ బలంగా వాదనలు వినిపిస్తున్నారు. ఒక జన్మస్థలాన్ని చట్టబద్ధమైన వ్యక్తిగా పరిగణించడం కుదరదు. బాబ్రీ మసీదు ప్రధాన గోపురం దిగువనే రాముడి జన్మస్థలం ఉందనే హిందూపక్షాల వాదనలను తిప్పికొడుతున్నారు. సున్నీ వక్ఫ్ బోర్డ్ తరపున వాదనల న్నీ ధవనే వినిపిస్తు న్నారు. ముగ్గురు సీనియర్ న్యాయవాదుల సహాయం తీసుకుంటున్నప్పటికీ వాదనలు మాత్రం ఆయనొక్కరే వినిపిస్తున్నారు. అయితే, హిందూ పక్షాల వాదనలు మాత్రం వ్యూహాత్మకంగా కొనసాగుతున్నాయి. న్యాయవాదులందరూ అంశాలను బట్టి వేరువేరుగా వాదనలు వినిపిస్తున్నారు. రాముడి జన్మస్థలంపై సీనియర్ అడ్వకేట్ కె.పరాశరన్, ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) రిపోర్ట్‌పై సీనియర్ అడ్వకేట్ సీఎస్. వైద్యనాధన్, ఇస్లామిక్ చట్టంపై సీనియర్ అడ్వకేట్ పీఎన్ మిశ్రా, నిర్మోహీ అఖారా తరపున సీనియర్ అడ్వకేట్ సుశీల్ జైన్ వాదనలు వినిపిస్తున్నారు. హిందూదేవాలయంపై బాబ్రీ మసీదును నిర్మించారని పేర్కొంటున్న ఏఎస్ఐ రిపోర్ట్‌లోని అంశాలను న్యాయవాదులు బలంగా ప్రస్తావిస్తున్నారు. అయితే ఈ వాదనలకు ముస్లిం పక్షాలు సమర్ధవంతంగా సమాధానాలివ్వగలుతున్నాయి. ఏఎస్ఐ రిపోర్ట్ అసంబద్ధంగా ఉందని చెబుతున్నాయి. చరిత్రలో పేర్కొన్న యాత్రికులు, సందర్శకుల రచలను నవ్మాల్సిన అవసరం లేదని, హిందూ దేవాలయంపైనే మసీదును నిర్మించారనేందుకు ఒక్క ఆధారం కూడా లేదని ముస్లింపక్ష న్యాయవాదులు వాదిస్తున్నారు. వివాదాస్పదం స్థలంలోనే రాముడు జన్మించారనే వాదనలను తోసిపుచ్చుతున్నారు.

### అయోధ్యలో 144 సెక్షన్ విధింపు

తీర్పు వెలువడనున్న నేపథ్యంలో డిసెంబర్ 10 వరకూ అయోధ్య జిల్లాలో సెక్షన్ 144 విధిస్తూ జిల్లా మెజిస్ట్రేట్ అనుజ్ కుమార్ ఝూ ఆదేశాలు జారీ చేశారు. పండుగలు సమీపిస్తున్నప్పటికీ సెక్షన్ 144ను అమలు చేయాలని నిర్ణయించామని సోమవారం ఆయన వివరించారు. దీపావళి సందర్భంగా రామాలయం వద్ద కాంతి దీపాలను వెలిగిస్తామని వీహెచ్‌పీ నాయకులు కోరడంతో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వీహెచ్‌పీ వినతిపై ముస్లింల నుంచి కూడా ప్రతిస్పందన వచ్చింది. హిందువులు దీపాలు వెలుగిస్తే తాము నమాజ్ చేస్తామంటూ హాజీ మెహమూద్ అనే వ్యక్తి సుప్రీంలో పిటిషన్ వేశాడు. నమాజ్‌కు అనుమతి కోరాడు. తీర్పు ఇచ్చే రోజు నుంచి ఏడాది తిరిగేలోపే రామమందిరాన్ని నిర్మిస్తారని రాజస్థాన్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే జ్ఞాన్‌చంద్ పరఖ్ వ్యాఖ్యానించడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే.

### జన్మస్థలం చట్టబద్ధ సంస్థేనా?

ఒక జన్మస్థలాన్ని చట్టబద్ధమైన సంస్థ( లేదా వ్యక్తి)గా పరిగణించవచ్చా?.. విచారణ చివరి అంకంలో సుప్రీంకోర్ట్ ముందున్న ప్రధాన ప్రశ్న. రామజన్మస్థలాన్ని చట్టబద్ధమైన సంస్థ(వ్యక్తి)గా పరిగణించాలని హిందూ పక్షాలు కోరుతుండడంతో ఈ అంశంఆసక్తికరంగా మారింది. హిందూ చట్టం కోణంలో ఒక స్థలాన్ని చట్టమైన వ్యక్తి లేదా సంస్థగా గుర్తించవచ్చునని రామ్ లల్లా విరజ్‌మాన్ తరపున సుప్రీంకోర్ట్‌కు వాదనలు వినిపించిన సీనియర్ అడ్వకేట్ కే.పరాశరణ్ చెబుతున్నారు. ఈ అంశంలో స్పష్టత కోసం రోమన్ చట్టాలు లేదా ఇంగ్లీష్ చట్టాలను పరిశీలించాల్సిన అవసరంలేదని కోర్టులో వాదించారు.విగ్రహాన్ని ప్రతిష్టించని దేవాలయాన్ని సంస్థగా భావించరు. ఎందుకంటే అక్కడికి భక్తులు వెళ్లరు. దేవుడిని కొలవరు. దేవుడి పేరు మీదనే దేవాదాయ ఆస్తుల నిర్వహణ కూడా జరుగుతోందని సీనియర్ న్యాయవాది పరాశరణ్ పేర్కొన్నారు. హిందూ సంప్రదా యంలో విగ్రహా లు ఉన్న చోట్లా లేని ప్రదేశాల్లో కూడా ఆరాధన చేయవచ్చని హిందూ చట్టం చెబుతోంది. ఒక విగ్రహాన్ని చట్టబద్ధమైన వ్యక్తిగా పరిగణించాలా లేదా అనే ప్రజల విశ్వాసంపై ఆధారపడి వుంటుంది. భక్తుల హక్కుల ప్రకారం విగ్రహాన్ని చట్టబద్ధమైన వ్యక్తిగా పరిగణించాలి. విగ్రహాన్ని చట్టబద్ధమైన వ్యక్తిగా పరిగణించకపోతే భక్తుల హక్కులను కాపాడడం ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఇదిలావుండగా డిసెంబర్ 6, 1992న కూల్చిన బాబ్రీ మసీదు ప్రధాన గోపురం దిగువ ప్రాంతమే రాముడి జన్మస్థలమని హిందువుల విశ్వాసం. ఈ ప్రాంతాన్ని చట్టబద్ధమైన సంస్థ లేదా వ్యక్తిగా గుర్తించాలని హిందూ పక్షాలు వినిపిస్తున్నాయి. ఈ వాదనలను ముస్లిం పక్షాలు ఖండిస్తున్నాయి.

### వీహెచ్‌పీ విశ్వాసం

అయోధ్య భూవివాదం కేసు విచారణ తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) స్పందించింది. సుప్రీం ఇచ్చే తీర్పు అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి బాటలు వేస్తుందనే విశ్వాసం వ్యక్తం చేసింది. వాస్తవాలు, నిజాలు, అలహాబాద్ కోర్ట్ తీర్పుతోపాటు ప్రపంచం నమ్ముతున్నట్టుగా ఇతర అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే తీర్పు తమకు అనుకూలంగా వస్తుందనే నమ్మకం ఉందని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి వినోద్ బన్సల్ ధీమా వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పు మాకు అనుకూలంగా వస్తుందనే నమ్మకం ఉంది. ఈ తీర్పు రామమందిర నిర్మాణానికి బాటలు వేస్తుందని నమ్ముతున్నామని ఆయన పేర్కొన్నారు. ఇదే అంశంపై హిందూ మహాసభ న్యాయవాది విష్ణుశంకర్ జైన్ స్పందించారు. అయోధ్య భూవివాదం కేసులో అంశాలవారిగా మేము స్పష్టతతో ఉన్నాం. మాకు మధ్యవర్తి త్వం అవసరంలేదు. కేసు విచారణ ఇప్పటికే 38 రోజులు కొనసాగింది. 16 రోజులపాటు హిందూ పక్షాలు వాదనలు వినిపించాయి. మేము వాదనలు బలంగా వినిపించాం. త్వరలోనే ముస్లిం పక్షం కూడా వాదనలు పూర్తి చేస్తుందని భావిస్తున్నా మని ఆయన అన్నారు. తదుపరి కార్యాచరణపై తీర్పు వెలుడిన తర్వాత నిర్ణయం తీసుకుంటాం. తీర్పును పునఃసమీక్షకోరాలా లేదా పార్లమెంట్‌ను ఆశ్రయించాలా అనే అంశాలను తీర్పు వెలువడిన తర్వాత మాత్రమే పరిగణిస్తాం. అన్నింటి కంటే ముందు తీర్పు వెలువడాల్సి ఉందని జైన్ అన్నారు.

### ముస్లిం పక్షాల్లో నమ్మకం

అయోధ్య భూవివాదం కేసు విచారణ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని ముస్లింపక్షాల తరపు న్యాయవాదులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మేము జ్యోతిష్కులం కాదు. తీర్పును ముందే అంచనా వేయలేం. కానీ ఒక విషయం చెప్పగలం. మా పక్షం బలంగా వాదనలు వినిపించింది. డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పించింది. న్యాయం జరుగుతుందనే నమ్మకం, విశ్వాసం ఉన్నాయని సున్నీవక్ఫ్ బోర్డ్ తరపు న్యాయవాది షకిల్ అహ్మద్ ధీమావ్యక్తం చేశారు. తీర్పును ముందే అంచనా వేయలేం. కానీ హిందూ పక్షాల వాదనలకు బలమైన కౌంటర్లు ఇచ్చామని ముస్లింపక్షం తరపున వాదనలు వినిపించిన మరో న్యాయవాది జాఫర్యాబ్ జిలానీ వ్యాఖ్యానించారు. ముస్లిం పక్షం తరపున బలంగా వాదనలు వినిపించామని ఆయన వివరించారు. అక్టోబర్ 16న వాదనలు ముగియనున్న చివరి అంకం నేపథ్యంలో న్యాయవాదులు ఈ విధంగా స్పందించారు. ముస్లిం పక్షం తరపున సీనియర్ న్యాయవాది ధవన్ బలంగా వాదనలు వినిపిస్తున్నారు. హిందూ పక్షాల వాదనలకు ఆయనొక్కరే కౌంటర్ ఇస్తున్నారు. న్యాయవాది ధవన్ వాదనలకు హిందూ పక్షాలు గడువులోగా సమాధానమివ్వాల్సి ఉంటుంది. కేసు విచారణ అక్టోబర్ 16న ముగియనుందని సీజే రంజన్ గొగోయ్ ఇదివరకే స్పష్టం చేశారు. కేసు విచారణ గడువును పొడగించే అవకాశమేలేదని తేల్చిచెప్పారు.

### నేటితో వాదనలు పూర్తి: సీజే



అయోధ్య భూవివాదం కేసు విచారణ వాదనలకు రేపు అనగా బుధవారమే చివరి రోజు అని సీజే రంజన్ గొగోయ్ తేల్చి చెప్పారు. ఈ రోజు 39వ రోజు. రేపటికి 40వ రోజు. అంతేకాకుండా వాదనలకు చివరి రోజని ఆయన స్పష్టం చేశారు. ఇదిలావుండగా అక్టోబర్ 16లోగా వాదనలు పూర్తి చేయాలని కేసులో పక్షాలకు ఇదివరకే సీజే స్పష్టం చేశారు.

### బాబర్‌ది చారిత్రక తప్పిదం



అయోధ్య భూవివాదం కేసులో 39వ రోజు వాదనలు కొనసాగాయి. ఒక్క అయోధ్యలోనే 55-60 మసీదులు ఉన్నాయి. కానీ హిదువులకు రాముడి జన్మస్థలం ఒక్కటి మాత్రమే ఉంది. రాము డి జన్మస్థలాన్ని మార్చుకోలేమని రామ్ లల్లా విరజ్ మాన్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది పరాశరణ్ వాదనలు వినిపించారు. ముస్లింలు నమాజ్ చేసేందుకు అనేక మసీదులు ఉన్నాయి. అయితే హిందువు లు పూజించేందుకు ఒక్క రాముడి జన్మస్థలం మాత్రమే ఉందన్నారు. మొగల్ పాలకుడు బాబర్ చారిత్రక తప్పు చేశారు. దేవాలయం స్థానంలోనే మసీదును నిర్మించడం చారిత్రక తప్పిదం. ఈ తప్పును సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. రాముడి జన్మస్థలమనే కారణంగానే హిందువులు శతాబ్దాలుగా పోరాడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా పలు సాంకేతిక అంశాలపై న్యాయవాది పరాశరణ్‌ను న్యాయమూర్తులు ప్రశ్నించారు.



## రైతుకే ప్రాధాన్యత

- రైతు శిక్షణా సదస్సులో మంత్రి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రైతులు గొప్పగా బతికినప్పుడే తెలంగాణకు సార్ధకత లభిస్తుందని వ్యవసాయశాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వంలో ఏ కోణంలో చూసినా ప్రథమ ప్రాధాన్యత రైతు కుటుంబాల సంక్షేమేనని స్పష్టంచేశారు. ఆ దిశగా ఇప్పటికే కొన్ని లక్ష్యాలను చేసుకున్నామని, భవిష్యత్తులో మరింత చేయూతనిచ్చి ఈ రంగాన్ని ఆర్ధికంగా అగ్రస్థానంలో నిలబెట్టడమే కర్తవ్యమని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు సుగంధ ద్రవ్యాల సాగుతో రైతు ఆదాయం అనేక రెట్లు పెరుగుతుందని, ఆ దిశగా ప్రోత్సహించేందుకు వ్యవసాయశాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. మంగళవారం నాంపల్లిలోని ఉద్యాన శిక్షణా సంస్థలో నిర్వహించిన సుగంధ ద్రవ్యాల పంటల సాగు రాష్ట్రస్థాయి శిక్షణా సదస్సులో మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య పరిరక్షణపట్ల అవగాహన పెరుగుతోందని, ఈ నేపథ్యంలో సేంద్రీయ పంటల సాగుకు ప్రాధాన్యత కూడా పెరుగుతోందని అన్నారు. మారుతున్న పరిణామాలకు అనుగుణంగా పంటల ఎంపికలోనూ రైతులు ముందుచూపుతో ఉండాలని, మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తే అత్యధిక లాభాలు పొందవచ్చునని సూచించారు. ఈ సదస్సులో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి, ఉద్యానశాఖ డైరెక్టర్‌తోపాటు నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ సీడ్ స్పైస్ డైరెక్టర్, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆధునిక నైపుణ్యంతోనే యువతకు ఉపాధి

- మంత్రి సీహెచ్ మల్లారెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆధునిక నైపుణ్యాన్ని అందిస్తూ శిక్షణ సదుపాయాలను విస్త రించడం వల్ల విద్యావంతులైన నిరుద్యోగ యువతకు మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. పారిశ్రామిక, సేవా రంగాలకు నిపుణులైన మానవ వనరులను అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మంగళవారం నగరంలోని ప్యాప్సీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన అప్రెంటీస్ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్రెంటీస్ చట్టాన్ని సవరించి విద్యార్థులకు మేలు చేసే సవరణలు చేసి నందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాలకు ఏ రకమైన నైపుణ్యాలు అవసరమో గుర్తించి వాటికి అనుగుణంగా నైపుణ్య కార్య క్రమాలను రూపొందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి తెలిపారు. ఐ.టి.ఐల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అప్రెంటీస్ కొరకు ప్రాంగణ నియా మకాలు నిర్వహించి వివిధ కంపెనీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

## పాఠశాల విద్యలో మార్పులు

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పాఠశాల విద్యా ప్రమాణాలు, సమూలమైన మార్పులను తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. పాఠశాలలో మార్పులు తీసుకోవడానికి గల అంశాలపై జమీల్ అబ్దుల్ లతీప్ పావర్టీ యాక్షన్ ల్యాబ్ కో చైర్మన్ ప్రొఫెసర్ మురళీధరన్ భాగస్వామ్యంతో సలహాలు, సూచనలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు గాను జిల్లాల వారిగా క్రోడీకరించాలని నిర్ణయించారు. నాణ్యతో కూడిన పాఠశాల విద్యను విద్యార్థులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి తెలిపారు.



కాలుష్యంపై కదనభేరీ...
చేయి కలిపితే విజయభేరీ!
ప్లాస్టిక్‌తో పబ్బం గడిపితే...
ప్రజారోగ్యం పురోగతి అంతే!!
GO GREEN | SAY NO TO PLASTIC
సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ...
ఆంధ్రప్రభ


## కేమరోస్, సియారా లియోన్‌లతో సహకారానికి ఒప్పందాలు

- ఆఫ్రికా నుంచి ఢిల్లీ చేరుకున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ఆఫ్రికన్ యూనియన్ కమిటీలో కీలక పాత్ర పోషిస్తున్న సియారా లియోన్ - భారత్ మధ్య ఆరు రంగాల్లో సహకారం కోరుతూ ఒప్పందాలు జరిగాయి. ఆఫ్రికా దేశాలైన కేమరోస్, సియారా లియోన్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేపట్టిన ఐదు రోజుల పర్యటన విజయవంతంగా ముగిసింది. హిందూ మహా సముద్రంలోని ఈ రెండు ఆఫ్రికా ద్వీప దేశాల పర్యటన ముగించుకుని ఆయన మంగళవారం ఉదయం ఢిల్లీ చేరుకున్నారు. కేమరోస్, సియారా లియోన్‌ల్లో భారత ఉన్నతస్థాయి బృందం పర్యటించడం ఇదే తొలిసారి. కేమరోస్ పర్యటనలో ఆ దేశాధ్యక్షుడు అజాలీ అసొమని ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి స్వయంగా ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికారు. కేమరోస్ అత్యున్నత పౌరపుస్కారం 'ఆర్డర్ ఆఫ్ ద గ్రీన్ క్రెసెంట్'ను ఉపరాష్ట్రపతికి ప్రదానం చేశారు. కేమరోస్‌లో భారత సంతతి ప్రజలతో సమావేశమైన ఉపరాష్ట్రపతి భారత అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. 2021లో ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమానికి కామొరోస్ రావాలని ప్రవాస భారతీయులు కోరారు. ఈ పర్యటనలో కేమరోస్ పార్లమెంటునుద్దేశించి ఉపరాష్ట్రపతి చేసిన ప్రసంగానికి మంచి స్పందన వచ్చింది. పలు సందర్భాల్లో సభ్యులు లేచి నిలబడి చప్పట్లతో ఆయన్ను అభినందించారు. అంతకుముందు కేమరోస్‌తో రక్షణ, వైద్యం - ఆరోగ్యం, కళలు, సంస్కృతి, సమాచార సాంకేతిక సహా పలు రంగాల్లో పరస్పర సహకారం కోసం ఇరు దేశాల మధ్య ఒప్పందాలు జరిగాయి. సియారా లియోన్‌లో హైకమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉప రాష్ట్రపతి ప్రకటించారు. అభివృద్ధి సాయంగా ఆ దేశానికి 217.5 మిలియన్ డాలర్లు (దాదాపుగా రూ.15.5వేల కోట్లు) రుణంగా ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దీంతో పాటు నీటిపారుదల రంగ అభివృద్ధికి 30 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.214కోట్లు) రుణ సాయం ప్రకటించారు.

## చురుకుగా 30 రోజుల కార్యాచరణ

- గ్రామీణాభివృద్ధి శాఖ సమన్వయంతో అటవీశాఖ ముందడుగు
- పంచాయతీల్లో మొక్కల పెంపకం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో పచ్చదనం - పరిశుభ్రత పెంచటమే లక్ష్యంగా చేపట్టిన ముప్ఫై రోజుల కార్యచరణలో అటవీశాఖ మంచి పనితీరును కనబరిచింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో హరిత కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తున్నారు. ఇప్పటి వరకు అటవీశాఖ ఆధీనంలో ఉన్న నర్సరీలను గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించి, ప్రతి గ్రామంలో ఒక నర్సరీని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఖాళీ స్థలం ఎంతమేరకు ఉంది, ఎన్ని మొక్కలు నాటవచ్చు, వాటిని బతికించడానికి ఎలాంటి కార్యచరణతో ముందుకు పోవాలనే అంశాలపై గ్రామస్థాయి కమిటీలు నిర్ణయం తీసుకున్నాయి. ఈక్రమంలో గ్రామస్థులు కోరిన మొక్కలను అటవీశాఖ సరఫరా చేసింది. నర్సరీలలో మిగిలిన మొక్కల స్టాకును వచ్చే ఏడాది కోసం పెద్ద మొక్కలు సరఫరా చేసేందుకు వీలుగా పెంచాలని అటవీశాఖ నిర్ణయించింది. మొత్తం 12,751 గ్రామ పంచాయితీలలో హరిత కార్యాచరణ ప్రణాళిక రూపొందించగా, వాటిలో 12,292 గ్రామాల్లో ఒక్కో నర్సరీ ఏర్పాటుకు స్థలం గుర్తించి, మొక్కల పెంపకం పనులను చేపట్టారు. ముప్ఫై రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 24,244 కిలోమీటర్ల మేర గ్రామాలకు దారి తీసే రోడ్లు, గ్రామానికి మరో గ్రామానికి మధ్య అవెన్యూ ప్లాంటేషన్‌ను చేపట్టి, 80.88 లక్షల మొక్కలను నాటారు. గ్రామాల్లో గుర్తించిన ఖాళీ ప్రదేశాలు, సామూహిక ప్రాంతాల్లోని 40,522 ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్ కింద రెండు కోట్ల అరవై లక్షల మొక్కలను నాటారు. ఇంటింటికి ఆరు మొక్కల సరఫరాలో భాగంగా రెండు కోట్ల ఆరు లక్షల మొక్కలను సరఫరా చేశారు. నాటిన ప్రతీ మొక్కను కుటుంబ సభ్యుల మాదిరిగా భావించి పెంచాలని అధికారులు అన్ని గ్రామాల్లోని గ్రామస్థులకు ప్రత్యేకంగా విన్నవించారు. కోతుల కోసం అటవీ ప్రాంతాల్లోనే మంకీఫుడ్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా క్షీణించిన అటవీ ప్రాంతాల్లో కోతులు తినే పండ్లు, కూరగాయల మొక్కలను నాటుతున్నారు. మొత్తం మీద ముప్ఫై రోజుల కార్యచరణలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ఏడు కోట్ల ముప్ఫై రెండు లక్షల మొక్కలను నాటారు. అటవీశాఖ, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం పెంపుకు నిరంతర ప్రక్రియను వేగవంతం చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్, ఇతర ఉన్నతాధికారులు

# మున్సిపల్ సిబ్బందికి బీమా

**● పట్టణాలకు ప్రగతి ప్రణాళిక ● జిల్లా కలెక్టర్లతో మంత్రి కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, నగరాలను పరిశుభ్రంగా మార్చే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సూచించారు. 30 రోజుల గ్రామ పంచాయతీ ప్రణాళిక ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని, అదే స్ఫూర్తితో మునిసిపాలిటీల్లోనూ చేపట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో మంత్రి కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ పారిశుద్ధ్యంపైన ప్రతి పురపాలక, పట్టణ పారిశుద్ధ్య ప్రణాళిక తయారు చేసి మునిసిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. చెత్త సేకరణ నుంచి రీసైక్లింగ్ వరకు అన్ని వివరాలను ఈ ప్రణాళికలో పొందుపర్చాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ మార్గదర్శకాల మేరకు పురపాలికల్లో పారిశుద్ధ్య కార్మికులు, వాహనాలు నిర్దేశిత సంఖ్యలో ఉండేలా చూడాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

ఇప్పటికే పాత మునిసి పాలిటిల్లో స్వచ్ఛ ఆటోలు ఇచ్చామని, ఇంకా అవసరం ఉంటే వాహనాలు, సిబ్బందిని పెంచుకోవచ్చని మంత్రి కేటీఆర్ చెప్పారు. ప్రతి పారిశుద్ధ్య కార్మికునికి యూని ఫామ్‌తోపాటు అవసరమైన రక్షణ సామాగ్రిని సమకూర్చు కోవాలన్నారు. ప్రతి కార్మికునికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించేలా ఆయా ఏజెన్సీలను ఆదేశించాల న్నారు. పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు.

ప్రతి పట్టణానికి ఒక డంపుయార్డు ఉండాలని, డంపు యార్డులేని చోట స్థల సేకరణకు, డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఇప్పుడున్న ప్రతి పురపాలిక ఓపెన్ డిఫెకేషన్ ఫ్రీ (ఓడిఎఫ్) సాధించాయని, కొత్తగా మునిసిపాలిటీలుగా మారిన వాటిల్లోనూను ఓడిఎఫ్ సాధించేలా చూడాలన్నారు. 'ప్రతి పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణపై దృష్టి సారించి, అవసరమైన చోట మరిన్ని నిర్మించాలి. మహిళలకోసం ప్రత్యేకషీ-టాయిలెట్స్ నిర్మాణం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని పెట్రోల్ బంకులు, రెస్టారెంట్లలో టాయిలెట్స్ ప్రజలు వినియోగంచుకునేందుకు అవకాశం కల్పించాలి.

అందుకు యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేయాలి. అందుబాటులో ఉన్న టాయిలెట్స్‌పై సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి. వరంగల్, సిరిసిల్లలో మాది రిగా ప్రతి పట్టణంలో మానవ వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేయాలి. ప్రతి పట్టణానికి సమగ్ర మైన సిటీ శానిటేషన్ ప్లాన్‌ను తయారు చేసి, వారం రోజుల్లో డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సమర్పించాలి' అని మంత్రి సూచించారు.

నూతన పురపాలిక చట్టాన్ని అమలు చేయడంలో జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఈ చట్టంలో పేర్కొన్నట్లుగా గ్రీన్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. పట్టణాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు పురపాలిక బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించి ప్రతి పట్టణంలో నర్సరీని ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. పట్టణం లేదా పట్టణాలకు దగ్గరలో గ్రీన్ లంగ్ స్పేస్ (పెద్ద పార్కులు) ఏర్పాటు, పట్టణాల్లో ఉన్న తాగునీటి వనరుల మదింపు (ఆడిట్) చేయాలన్నారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, సీడీఎంఏ శ్రీదేవి, వాటర్ వర్క్స్ డైరెక్టర్ దానకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెపై కేంద్రానికి గవర్నర్ నివేదిక



(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్న తర్వాత తొలిసారిగా భేటీ కావడం మర్యాదపూర్వకమే అయినప్పటికీ, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఆర్టీసీ కార్మికుల సమ్మె, ప్రతిపక్షాల మద్దతుతో తలపెట్టిన రాష్ట్ర బంద్ తదితర అంశాలపై గవర్నర్ ప్రధానికి వివరించినట్టుగా తెలుస్తోంది. అలాగే గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాజ్‌భవన్‌లో చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి ప్రధానికి వివరించినట్టుగా గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ ఉత్సవాలను రాజ్‌భవన్‌లో నిర్వహించడంతో పాటు ప్లాస్టిక్ నిషేధం, యోగా తరగతుల ఏర్పాటు, రెడ్ క్రాస్ సంస్థతో కలిసి రక్తదానం వంటి కార్యక్రమాలను ప్రధాన మంత్రి మెచ్చుకున్నారని ప్రకటనలో పేర్కొన్నారు. బతుకమ్మ ఉత్సవాలకు సంబంధించి ఒక పుస్తకాన్ని ప్రధానికి అందజేసినట్టు వెల్లడించారు. ప్రధానికి హస్తకళలకు చెందిన మెమెంటో, పోచంపల్లి శాలువాను గవర్నర్ బహుకరించారు. ప్రధానితో సమావేశం ముగిసిన అనంతరం రాత్రి గం. 8.00 సమయంలో హోంమంత్రి అమిత్ షాతో గవర్నర్ తమిళిసై భేటీ అయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ, శాంతిభద్రతల పరిస్థితుల గురించే చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలు గవర్నర్‌ను కలిసి అందజేసిన వినతి పత్రాలను, కార్మికులకు ప్రభుత్వానికి మధ్య నెలకొన్న విభేదాలు, ఘర్షణ పూరిత పరిస్థితులను అమిత్ షాకు గవర్నర్ వివరించడంతో పాటు ఓ నివేదికను సైతం అందజేసినట్టు సమాచారం.

# కౌలు లేదు..లీజే!

(మొదటిపేజీ తరువాయి)

ఉండగా, రైతుకు తప్ప తమ భూమిపై మరెవరికీ హక్కులు లేకుండా ప్రభుత్వం ఈ కీలక చర్యలకు దిగుతోంది. 2017లో ప్రభుత్వం నిర్వహించిన రైతు సమగ్ర సర్వే కౌలుదారులను పరిగణలోకి తీసుకోలేదు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనలో కౌలును ఎక్కడా అధికారికంగా ప్రస్తావించకుండా నిజమైన భూ యజమానులకు హక్కులను కల్పించింది. రాష్ట్రంలో రైతుల గుర్తింపు, సాగు భూమి లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో కౌలు రైతులకు ఎవరూ భూములను ఇవ్వకపోగా, ప్రభుత్వం కూడా కౌలు రైతుల వివరాలనూ సేకరించేందుకు ఇష్టపడలేదు. 10854 గ్రామాల్లో జరిగిన భూ రికార్డుల ప్రక్షాళనలో కౌలు రైతు ఎవరనే వివరాలెక్కడా నమోదు కాలేదు. దీంతో ప్రభుత్వ పరంగా కౌలు రైతులకు గుర్తింపునిచ్చి ఆర్థికంగా ఆదుకునే రుణ అర్హత కార్డుల జారీ నిల్చిపోయింది. నూతన సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి రావడంతో రైతుబంధు, రైతు బీమాలతో భూ యజమానులందరూ తమ భూములను సాగు చేసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో సాగునీటి వసతి, వ్యవసాయ విస్తరణ, ఇతర సౌకర్యాలు పెరగడంతో వరితోపాటు, ఇతర వాణిజ్య పంటల్లో పెరుగుదల నమోదైందని తెలుస్తోంది. సాగుపై కౌలు ప్రభావం పెద్దగా లేదని, అప్పట్లో కౌలు రైతులు ఇప్పుడు లీజు రైతులుగా సాగుకు సై అంటున్నారని భూ యజమానులు చెబుతున్నారు.

**ఇక కౌలు లేదు... రుణం లేదు...!**

రెండేళ్ల క్రితం రెవెన్యూ శాఖ కౌలు రైతుల గుర్తింపునకు కార్యాచరణ చేపడుతున్న సమయంలోనే రైతులకు ఎకరాకు రూ. 8 వేల పెట్టుబడి సాయాన్ని అందించేరైతుబంధు పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆ తర్వాత రైతు సర్వేను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించారు. దీంతో ప్రతీ ఏడాది గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు ఫిబ్రవరిలో గుర్తింపు కార్డులను ఇవ్వాలన్న నిబంధన అప్పటి నుంచే నిల్చిపోయింది. గ్రామాల్లో దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచి ఫారం-2 రికార్డుల్లో కౌలు దార్ల పేర్లను నమోదు చేయాలి. అయితే సీఎం ప్రకటన తర్వాత వ్యవసాయ అధికారుల సర్వేలో అసలు భూ యజమానులు తమ భూములను తామే సాగు చేసుకుంటున్నట్లుగా నమోదు చేయించుకున్నారు. మరోవైపు కౌలుకు తమ భూములను ఇస్తున్నట్లుగా కౌలు కాలమ్‌లో రాయించుకుంటే పెట్టుబడి సాయం వారికే పోతుందనే అనుమానంతో యజమానులు కౌలుకు భూమిలిచ్చేందుకు నిరాకరించారు. పహాణీ, పట్టాదార్ పాసుపుస్తకం, రెవెన్యూ రికార్డుల్లో అవసరంలేని కాలమ్‌లను తొలగించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా కౌలుదారు కాలమ్‌ను తొలగించారు.

# హుజూర్‌నగర్‌పై ఈసీ షాడో!




(మొదటిపేజీ తరువాయి)

పరిశీలకులు వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వాడుతున్న వాహనాలతో సహా ప్రచార సామాగ్రికి ఖర్చు చేస్తున్న మొత్తాలపై పరిశీలకులు ప్రత్యేకంగా దృష్టిసారించినట్టు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో ఎన్నికల సంఘం ప్రత్యేక బృందాలను నియమించి లెక్కలు తీసే పనిని వారికి అప్పగించినట్టు చెబుతున్నారు. గత ఎన్నికల్లో అత్యధికంగా ధన ప్రవాహం జరిగిన నియోజకవర్గాల్లో హుజూర్‌నగర్ ముందు వరుసలో ఉంది. ఈ ఉపఎన్నికలోనూ పెద్దఎత్తున ధనాన్ని, మద్యాన్ని పారించే అవకాశాలు ఉన్నాయని నిఘా వర్గాలు ఉప్పందించడంతో పరిశీలకులు గ్రామగ్రామాన తిరుగుతూ సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. 2014 ఎన్నికల్లో పట్టుబడిన నగదులో సింహభాగం ఈ నియోజకవర్గానిదేనని ఎన్నికల సంఘం గుర్తించింది. గతంలో కంటే మరిన్ని ఎక్కువగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు 20కిపైగా షాడో బృందాలను రంగంలోకి దింపినట్టు తెలుస్తోంది. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియోజకవర్గమంతా తిప్పుతూ ఆయా పార్టీల అభ్యర్థులు, అగ్రనేతలు చేస్తున్న ఎన్నికల ప్రచారాన్ని వీడియో తీస్తున్నట్టు తెలుస్తోంది. ప్రలోభాలు, తాయిలాలపై జిల్లా స్థాయి అధికారులను ఈ నియోజకవర్గంలో పరిశీలకులుగా నియమించినట్టు సమాచారం. ఎన్నికల సంఘం పకడ్బందీగా దాడులు చేస్తుండడంతో ప్రధాన పార్టీల నేతల్లో గుబులు రేగుతోంది. డీజేలు, ర్యాలీలు, వాహనాల కాన్వాయ్ ఇలా ప్రతి దానికి లెక్కలు చెప్పాలని ఎన్నికల సంఘం హెచ్చరించడంతో ప్రధాన పార్టీలు హడావుడిని తగ్గించి ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. అభ్యర్థులతో పాటు వారి తరపున ప్రచారంచేసే నేతలు, కార్యకర్తలు వేసుకునే కండువాలు, ప్రజలకు అందజేస్తున్న కరపత్రాలు అన్నింటికీ లెక్కలు చెప్పాల్సి రావడంతో ప్రధాన పార్టీలు అయోమయంలో పడిపోతున్నాయి.

ఎన్నికల సంఘం నియామకంతో రంగంలోకి దిగిన బాలకృష్ణన్ ఎక్కడికక్కడ బృందాలను నియమించారు. ఇప్పటి వరకు చెక్‌పోస్టుల వద్ద తూతూ మంత్రంగా కొనసాగిన తనిఖీలను ఈ ఐదు రోజులు ఉధృతం చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఎన్నికల సంఘం నియమించిన పరిశీలకులు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో ఎన్నికల ప్రచారం లోలోపల తప్ప బయట పెద్దగా హడావుడి కనిపించడం లేదని నియోజకవర్గ ఓటర్లు చెబుతున్నారు. ఇప్పటిదాకా ఆయా పార్టీల అభ్యర్థులు ఖర్చు చేసిన వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అత్యధికంగా తెరాస అభ్యర్థి సైదిరెడ్డి ఎన్నికల ఖర్చులో అగ్రభాగాన నిలువగా, ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ పద్మావతి ఉన్నారు.



**మండలి విప్‌గా బాధ్యతలు స్వీకరించిన కూచుకుళ్ల దామోదర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అనంతరం మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, పారుఖ్‌హుస్సేన్ తదితరులు అభినందించారు.**

# తగ్గిన విద్యుత్ డిమాండ్



**● పెరిగిన జలవిద్యుత్ ఉత్పత్తి**
**● జెన్‌కో కేంద్రాల్లో 94 ఎంయూల విద్యుత్**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వాతావరణం చల్లబ డటం , అడపా దడపా వర్షాలు కురుస్తుం డటంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం తగ్గు తూ వస్తోంది. గత ఏడాది అక్టోబర్‌తో పోలిస్తే సుమారు 913 మెగా వాట్ల విద్యుత్ విని యోగం తగ్గింది. రాష్ట్రంలో సరఫ రా అవు తున్న విద్యుత్‌లో 30శాతం వ్యవసాయ రంగ మే వినియోగించుకుటుంది. అయితే వాతా వర ణంలో మార్పులు, సమయాను కూలంగా కురుస్తున్న వర్షాలు వ్యవసాయ రంగానికి విద్యుత్ మోటర్ల ద్వారా నీటి తడులు అందిం చాల్సిన అవసరనాన్ని తగ్గిం చాయి. అంతే కాకుడా గృహ వినియోగంలో కూడా గత వారం రోజులనుంచి విద్యుత్ డిమాండ్ తగ్గుతూ వస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. చలికాలం ప్రారంభం కావటం తో ఫ్యాన్లు, ఏసీల వాడకం అంత గా ఉండట లేదు. దీంతో గృహవినియోగంలో కూడా విద్యుత్ అవస రాలు తగ్గినట్టు చెబుతున్నారు. రాష్ట్రం లో మంగళవారం విద్యుత్ డిమాం డ్‌ను పరిశీ లిస్తే మొత్తం 7732మెగావాట్ల డిమాండ్ ఉంది. అందులో ఎస్పీడీసీఎల్ పరిధిలో 5329 మెగావాట్లు, ఎన్పీ డీసీఎల్ పరిధిలో 2046 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నట్టు అధి కారులు వివరించారు. గత ఏడాది ఇదే సమ యానికి రాష్ట్రంలో 8645 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ రికార్డయింది. గత ఏడాది ఈ సమయానికి అంతగా వర్షాలు లేకపోవటం,ఎండల తీవ్రత అధి కం గా ఉండటంతో విద్యుత్ వినియోగం కూడా ఆదేస్థా యిలో ఉండేది. గతేడాదితో పోలిస్తే ఇప్పడు రాష్ట్రం లో 913 మెగావాట్ల విద్యుత్ మేరకు డిమాండ్ తగ్గింది.

**ఆదుకుంటున్న జలవిద్యుత్**

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సరఫరా పరిస్థితిని పరిశీలిస్తే ఈ సారి జలవిద్యుత్ ఉత్పత్తి ఉత్పత్తి గణనీ యంగా పెరిగింది. కృష్ణా, గోదావరి పరివాహకంగా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలు ప్రధాన నదుల్లో వరదనీటి ప్రవాహాలను ఉరకలెత్తించాయి. ఆగస్ట నాటికే రాష్ట్రంలోని ప్రధాన జలాశ యాల్లో నీటి మట్టాలు గణనీయంగా పుంజు కుంటూ వచ్చా యి. ఇటు కృష్ణా ,అటు గోదా వరి నదులపై ఉన్న ప్రధాన జలాశయాలన్నీ పూర్తి స్థాయిలో నిండ టంతో జల విద్యత్ ఉత్ప త్తి పరిస్థితి పూర్తి ఆశాజ నకంగా మారింది. జూరాల, లోయర్ జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్ , నాగార్జున సాగర్ ఎడమ కాలువ, పులిచింతల ప్రాజెక్టులపై ఉన్న జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 52.4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరగుతోంది. అంతే కాకుండా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 42.40మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. టీఎస్ జన్కో ద్వారా మొత్తం 94.83 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.



# సేంద్రీయ సాగు బాగు

**లబ్ధిదారులకు పాడి ఆవుల పంపిణీలో మంత్రి హరీష్**

**సిద్దిపేట, ప్రభన్యూస్ :** రైతులంతా సేంద్రీ య వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. పాడి ఆవులతో ఆదాయం పెరుగుతుందని అన్నారు. మంగళవారం స్థానిక పత్తిమార్కెట్ యార్డులో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పాడి ఆవులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆవుల పంపిణీ చక్కటి కార్యక్రమమని, వీటి ద్వారా రైతులందరికీ శుభం కలగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం పరిధిలో 263మంది రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారని, వారందరికీ ఆవులను ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. అదేవిధంగదా గుడుంబా మీద ఆధారపడిన లంబాడి అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు కూడా పాడి ఆవులను దానం చేయడం జరుగుతుందని చెప్పారు. బాలవికాస సంస్థ వారి సమన్వయంతో లబ్ధిదారులు బీమా సౌకర్యం పొందాలని సూచించారు. రైతుల ఉత్పాదక సంఘాన్ని ఏర్పాటు చేయాలని, దీనిద్వారా సిద్దిపేట సేంద్రీయ ఉత్పత్తుల పరిశ్రమకు బ్రాండింగ్ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్, పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్, నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

# పహారాలో చదువులు!




**● కాశ్మీర్ ప్రభుత్వం కీలక నిర్ణయం ● విద్యా సంస్థలపై నిఘా ● కలెక్టర్లకు రోజువారీ పరిస్థితుల పరిశీలన బాధ్యతలు ● కళాశాలలు, పాఠశాలల వెలుపల బలగాల మోహరింపు**

**న్యూఢిల్లీ:** అధికరం 370 రద్దు తర్వాత కాశ్మీరం ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. రెండు రోజుల కిందటే మొబైల్ ఫోన్లు సంకేతాలు అందుకున్నాయి. రెండు నెలల తర్వాత స్థానిక పౌరులు బాహ్య ప్రపంచంతో అనుసంధానం అయ్యారు. ఈ నేపథ్యంలో గవర్నర్ పాలకమండలి మరో కీలక నిర్ణయం తీసుకుంది. కాశ్మీర్ వ్యాలీలో విద్యాసంస్థలపై గట్టి నిఘా ఉంచేందుకు సిద్ధమైంది. ఈమేరకు సంబంధిత అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. పాఠశాలలు, కళాశాలల మొదలు అన్ని విద్యాసంస్థల్లో పరిణామాలను ఎప్పటికప్పుడు ఆరా తీయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. రోజువారీ కార్యకలాపాలను నిశితంగా పరిశీలిస్తూ, నిరంతరం పర్యవేక్షించాలని చెప్పింది. విద్యాసంస్థల కార్యకలాపాలకు ఆటంకాలు లేకుండా ఉండేందుకే ఇలాంటి చర్యలు చేపడు తున్నట్లు పోలీసు యంత్రాంగం చెబుతోంది. విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమైనా విద్యార్థులు తరగతి గదులకు దూరంగా ఉండటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వారిని చదువులవైపు మళ్లించేందుకు గట్టి ప్రయత్నాలు చేప ట్టింది. వారం రోజుల కిందట కాశ్మీర్ డివిజనల్ కమిషనల్ బషీర్ అహ్మద్ ఖాన్ నేతృత్వంలో దీనిపై ఉన్నతస్థాయి అధికారబృందం సమా వేశమైంది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కొంతకాలం విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. అనంతరం సెప్టెంబర్‌లో విద్యాసంస్థలు పున:ప్రారంభం అయ్యాయి. కానీ, స్థానిక మిలిటెంట్ల హెచ్చరికలతో చాలావరకు విద్యార్థులు తరగతులకు హాజరుకావడంలేదు. వేర్పాటువాదుల బంద్ పిలుపుతో ఇక్కడి విద్యాసంస్థలు తరచూ మూతబడుతుంటాయి. సాఫీగా తరగతులు జరిగే పరిస్థితులు ఉండటం లేదు. దీంతో సిబ్బందికి, విద్యార్థులకు భద్రత గురించి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటున్నది.

**పోలీసు వలయం**

తాజా ఆదేశాల ప్రకారం, అన్ని ప్రధాన క్యాంపస్‌లపై భద్రత బలగాలు నియంత్రణ కలిగివుంటాయి. ప్రతి విద్యాసంస్థకు ఒక మెజిస్ట్రేట్‌ను కేటాయించారు. ఆటంకాలు లేకుండా స్కూళ్లు, కాలేజీలు పనిచేసేలా చూడటం వీరి విధి. పోలీసులు భద్రత చర్యలకు మాత్రమే పరిమితం కావాలి. అత్యుత్సాహంతో క్యాంపస్‌లోకి చొరబడ కూడదు. కాలేజీల వెలుపల మాత్రమే విధులు నిర్వహించాలి. విద్యా సంస్థలు కూడా భద్రత ప్రమాణాలు పాటించాలి. ఆవరణ నలువైపులా సీసీ కెమేరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కాగా, క్యాంపస్ కార్యకలాపాలను మెజిస్ట్రేట్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తుండటం కాశ్మీర్ చరిత్రలోఇదే తొలిసారి అని విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. 2017లో విద్యార్థుల ఆందోళనల వల్ల విద్యాసంస్థలను చాలా రోజులు మూసివేతకు ప్రభుత్వమే ఆదేశాలిచ్చింది. ఆ సమయంలో పుల్వామా జిల్లాలోని డిగ్రీ కాలేజీ క్యాంపస్‌లోకి భద్రతా బలగాలు భారీసంఖ్యలో ప్రవేశించాయి. మళ్లీ ఇన్నాళ్లకు అలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని అధికారులు గుర్తుచేసుకుంటున్నారు.

**పరీక్షల ఆందోళన..**

10-12 తరగతులకు అక్టోబర్ 23 నుంచి పరీక్షల షెడ్యూల్‌ను విద్యాసంస్థ విడుదల చేసింది. పాఠశాల స్థాయి విద్యార్థులకు నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పింది. అసలే తరగతులు నిర్వహించలేని పరిస్థితి ఉండగా, పరీక్షల సంకటమేంటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం చర్యలను స్థానికులు నేటికీ రాజకీయ కోణంలోనే చూస్తున్నారు. రోడ్లపై పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు మోహరించివున్నాయి. ప్రతి పట్టణంలోని ప్రతి వీధిలో ఇదే దృశ్యం కనిపిస్తున్నది.




# పాక్‌కు ఆఖిరి చాన్స్!

**ఎఫ్ఏటీఎఫ్‌లోనూ పాక్ ఏకాకి**

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ ఉగ్రవాద నాటకానికి రోజులు దగ్గరపడ్డాయి. తీవ్రవాదుల ఆర్థిక కార్యకలాపాలపై టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) పాక్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాగైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఉగ్రవాద కార్యకలాపాలను, నిధుల సరఫరా వ్యవస్థను నియంత్రించే విషయంలో ఆఖరి అవకాశం ఇస్తున్నట్లు చెప్పింది. ఈసారి విఫలమైతే డార్క్ గ్రే జాబితాలో చేరుసామని గట్టిగా చెప్పింది. తాజా సమావేశంలో తీవ్రవాదుల ఆర్థిక కార్యకలాపాలపై టాస్క్‌ఫోర్స్ ఇస్లామిక్ దేశం తీరును తప్పుబట్టింది. అవసరమైన మేరకు చర్యలు చేపట్టడం లేదని పేర్కొంది. ఈ భేటీలో ఏ ఒక్క సభ్యదేశం పాక్‌కు మద్దతుగా నిలవకపోవడం విశేషం. దీంతో మరోసారి కీలక సమయంలో అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్‌ఒంటరిగా మిగిలింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాక్ పనితీరు అసంబద్ధంగా ఉందని ఎఫ్ఏటీఎఫ్ నివేదిక తెలిపింది. మొత్తంగా 27 అంశాలను సూచి ంచగా కేవలం ఆరింటిపైనే పాక్ స్పందన ఉందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. పాక్ భవితవ్యానికి సంబంధించి 18వ తేదీన ఎఫ్ఏటీఎఫ్ తుదినిర్ణయాన్ని ప్రకటించనుంది. నిబంధల ప్రకారం గ్రే జాబితా, బ్లాక్ జాబితాకు మధ్య దశను డార్క్‌గ్రే జాబితాగా పేర్కొంటారు. దీని ప్రకారం సంబంధిత దేశానికి గట్టి మందలింపుతో ఆఖరి అవకాశం ఇవ్వడం జరుగుతుంది. అయినా పనితీరును మెరుగు పరచుకోకుంటే డార్క్ గ్రే జాబితాలో చేర్చుతారు. దీనివల్ల ఆ దేశ ఆర్థికస్థితి మరింత క్షీణిస్తుంది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, యూరోపియన్ యూనియన్‌ల నుంచి ఆర్థికసహాయం పొందడం సంక్లిష్టమవుతుంది. గతేడాది జూన్ నాటి సమావేశంలో పాక్ గ్రే జాబితాలో చేర్చబడింది. ఎఫ్ఏటీఎఫ్ 1989లో ఏర్పడింది. కొన్ని ప్రభుత్వాల సమూ హమిది. మనీలాండరింగ్, తీవ్రవాదులకు ఆర్థిక మద్దతు వంటి అంతర్జాతీయ ఆర్థిక నేరాల ముప్పును నిరోధించడమే లక్ష్యంగా ఏర్పాటు కాబడింది.


తెలంగాణ ప్రభుత్వము
పిఆర్ఐ డివిజన్
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

ఎన్ఐటి నెం.67&68/2019-20 తేది : 09-10-2019

పనిపేరు : ఎల్లందు మండలం, కొమ్ముగూడెం మరియు సుభాష్‌నగర్ గ్రామాలలో కమ్యూనిటీహాలు నిర్మాణం యొక్క మిగిలిన పని. అంచనా విలువ రూ.20.00 లక్షలు 2 పనుల కొరకు. టెండరు షెడ్యూళ్ళను 10-10-2019 నుండి 17-10-2019న సా॥5.00గం.ల వరకు డౌన్‌లోడ్‌చేసుకోవచ్చును. తదుపరి వివరాలను వెబ్‌సైట్ www.tenders.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- జిల్లా పిఆర్ ఇంజనీర్, పిఐయు డివిజన్,కొత్తగూడెం

Ro No.1387/CL/Advt/1/2019-20, Dt. 15.10.2019

प्रतिभूति मुद्रणालय / SECURITY PRINTING PRESS
(भारत प्रतिभूति मुद्रण तथा मुद्रा निर्माण निगम लिमिटेड की इकाई/
A Unit of Security Printing & Minting Corporation of India Ltd.)
भारत सरकार के पूर्ण स्वामित्वाधीन / Wholly owned by Govt.of India
टकसाल कंपाउण्ड / सैफाबाद / Mint Compound : Saifabad हैदराबाद / HYDERABAD-500063
CIN – U22213 DL 2006 GOI144763 GSTIN : 36AAJCS6111J1Z9

दूरभाष/ Ph: +91-40-23253621 फैक्स/Fax : + 91-40-23456687 ई-मेल/email : spp.hyd@spmcil.com

No. SPPH/A-II/Adv/2019/3503 Date: 16-10-2019

मुहरबंद निविदाएं निम्न लिखित माल की आपूर्ति के लिए पात्र और योग्य निविदा कर्ताओं से आमंत्रित किये जाते हैं:
Sealed tenders are invited from eligible and qualified tenderers for supply of following:

निविदा आमंत्रण सूचना / Notice Inviting Tender (NIT)

| क.सं. Sl. No. | माल / सेवाएँ का संक्षिप्त विवरण Brief Description of Goods / Services | निविदा सं. Tender No. | मात्रा Quantity | निविदाओं की प्राप्ति के लिए तारीख और बंद करने का समय Closing Date and Time (IST) for Receipt of Tenders |
|---|---|---|---|---|
| 1 | Blue Wove Paper (Global Development Tender) | 6000013850 | 25 MT | 03-12-2019 at 10:45 AM |

अधिक विवरण हेतु, कृपया हमारा वेबसाईट: http://spphyderabad.spmcil.com देखें और कोई संशोधन/शुद्धि-पत्र वेबसाईट पर ही प्रकाशित किया जाएगा।
For further details, please visit our website at http://spphyderabad.spmcil.com & any amendment / corrigendum will be published on website only.

हस्ता /Sd/ - Manager (TO) & CPSO (कृते महाप्रबंधक/ for General Manager)

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 16 అక్టోబర్ 2019

## కాశ్మీరాన మొబైల్ సేవలు!

కాశ్మీర్‌లో 370 అధికరణం రద్దు తర్వాత స్తంభించిన పోస్టుపెయిడ్ మొబైల్ సర్వీసులు సోమవారం మధ్యాహ్నం నుంచి తిరిగి పనిచేస్తున్నాయి. రాష్ట్రంలో తిరిగి మామూలు పరిస్థితి ఏర్పడుతున్నదనడానికి ఇది సంకేతమని ప్రభుత్వం పేర్కొంది. మొబైల్ ఫోన్‌ల పునరుద్దరణతో దూర ప్రాంతాల సమాచారాన్ని తెలుసుకోవడానికి వీలుంటుంది. ఇంతకాలం సుదూర ప్రాంతాల్లో ఉన్నతమ వారి క్షేమ సమాచారాలు తెలియక దిగులు పడుతున్న కుటుంబాలకు ఈ సౌకర్యం మేలుచేస్తుంది. ఈ సౌకర్యం రెండు వైపులా పదునున్న కత్తిలాంటిది. ఆత్మీయులు, అస్మదీయుల సమాచారాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడినట్టే, ఉగ్రవాదులకు కూడా ఉపయోగపడవచ్చున్న అభిప్రాయాన్ని గవర్నర్ సత్యపాల్ మాలిక్ వ్యక్తం చేశారు. ఆయన మాటల్లో నిజమున్నది. అయితే, ఉగ్రవాదుల కదలికలనూ, వారు ఫోన్‌ల ద్వారా జరిపే సంభాషణలను తెలుసుకోవడానికి ప్రభుత్వానికి ఇంతకన్నా సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన సాధనాలు ఉన్నాయి. రాష్ట్రంలో పరిస్థితి కుదుటపడటానికి ఇది నాంది. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో కాశ్మీరీల్లో మనోవేదన పెరుగుతోంది. ఇంతకాలం మొబైల్ ఫోన్ సర్వీసులు లేకపోవడం వల్ల విదేశాలలో ఉన్న తమ పిల్లలతో మాట్లాడేందుకు స్థానికులు చాలా అవస్థలు పడేవారు. ఖుర్షీద్ జూ అనే కార్పెంటర్ ఖతర్‌లో ఉన్న తన కుమారునితో మాట్లాడేందుకు గడిచిన 72 రోజులుగా రెండు మూడు మైళ్ళు నడిచి వెళ్ళి పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి మాట్లాడేవారు. సోమవారం ఆయన తన ఇంటినుంచే మొబైల్‌ఫోన్‌లో కొడుకుతో మాట్లాడారు. మొబైల్ ఫోన్‌ల పునరుద్ధరణ తర్వాత పౌరుల అనుభవాలు ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. కట్టలు తెగిన భావోద్వేగాలతో తమ బంధుమిత్రులతో వారు ఫోన్ సంభాషణ జరిపిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. అయితే, నాణానికి ఇది ఒక పార్శ్వం మాత్రమే. రాష్ట్రంలోని 121 పోలీసు స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ ఎత్తివేసినట్టు ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నప్పటికీ, రోడ్ల మీదికి రావడానికి ప్రజలు ధైర్యం చేయడం లేదు. ఈ పరిస్థితిని నివారించేందుకు రాష్ట్ర గవర్నర్ పత్రికల్లో ప్రభుత్వం తరఫున భారీ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను ఉపయోగించుకోవాలని కోరారు. అయినా, గడపదాటుతున్న వారిసంఖ్య అంతంత మాత్రమే. ఉగ్రవాదులు లేకపోయినా, ఏ మూలనుంచి ఉన్నపళంగా దాడి చేస్తారేమోనన్న భయం స్థానికులను ఇంకా వెంటాడుతూనే ఉంది. అదే సందర్భంలో కాశ్మీరీల అంతరాంతరాల్లో 370వ అధికరణం రద్దుపై అసంతృప్తి ఇంకా నివురుగప్పిన నిప్పులా ఉందనే విషయం స్పష్టం అవుతోంది. రాష్ట్రంలో పాఠశాలలు మూతపడి 72 రోజులు అవుతోంది. ఉన్నత విద్యా సంస్థలదీ అదే పరిస్థితి. శ్రీనగర్‌లో నిట్‌ను మంగళవారం ప్రారంభించినప్పటికీ విద్యార్థుల సంఖ్య పలుచగా ఉంది. అంతర్జాల సర్వీసులు ఇంకా ప్రారంభం కానందున ఈ సంస్థలో తరగతులు ప్రారంభం కాలేదు. పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగా ఉన్న దృష్ట్యా ఇతర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు శ్రీనగర్‌కి రాలేదు. మామూలు రోజుల్లోనే ఉగ్రవాదుల దాడుల కారణంగా ఈ సంస్థలో చదువుకునే విద్యార్థులను స్వస్థలాలకు పంపివేయడం పరిపాటి. ఈ సంస్థలో చదువుకునే విద్యార్థులపై ఉగ్రవాదుల ఒత్తిడి ఎక్కువ. ఉగ్రవాదులు తమ సంస్థల్లోకి రిక్రూట్ చేసుకునేందుకు ఈ సంస్థ విద్యార్థులకు వల పన్నడం ఇంతవరకూ జరుగుతూ ఉండేది. మారిన పరిస్థితులలో అలాంటివి ఉండవనే అంతా ఆశిస్తున్నారు. ఇదొక్కటే కాదు, శ్రీనగర్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని కూడా ఉగ్రవాదులు తమ అడ్డాగా ఉపయోగించుకునే వారు. హిజ్ బుల్ కమాండర్ బుర్హాన్ వనీ ఈ సంస్థలో విద్యార్థులను రిక్రూట్ చేసుకోవడానికి వచ్చి, పోలీసులను చూసి పక్కఇంట్లో ప్రవేశించాడు. అక్కడ గంటల కొద్దీ భద్రాతాదళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతడు మరణించాడు. ఇంతకాలం శ్రీనగర్‌లోనూ, కాశ్మీర్ లోయలోని నగరాలు పట్టణాల్లో పాఠశాలలు, విద్యాసంస్థలు ఉగ్రవాదుల చెరలో ఉన్నాయి. ఇప్పుడు ప్రశాంతంగా పనిచేసేందుకు తగిన వాతావరణాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వం చెబుతోంది. ఒక్క శ్రీనగర్‌లోనే కేంద్రీయ విద్యాలయాలతో సహా వందకు పైగా అత్యున్నతశ్రేణి విద్యా సంస్థలు పనిచేస్తున్నాయి. విద్యా సంస్థలు తిరిగి పనిచేయడానికి అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే, కొద్దిమంది మాత్రమే విద్యా సంస్థలకు తరలి వస్తున్నారు. శ్రీనగర్‌లో సోమవారం మధ్యాహ్నం మొబైల్ సర్వీసులు పునరుద్ధరించబడినప్పటికీ అందరికీ ఈ సమాచారం అందకపోవడం వల్ల ఎప్పుడూ వచ్చే యువతీయువకులెవరూ రాలేదని మొబైల్ దుకాణాల వారు పేర్కొన్నారు. మొబైల్ సర్వీసుల పునరుద్ధరణ కాశ్మీర్ ప్రావిన్స్‌లోని పది జిల్లాలకు వర్తిస్తుందని జమ్ము, కాశ్మీర్ ప్రిన్సిపల్ కార్యదర్శి రోహిత్ కన్సాల్ తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద 60 లక్షల మందికి మొబైల్ ఫోన్ సౌకర్యాలు ఉండగా, వీటిలో 40 లక్షల మందికి పోస్ట్ పెయిడ్ సర్వీసులు ఉన్నాయని అధికారులు చెప్పారు. వాటన్నింటినీ పునరుద్ధరించడం జరిగిందనీ, అయితే, ఇందుకు సంబంధించిన సమాచారం అందరికీ చేరకపోవడంవల్ల సోమవారం కొద్దిమంది మాత్రమే ఉపయోగించుకున్నట్టు అధికారులు తెలిపారు.. గత నెల 15వ తేదీన ల్యాండ్‌లైన్ ఫోన్‌లపై ఆంక్షలు తొలగించారు. అయితే, దీనివల్ల ఉపయోగం చాలా పరిమితమే. జమ్ము, కాశ్మీర్‌లోని 99 శాతం ప్రాంతాల్లో ఆంక్షలు తొలగించారు. ఆగస్టు ఐదవ తేదీన 370వ అధికరణం రద్దు తర్వాత విధించిన ఆంక్షలను అదే నెల 16 నుంచి క్రమంగా తొలగిస్తూ వస్తున్నామనీ, సెప్టెంబర్ మధ్య నాటికి చాలా ప్రాంతాల్లో ఆంక్షలను ఎత్తివేయడం జరిగిందని అధికారులు తెలిపారు. ఆంక్షలు ఎత్తివేయడంతో ప్రజల్లో భావోద్వేగాలు తన్నుకు వస్తున్నాయి. 370 అధికరణం రద్దుకు నిరసనలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. ఆగస్టు ఐదు నుంచి గృహ నిర్బంధంలో ఉన్న నాయకులను నెమ్మదిగా విడుదల చేస్తున్నారు. అయితే, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా వంటి అగ్రనాయకులు ఇంకా నిర్బంధంలోనే ఉన్నారు. ఫరూక్ సోదరి సురయా, ఆమె కుమార్తె సైఫియా అబ్దుల్లా, మరో మాజీ ముఖ్యమంత్రి బషీర్ అహ్మద్ ఖాన్ సతీమణి హైఫా బషీర్‌లు మంగళవారం ప్రదర్శన నిర్వహించి అరెస్టు అయ్యారు. శ్రీనగర్‌లో ముఖ్య కూడలి అయిన లాల్‌చౌక్ ప్రతాప్ పార్క్ వద్ద వీరు ప్రదర్శన నిర్వహించారు. ఆగస్టు ఐదవ తేదీ నుంచి మమ్మల్ని ఇళ్ళల్లోనే నిర్బంధించారనీ, బలవంతపు పెళ్ళిళ్ళు చెల్లవంటూ నినాదాలు గల ప్లకార్డులు పట్టుకుని వారు ప్రదర్శనలు జరిపారు. పౌర, మానవ హక్కులను మంటగలిపి తమను పౌరుల్లా కాకుండా, బానిసలుగా పరిగణించారనీ, తీవ్ర అవమానాలకు గురి చేశారని ఫరూక్ సోదరి, ఇతర మహిళా కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. కర్ఫ్యూను నగరాలు, పట్టణాల్లో విధించవచ్చునీ, ప్రజల భావోద్వేగాలనూ, మనో భావాలను కట్టడి చేయలేరంటూ వారు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆగస్టు 5వ తేదీ నుంచి పబ్లిక్ సేఫ్టీ చట్టం కింద నిర్బంధంలో ఉన్న ఫరూక్ అబ్దుల్లా ప్రభృతులను విడుదల చేయాలంటూ వారు నినాదాలు చేశారు. శ్రీనగర్‌లో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉందనడానికి ఇదే తార్కాణం.

# కాంగ్రెస్‌లో ఆధిపత్యపోరు




లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీకి వ్యతిరేకంగా మమతా బెనర్జీ పిలుపుతో అన్నీ పార్టీలు కలిసి మహా కూటమిగా ఏర్పాటయ్యాయి. ఒకే వేదికపై నేతలందరూ బీజేపీకి వ్యతిరేకంగా యుద్ధమే ప్రకటించారు. ఎన్నికలకు ముందు ఐక్యతా రాగం అందుకున్న పార్టీలు.. ఆ తరువాత ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరించాయి. ఫలితంగా మోడీ బంపర్ మెజార్టీతో అధికారంలోకి వచ్చారు. ఈ ఎన్నికలు దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలకు కోలుకోలేని విధంగా దెబ్బ కొట్టాయి. లోక్‌సభ ఎలక్షన్ల తరువాత మళ్లీ మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో అక్టోబర్ 21న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ తరువాత మరికొన్ని నెలల తరువాత జార్ఖండ్‌లో అసెంబ్లీ పోరు ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 24న కాంగ్రెస్‌తో పాటు వివిధ ప్రతిపక్ష పార్టీలకు మహారాష్ట్ర, హర్యానాలో లోక్‌సభ ఎన్నికల తరహా ఎదురుదెబ్బే తగిలే అవకాశాలు లేకపోలేదు. భవిష్యత్తు కాలంలో అసలు ప్రతిపక్షమే లేకుండా పోతుందనడంలో కూడా సందేహం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా పార్టీల బలాబలాలు ఏంటో ఓటర్లు తెలుసుకుంటున్నారు.

**అమలుకు నోచుకోని కాంగ్రెస్ ప్రణాళికలు:** కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా దేశంలో కొనసాగుతున్న ఆర్థిక మందగమనంపై దృష్టి పెట్టింది. ఈ విషయమై దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సమావేశాలు నిర్వహించి చర్చించాలని నిర్ణయించింది. రెండు దశల ప్రణాళికలను కూడా సెప్టెంబర్ రెండో వారంలో కాంగ్రెస్ ప్రకటించింది. ఆర్థిక మందగమనంపై సెప్టెంబర్ 20 నుంచి 30 వరకు దేశ వ్యాప్తంగా చర్చలు జరపాలని అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా ఛిన్నాభిన్నం చేశారో ప్రజలందరికీ తెలియజేయాలని నేతలకు పిలుపునిచ్చింది. దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనంపై కేంద్రంపై పోరాటాలు చేయాలని కూడా నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా అక్టోబర్ 14, 25న దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాల్లో ధర్నాలు చేయాలని నిర్ణయించుకుంది. ఆ తరువాత వారం రోజులకు ప్రణాళికలను కాంగ్రెస్ ప్రకటించింది. ఆరు లెఫ్ట్ పార్టీలు ఆర్థిక మందగమనంపై ఢిల్లీలో సమావేశం అయ్యాయి. ఈ సమస్యను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నేతలు, కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని ప్రకటించాయి. ప్రజలపై ఆర్థిక మందగమన ప్రభావం ఎలా ఉంటుందో తెలియజేయాలని భావించాయి. తమ పిలుపు మేరకు కార్యకర్తలు ఆందోళనలు, ధర్నాలు చేయడంతో బీజేపీపై వ్యతిరేకత, తమ పార్టీలపై కొంత సానుభూతి వస్తుందని కాంగ్రెస్, వామపక్ష పార్టీలు భావించాయి. కానీ వారు అనుకున్నది ఏదీ జరగలేదు. వీటి కోసం ఖర్చు చేసే నిధులను ఆదా చేసుకోవడానికి, బీజేపీపై ఆర్థిక మందగమన యుద్ధ ప్రకటనను అధికారికంగా ఎవరికీ తెలియజేయలేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగానే పవనాలు వీస్తున్నాయని నేతలు, కార్యకర్తలు తెలుసుకున్నారు. హౌసింగ్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇతర పథకాలు, వారిని మోడీపై మరింత అభిమానం, నమ్మకాన్ని పెంచేలా చేశాయనేది గ్రహించారు.

**వలసల నివారణలో హస్తం విఫలం:** హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. గత నెల వరకు కాంగ్రెస్ పార్టీ రెండు, మూడు రోజులకోసారి దేశ ఆర్థిక మందగమనంపై ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ వచ్చింది. ఎన్నికల దృష్ట్యా కీలక నేతలు పార్టీ వదిలి వెళ్లిపోతారనే భయం కూడా కాంగ్రెస్‌ను వెంటాడుతూనే వచ్చింది. అయినా కొన్ని రాష్ట్రాల్లో మాత్రం వలసలను నిరోధించడంలో అధిష్టానం విఫలమైందనే చెప్పుకోవాలి. పార్టీలో కూడా ఆధిపత్య పోరు కూడా తారా స్థాయికి చేరుకుంది. అహ్మద్ పటేల్ ఓ వర్గంగా.. మరికొందరు ఓ కూటమిగా ఏర్పడటంతో కొంత పార్టీ ప్రతిష్ట దెబ్బతింది. యువకులకు రాజకీయ అవకాశం ఇవ్వాలని రాహుల్ గాంధీ భావిస్తుంటే... కురవృద్ధులు మాత్రం అజమాయిషీ చెలాయించడానికి ప్రయత్నిస్తూ వచ్చారు. అధ్యక్షపదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేసిన తరువాత పార్టీ పరిస్థితి మరింత దిగజారింది. పెద్ద దిక్కులేకపోవడం కూడా చారిత్రాత్మక పార్టీ ప్రతిష్ట దిగజారేలా చేసింది. ఏఐసీసీ తాత్కాలిక అధ్యక్షురాలిగా సోనియా గాంధీ బాధ్యతలు తీసుకున్న తరువాత రాహుల్ గాంధీ వర్గీయులను లక్ష్యంగా చేసుకుని కొందరు సీనియర్ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారు. రాహుల్ గాంధీకి అతి సన్నిహితులుగా ఉన్నవారిని చెక్‌పెడుతూ వచ్చారు. దీంతో కొందరు నేతలు స్వతహాగా పార్టీకి గుడ్‌బై కూడా చెప్పారు.

**త్రిపురలో కుమ్ములాటలు:** త్రిపుర కాంగ్రెస్ మాజీ చీఫ్ ప్రద్యూత్ కిశోర్ మాణిక్య దేబ్ బర్మన్ రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు. పార్టీ సీనియర్ నేతలు ఈయనకు చెక్ పెట్టారు. త్రిపుర రాయల్ ఫ్యామిలీకి చెందిన కిశోర్ స్థానంలో లుజిన్హో ఫెలేరియోను అధిష్టానం గత నెలలో నియమించింది. ఏడు ఈశాన్య రాష్ట్రాలతో పాటు చాలా మందిని ప్రద్యూత్ నియమించారు. రాహుల్ గాంధీ తన పదవికి రాజీనామా చేసే ముందు దేబ్ బర్మన్‌ను చివరిగా అపాయింట్ చేశారు. ఫెలేరియోను అధిష్టానం నియమించిన తరువాత.. రాహుల్ గాంధీ ఈ విషయంలో కల్పించుకున్నారు. ఆ తరువాత ఫెలేరియోను పక్కనపెట్టి గౌరవ్ గొగొయ్‌ను త్రిపుర చీఫ్‌గా నియమించారు. తన రాజీనామా వెనక్కి తీసుకోవాలంటూ ప్రద్యూత్ కిశోర్ మాణిక్యను రాహుల్ గాంధీ కలిసినట్టు సమాచారం. దేబ్ రాజీనామా చేసిన తరువాత ఫెలేరియో అధిష్టానాన్ని కలుసుకున్నారు. 24 గంటల్లోనే ఆయన్ను సోనియా గాంధీ త్రిపుర ఇన్‌చార్జీగా నియమించడం గమనార్హం.

**హర్యానాలో ఆధిపత్య పోరు:** హర్యానాలో కూడా ఇలాంటి సీనియర్ నేతలు, రాహుల్ గాంధీ మధ్య ఆధిపత్య పోరు బయట పడింది. మాజీ సీఎం భుపేందర్ సింగ్ హుడా విషయంలో కూడా ఇదే జరిగింది. పటేల్, గులాం నబీ ఆజాద్ కల్పించుకుని హర్యానా చీఫ్‌గా అశోక్ తాన్వర్ నియామకం జరిగింది. ఆ తరువాత అనూహ్యంగా తన్వార్‌ను కూడా పక్కనపెట్టి నెల రోజుల క్రితం కుమారి సెల్జాకు హర్యానా బాధ్యతలు అప్పగించారు. హుడా తన పరిచయాలతో కోరుకున్న 52 మందికి టికెట్ ఇప్పించుకోవడంలో సఫలీకృతం అయ్యాడు. తాను సూచించిన వారికి ఎవరికీ టికెట్ ఇవ్వలేదన్న కారణంతో రాహుల్ గాంధీకి ఎంతో సన్నిహితంగా ఉన్న తన్వార్ పార్టీ వీడారు.

**రాజస్తాన్‌లో గెహ్లాట్ వర్సెస్ పైలెట్:** రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు నుంచి సీనియర్ నేతలు అశోక్ గెహ్లాట్, సచిన్ పైలెట్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తరువాత ఇది ఎక్కువైంది. బహిరంగంగా సచిన్, గెహ్లాట్‌లు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకోవడం ప్రారంభించారు. అహ్మద్ పటేల్‌కు రోహన్ గుప్తా ఎంతో సన్నిహితంగా ఉంటారు. కాంగ్రెస్ మీడియా అధిపతిగా నిఖిల్ అల్వా, పవన్ ఖేరాలను ఎన్నుకున్నారు. దీనికి ముందు రాహుల్‌కు సన్నిహితంగా ఉన్న దివ్యస్పందన ఈ బాధ్యతలు నిర్వర్తించారు.

**యూపీలో ప్రియాంక మార్క్:** ఉత్తర్‌ప్రదేశ్ విషయానికి వస్తే.. ప్రియాంక గాంధీ వాద్రాను ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. కొన్ని రోజుల క్రితం 50 ఏళ్లలోపు ఉన్న బృందానికి ఆమె నాయకత్వం వహిస్తున్నారు. ఇందులో 40 ఏళ్ల అజయ్‌కుమార్ లల్లును యూపీ స్టేట్ చీఫ్‌గా నియమించారు. 2022 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రియాంకా గాంధీ ఇప్పటి నుంచి యూపీలో వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. పార్టీలో సీనియర్ నేతలు, యువ నాయకులకు మధ్య సఖ్యత సరిగా లేదనేది రాజకీయ విశ్లేషకుల భావన. రాహుల్ గాంధీ ఎంతో ఓపికతో యువతను ముందుకు తీసుకొస్తుంటే... సీనియర్ నేతలు వారిని పక్కకు లాగేస్తున్నారని ఓ సీనియర్ నేత చెప్పుకొచ్చాడు. పార్టీ అధ్యక్ష పదవి విషయంలో సీనియర్ నేతలు సల్మాన్ ఖుర్షిద్, జ్యోతిరాదిత్య సింధియా చేసిన వ్యాఖ్యలు మరింత అగ్గిరాజేశాయని చెప్పుకోవచ్చు. రాహుల్ ఎంతో సమర్థవంతమైన నేత అని ఖుర్షిద్ చెప్పుకొచ్చాడు. పార్టీని ముందుకు తీసుకెళ్లే సత్తా ఆయనకు ఉందంటూ కొనియాడారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువ అయ్యాయని కూడా బహిరంగంగానే ప్రకటించాడు. అధ్యక్ష బాధ్యతలు రాహుల్ చేపట్టాలనే సూచన కూడా ఆయన చేశాడు. తప్పకుండా ఆయనే మళ్లీ బాధ్యతలు తీసుకుంటారని ఖుర్షిద్ ధీమా వ్యక్తం చేశాడు. అలా అంటూనే.. రాహుల్ నిర్ణయానికి, ఆయన మాటకు తాము కట్టుబడి ఉంటామని చెప్పుకొచ్చాడు. ఆయన ఉంటే పార్టీకి పూర్వ వైభవం వస్తుందని, కానీ అది జరగకపోవచ్చని అభిప్రాయపడ్డారు. మధ్యప్రదేశ్ సీఎంగా బాధ్యతలు స్వీకరించాలని సింధియా అనుకున్నారు. కానీ చివరికి పార్టీ కురువృద్ధ నేతల వల్ల కమల్‌నాథ్‌కు సీఎం కుర్చీ అప్పగించాల్సి వచ్చింది. అప్పుడు కూడా సింధియా పార్టీపై కొంత అసహనం, అసంతృప్తి వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శనాస్త్రాలు:** బీజేపీలో మాత్రం భిన్న పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలను హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ప్రచార అస్త్రంగా ఉపయోగించుకుంటోంది. దేవేంద్ర ఫడ్నవిస్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లు రాహుల్‌పై వ్యంగాస్త్రాలు సంధించారు. ఎన్నికల యుద్ధం నుంచి రాహుల్ పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర, హర్యాన ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఆది నుంచి రాహుల్ విముఖత వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఆ తరువాత కొంత మంది కీలక నేతలు రంగంలోకి దిగి సముదాయించడంతో కొంత మంది అభ్యర్థుల తరపున ప్రచారం చేసేందుకు రాహుల్ అంగీకరించారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ సీనియర్ నేతల ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. 50 ఏళ్ల క్రితం ఇందిరా గాంధీ హయాంలోని పరిస్థితులను ఇప్పటితో కొందరు పోల్చుకుంటున్నారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంతో పటిష్టంగా ఉండేదని అంటున్నారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా... పార్టీకి ఎంతో గౌరవ ప్రతిష్టలు ఉండేవని అభిప్రాయపడుతున్నారు. ఆమె కారణంగానే పార్టీకి మంచి పేరు వచ్చిందంటున్నారు. క్షేత్ర స్థాయి నుంచి అంతర్గత కుమ్ములాటలకు స్వస్తి చెప్పినప్పుడే పార్టీ మరింత పటిష్టంగా ముందుకు వెళ్లే అవకాశంఉంటుంది.

**దూరమైన వామపక్షాలు:** దేశంలో ప్రతిపక్ష పార్టీల పరిస్థితులు గమనిస్తే.. వామపక్ష పార్టీలు సీపీఐ(ఎం), సీపీఐలు మళ్లీ కూటమిగా ఏర్పాటు చేసే విషయంలో అంత ఆసక్తి చూపించడం లేదనేది రాజకీయ విశ్లేషకుల భావన. ఇక పశ్చిమ బెంగాల్‌లో కూడా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎదురీదుతోంది. అధికారంలోకి రావాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. కానీ అక్కడి పరిస్థితులు బీజేపీకి మైనస్‌గా మారుతున్నాయి.

దుర్గామాత మండపాల విషయంలో బీజేపీ వ్యవహరించిన తీరు కొంత ఇబ్బందికి గురి చేస్తు న్నది. కోల్‌కతాలో ఒక్క మండప నిర్వాహకులు కూడా పూ జలు నిర్వహించేందుకు బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాను ఆహ్వానించలేదు. సాల్ట్ లేక్ వద్ద మాత్రమే ఆయన పాల్గొ న్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ అధికారంలోకి ఎలా వస్తుంది అనేది రాజకీయ విశ్లేషకుల ప్రశ్న. 2021లో పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మహారాష్ట్రలో ఎన్‌సీపీ, కాంగ్రెస్ కూటమి మధ్య విలీనం విషయంలో రచ్చ జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఎదురు దెబ్బలు తగలడంలో ఓటర్లు కారణమా..? వారు అవలంబిస్తున్న విధానాలా..? అన్న దానిపై నేతలందరూ పరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కీలక నేతలను లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు బృందాలతో బీజేపీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనేది ప్రతిపక్షాల విమర్శ.

- సూత్రావే సంజీవ్

# ప్రజల చెంతకు పౌష్టికాహారం



## నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

పేదరికం వల్లనే సాధారణంగా పౌష్టికాహార కొరత తీవ్రంగా ఏర్పడుతుంది. పేదకుటుం బాలలో ఎక్కువ భాగం ఆదాయం ఆహారం మీ దనే ఖర్చుచేస్తారు. అటువంటి పరిస్థితుల్లో ఆహారం కడుపు నింపడానికి, కానీ పౌష్టికాహారాన్ని వినియోగ పర్చుకోవడానికి వారి ఆదాయ స్థాయి సరిపోదు. కావలసిన పరిమాణంలో సంతులిత ఆహారాన్ని వినియోగ పరచుకొని ఆర్థికస్తోమత లేని కారణం వల్ల ప్రజలలో ముఖ్యంగా చిన్న పిల్లల్లో ప్రోటీన్లలోపం విటమిన్లలోపం, ఐరన్, అయోడిన్ తగిన పరిమాణంలో అందక పోవడంతో మహిళలు ఎక్కువగా నష్టపోతు న్నారు. మార్చి 8న మన ప్రధానిసమగ్ర పౌష్టికాహార పథకం ''పోషణ్ అభియాన్'' ను రాజస్థాన్ లోని ఝున్ ఝును జిల్లాలో ప్రారంభించారు. ఈ పథకంలోని ప్రత్యేకత ఏమిటంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో అమలు చేయడం. పెరుగుదల మందగించిన పిల్లలు, రక్తహీనతతో బాధపడేవారికి, తక్కువ బరువుతో పుట్టిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. ప్రధానమంత్రి జాతీయ పోషకాహార పథకాన్ని 'భేటీ బచావో భేటీ పడావో' పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ఇప్పుడు దేశంలోని మొత్తం 640 జిల్లాలకు వర్తిస్తుంది. ఈ పథకం బాలికలకు పాలతో సమానంగా నాణ్యమైన విద్యను అందించడం బాలికలు కుటుంబానికి భారం కాదనే భావన పెంపొం దించడం వంటి అంశాలపై ప్రజలను చైతన్య పరుస్తూ బాలిక కుటుంబానికి, సమా జానికి కూడా మేలవుతున్నారు. ఈ పథకం ప్రజలు, ప్రభుత్వాలు ఉమ్మడిగా చేసిన కృషి ఫలితంగా 2014-2015 918, 2016-2017 నాటికి 926 పెరిగిందని, ఈ పథకానికి 2017- 2018, 2019- 2020 వరకు రూ.11,132 కోట్లు, ఆకలిని రూపుమాపడానికి సామా జిక సహ కారం అవసరమైన అన్ని కుటుంబాలను ఆహార భద్రత కల్పిస్తూ పార్లమెంటు చట్టం చేసింది. ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఆకలి పౌష్టికాహార లోపం ఫలితంగా మన బాల, స్త్రీ, పురుషులు పూర్తిస్థాయిలో భౌతికంగా మానసికంగా ఎదగడానికి దోహదపడే విధం గా ఉన్నాయి. ఈ మధ్యకాలంలో ఆహార భద్రత భావన అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకుంది. స్వచ్ఛమైన ఆహారం'' కోసం సరికొత్త ఉద్యమానికి సమయం ఆసన్నమైంది. ఆహార వ్యవసాయ సంస్థ అంచనాల ప్రకారం 1997లో అభివృద్ధి చెందుతున్న దేశాలలో నివసించే మిలియన్ల జనాభాలో 34 మిలియన్ల మంది పోషకాహారానికి నోచుకోలేదు. 2012-2014 సంవత్సరా లలో ప్రపంచ జనాభాలో 14 శాతం మంది బాధపడుతున్నారు. ఆర్థిక వ్యవస్థ అభి వృద్ధి చెందే కొద్దీ ఆహారభద్రత భావనను విస్తృతపరచాలి. పరిశుభ్రమైన త్రాగునీటి లభ్యత కూడా ఇందులో భాగంగా పరిగణించాలి. మానవునికి శక్తినిచ్చే పోషక ఆహారంలో పిండి పదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వు ముఖ్యమైనవి దేశంలో ప్రజలకు ఆహారం ద్వారా లభించే శక్తి వినియో గంలో పిండిపదార్థాల వాటా 71 శాతం, మాంసకృత్తుల వాటా 10 శాతం, కొవ్వు 19 శాతం దీనిని బట్టి పిండిపదార్థాలు ఎక్కువగా ఉందని గమనించవచ్చు, దేశంలో నాలుగవ వంతు జనాభా పేదరికం గీత క్రింద వున్నారు.దేశంలోని పేదలకు ఆహార భద్రతను చేకూర్చే క్రమంలో ఇప్పటికే మూడు రకాల కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఐ.సి.డి.ఎస్ పేరిట బాలింతలకు, 6 సంవత్సరాల లోపు ఉన్న శిశువుల కు, పౌష్టికాహారాన్ని అందజేసే కార్యక్రమం, విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను ఉద్దేశించి అమలుచేస్తున్న ప్రజా పంపిణీ కార్యక్రమం. పౌష్టికాహార లోపంతో అనేక సమస్యలకు అంటకడుతున్నా ప్రస్తుతంలో సబ్సిడీ ధరలకు నడిపే సామాజిక భోజనశాలలు దేశంలో సామాజిక వికాసానికి దోహదం చేస్తాయి. హెూటల్లో, వివాహ ఫంక్షన్లలో మిగిలిన ఆహారాన్ని స్వచ్ఛంద సంస్థలు సేకరించి పంపిణీ చేస్తున్నాయి.



నగరాలలో పేదల ఆకలిని అర్థం చేసుకున్న మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, పేదలకోసం మన ఆంధ్ర రాష్ట్రంలో క్యాంటీన్ సబ్సిడీ ధరలకు ఆహారాన్ని మన రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకు వచ్చారు. మన రాష్ట్రంలోని అన్ని నగర పాలక సంస్థలు సబ్సిడీ ధరలకు ఆహార క్యాంటీన్లను నిర్వహిస్తున్నాయి. వాటిలో చాలా తక్కువ ధరల కు పోషకాహారం మనం పేదలకు అందిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో ఈ పథకం అపూర్వ విజయం సాధించడంతో ఇతర రాష్ట్రాలలో అయినా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిషా, ఢిల్లీ, ఉత్త రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, హర్యానా ప్రభు త్వాలు అదే తరహా కార్యక్రమాలు ఉన్నాయి. తాజాగా కర్ణాటక రాష్ట్రంలో 'సబ్సిడీ ధరలకు నగర పేదలకు ఆహారం అందించేపథకం ప్రారం భించింది. ఆహార క్యాంటీన్లను చిత్త శుద్ధితో విస్తరిస్తే రాష్ట్ర ప్రభుత్వాలకు ఇకమీదట ఇప్పుడు ఆ అగత్యం తప్పవచ్చు. ఆకలి, పేదరికం, పౌష్టికాహార ప్రభుత్వాలు నిబద్ధంగా పూరించవలసిన సందర్భమిది. ఆహార హక్కును నిజం చేసేందుకు ప్రభుత్వాలు అన్నివర్గాలను కలుపుకుని కృషి సాగించాలి. 2013లో చేసిన కార్పొరేట్ సామాజిక బాధ్యత చట్ట నిబంధన అవసరమైతే మార్పుచేసి రూపొందించారు. దేశవ్యాప్తంగా అనేక కంపెనీల ఆహార క్యాంటిన్లు ఏర్పాటు చేసుకోవడానికి, 42 శాతం పిల్లలు పోషకాహార లోపంతో బాధపడు తున్నారన్నది కఠోర వాస్తవం. ఆకలి పౌష్టికాహార లోపం బాధపడుతున్న వారిలో మహిళలు, పిల్లల అత్యధికంగా ఉన్నారు. ఆకలి బాధకు సరైన పరిష్కారం అర్హులందరికీ పనికల్పించడం అదే విధంగా ఆహార పంపిణీ సమతుల ఉత్పత్తిని రెండింతలు చేయడం, ఆహార ధాన్యాలను సక్రమంగా సరఫరా చెయ్యడమే సమస్యలు తొలగించే మార్గం. దేశంలో 31 శాతం ప్రజలు ఆకలి ముప్పు సమస్య ను ఎదుర్కొంటున్నాయి అని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆకలి సమస్యను సమర్థంగా ఎదుర్కొనేందు కు అనేక దేశాలు ఆహారభద్రత చట్టాలను తీసుకు వచ్చాయి.''జాతీయ ఆహార భద్రత'' చట్టం ప్రకారం జనాభా మొత్తం మూడింట రెండొంతుల మందికి ఆహార ధాన్యాలు సబ్సిడీ రేట్లపై అందజేయాలి. ప్రతి వ్యక్తికి నెలకు ఐదు కిలోల బియ్యం, గోధుమలు, తృణధాన్యాలు ఇవ్వాలి. ఈ మొత్తం సరఫరా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా జరగాలని ప్రభుత్వాలు నిర్దేశించాయి. పౌష్టికాహార కొరతకు ఒక ఆహారభద్రత సాధించడానికి తీసుకున్న చర్యలు ప్రజాపంపిణీ వ్యవస్థ ఏర్పాటు అతి ముఖ్యమైంది. 1960వ దశాబ్దంలో ఆహార కొరత ఏర్పడిన సందర్భాలలో వినియోగదారులకు తక్కువ ధరల వద్ద ఆహారధాన్యాల పంపిణీ చేయడానికి. ఆహార ధాన్యాలను మార్కెట్లో వాటి ధరలను స్థిరీకరించడానికి ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. సమతుల పౌష్టికాహారాన్ని అందించడానికి నిత్యావసర వస్తువులైన బియ్యం, గోధుమలు, పంచదార, వంట నూనె, ఇతర వస్తువులు, కిరోసిన్ తక్కువ ధరల వద్ద అందుబాటులోకి తేవడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ''లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థను'' 1996 డిసెంబర్‌లో ప్రవేశపెట్టడం జరిగింది.

ఈ పథకం భారతదేశంలో అత్యంత ప్రాముఖ్యత పొందిన పథకం, సరిహద్దు రాష్ట్రాలలో ఉన్న మహారాష్ట్ర - గుజరాత్ ఒక యూనిట్‌గా, ఆంధ్రప్రదేశ్ తెలంగాణాను మరోయూనిట్‌గా ఎంచుకుంది. జంట రాష్ట్రాల్లో ఉన్న కార్డుదారులు రెండు రాష్ట్రాల్లో ఎక్కడైనా సరే సరుకులు పొందేందుకు అవకాశం ఉంటుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ''నాణ్యమైన బియ్యం'' ఇచ్చి పేదల ఆకలి తీర్చాలని వారిలో ఆనందం నింపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ ముందడుగు వేస్తోంది.

-ప్రొ. హెచ్. లజపతిరాయ్
మాజీ వైస్ ఛాన్సలర్, 9849719583

## ఇరవై ఏళ్ళకు మళ్లీ నోబెల్ బహుమతి



ఆర్థిక శాస్త్రం లో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి మరో సారి భారతీ యునికి లభించడం గర్వించదగ్గ విషయం. ఇరవై ఏళ్ళ క్రితం అమర్త్యసేన్ ఈ బహుమతి పొందిన తర్వాత, మళ్లీ ఈ ఏడాది ప్రవాస భారతీయ శాస్త్రవేత్త అభిజిత్‌కి లభించింది. అభిజిత్‌తో పాటు ఆయన సతీమణి డఫ్లో, మరో శాస్త్రవేత్త క్రేమెర్ ఈసారి ఆర్థిక శాస్త్రంలో నోబెల్ సహ గ్రహీతలు. ఆయన ప్రతిపా దనలు పేదరిక నిర్మూలన దిశగా సకారాత్మక మార్పుల్ని తీసుకువచ్చేవి. కనుక ఆయన్ని అభినం దిస్తున్న ప్రభుత్వం ఆయన మాటల్ని కూడా గౌరవించాలి. ఒక విధానం రూపకల్పనతోనే సరిపోదు, దాని ఫలితాల్ని శాస్త్రీయంగా బేరీజు వేయాలి. క్షేత్రస్థాయిలో వాటి ఉపయోగితను పరీక్షించాలి. తద్వారా అభివృద్ధి సాధనలో సమర్థతను పెంచడం సాధ్యమౌతుం దన్నది ఆయన మౌలిక భావన. అలా క్షేత్రస్థాయిలో పరిశోధించి తగు సూచనలు చెయ్యడంతో దేశంలో ఏభై లక్షల మంది విద్యార్థుల విద్యలో గుణాత్మక మార్పు సాధించినట్టు నోబెల్ కమిటీ ప్రశంసించింది. ఆర్థిక విధానాలు అంతిమ ఫలితాల ఆధారంగా రూపుకట్టాలన్న హేతువైఖరి దేశానికి ఇప్పుడు అవసరం. పైగా ఆయన ఉద్దేశ్యం ప్రకారం భారత దేశంలో ఆర్థిక పరిస్థితి దయనీ యంగా ఉంది. బయటపడే మార్గాలు స్పష్టంగా లేవు. ప్రభుత్వం ఆర్థిక నిపుణుల అభిప్రాయాల్ని గౌరవించాలి. తక్కువ వనరుల్ని సమర్థవంతంగా వినియోగించాలి.

ప్రస్తుతం దేశంలో ఆర్థిక స్థితి మందగించింది. అన్ని రంగాల్లో డీలా. ఉపాధి, ఉద్యోగాలు, ఉత్పాదన, అమ్మకాలు, కొనుగోళ్లు అన్నింటా నిరాశా జనకం. ఈ స్థితిలో కేంద్రీయ బ్యాంకు నుంచి ఎన్నడూలేని విధంగా లక్షా డెబ్బై వేల కోట్లు ప్రభుత్వ ఖజానాకు బదిలీ జరిగింది. మరోవైపు అంతే స్థాయిలో సంపన్నులకు రాయితీలు లభించాయి. అంటే ఆ డబ్బు అంతా కొద్దిమందిని ప్రోత్సహిం చడానికే సరిపోయింది. సరే. దానివల్ల దేశానికి ఉపయోగమెంత మిగిలింది? ఏమాత్రం ఆర్థికం గాడిలో పడింది? బేరీజు వేశారా? బేరీజు వేసి వుంటే, ఆ నిధుల్ని ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి ఎలా వినియోగిస్తే బాగుండేది అన్న ఆలోచన వచ్చి వుం డేది. తదనుగుణంగా మార్పులు చేర్పులు ఉండేవి. ఇలాంటి విషయాలు ప్రజల్లో విస్తృ తంగా చర్చకు రావాలి. ప్రభుత్వం జవాబుదారీ కావాలి. ప్రపంచా నికి ఆర్థిక శాస్త్రవేత్తల్ని అందించడమే కాదు, వా రి వి జ్ఞానాన్ని ఉపయోగించుకున్నప్పుడే దేశానికి ప్రతిష్ట.

-డా. డి.వి.జి.శంకరరావు
పార్వతీపురం.
9440836931

# ఐటీ × ప్రభుత్వం

# కోల్డ్‌వార్




**కేఫ్ కాఫీ డే వ్యవస్థాపకుడు సిద్ధార్థ ఆత్మహత్మ తర్వాత ప్రభుత్వంతో పాటు ఆదాయపు పన్ను శాఖపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఐటి శాఖ అధికారులు కార్పొరేట్లను వేధింపులకు గురి చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో కేంద్రప్రభుత్వం ఐటి శాఖపై కొత్త విధి విధానాలను తీసుకొచ్చింది. వాటిలో భాగంగానే ఫేస్‌లెస్ అసెస్‌మెంట్‌ను ప్రవేశపెట్టింది. దీనిపై ఐటి అధికారుల సంఘం నిరసన వ్యక్తం చేస్తోంది.**

- కొత్త నిబంధనలపై ఉద్యోగుల్లో అసంతృప్తి
- ఏక పక్షంగా తీసుకున్న నిర్ణయం
- సీబీడీటీకి ఉద్యోగుల లేఖ

**ముంబై :** ఆదాయపు పన్ను మదింపుపై కేంద్రప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకురావడంపై ఐటి శాఖ అధికారులు మోడీ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ప్రభుత్వం ఫేస్‌లెస్ అసెస్‌మెంట్ ప్రోగ్రాంను తీసుకొచ్చింది. దీనిపై ఐటి అధికారులు చెప్పేదేమిటంటే తమతో ఎలాంటి సంప్ర దింపులు జరప కుం డా, సరపడా వన రులు లేకుండా కొత్త నిబంధ నలు ఎలా అమలు చేయాలని ప్రశ్నిస్తు న్నారు. కేంద్రప్రభుత్వం పన్ను వసూళ్లలో అతి పెద్ద సంస్కరణ తీసుకొచ్చింది. ఈ నెలలోనే ఫేస్‌లెస్ అసెస్ మెంట్‌ను ప్రవేశపెట్టింది. దీన్ని ఆదాయపుపన్ను శాఖలోని ఉన్న తాధికారులే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కాబట్టి కొత్త నిబంధనలు అమల్లోకి రావడమే అంత తేలిక కాదు. ఆదా యపు పన్ను ఉద్యోగుల ఫెడరేషన్ ప్రతినిధులు, ఇన్‌కంటాక్స్ గెజెటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటి)కి ఒక సం యుక్త లేఖ రాసింది. ఈ లేఖలో కొత్త నిబంధ నలపై అసం తృప్తిని వ్యక్తం చేసింది. కొత్త నిబంధనలను కేంద్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద అమలు చేయాలని చూస్తోందని.. భాగస్వాముల అభి ప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త నిబంధనలు అమలు చేయాలనుకుంటోందని ఐటి శాఖ ఉద్యోగులు ఈ నెల 3వ తేదీన సీబీడీటీకి గాటుగా లేఖ రాశారు. ఐటి శాఖ ప్రయోజనాలను, ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడాన్ని వారు ఆక్షేపిస్తు న్నారు.

### ఫేస్‌లెస్ అసెస్‌మెంట్ గురించి..

ఆదాయపు పన్ను శాఖ కొత్తగా నేషనల్ ఈ అసెస్‌మెంట్ సెంటర్ (ఎన్ఈఏసీ)ని ప్రారంభిం చింది. పన్ను చెల్లింపుదా రుల పట్ల పక్షపాత రహి తంగా వ్యవహరించాలనేదే దీని ప్రధాన ఉద్దేశం. పన్ను చెల్లింపుదారులను ఆదాయపు పన్ను శాఖ వేధిస్తోం దని, పక్షపాతంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు రావడంతో ఎన్ఈఏసీ ఫేస్‌లెస్ ఎల్రక్టానిక్ అసెస్‌మెంట్స్‌ను అమల్లోకి తెచ్చింది. ఈ పద్ధతి ప్రకారం ఆదాయపు పన్నుశాఖ అధికారి, ముఖా ముఖి భేటీకారు. దీంతో ఐటి అధికారికి విశేషాధికారులను తగ్గించినట్లవుతుంది.




### అవినీతి తగ్గించడానికే కొత్త నిబంధనలు..




కేంద్రప్రభుత్వం ఫేస్‌లెస్ ఇన్‌కంటాక్స్ అసెస్‌మెంట్‌ను తీసు కురావడానికి ప్రధాన కారణం.. స్క్రూటినీ పేరుతో ఉద్యోగులు అవి నీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణ. తాజాగా కేఫ్ కాఫీ డే యజమాని విజీ సిద్ధార్థ ఆత్మహత్య చేసుకో వడంతో ఐటి అధికారులపై విమర్శలు పెరిగిపో యాయి. సిద్ధార్థ కూడా ఆత్మహత్య చేసుకోవ డానికి ముందు ఐటి అధికారుల వేధింపు వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు. అటు తర్వాత ఐటి శాఖపై కార్పొరేట్లు పెద్ద ఎత్తున విమర్శలకు పాల్పడ్డారు. దీంతో ప్రభు త్వం దిగివచ్చి కొత్త ఫేస్‌లెస్ టాక్స్ అసెస్‌మెంట్ పేరుతో కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం పన్ను వసూళ్లు తగ్గుతాయని ఐటి అధికారులు చెబు తున్నారు. అదే సమయంలో ఐటి అధికారులపై పని ఒత్తిడి పెరగు తుందని, ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్ల లక్ష్యం విధించి పెద్దమొత్తంలో పన్ను వసూలు చేయాలని ఒత్తిడి చేస్తాయి? ఆర్థిక వ్యవస్థ మందగించడంతో ప్రభుత్వం ఇప్పటికే కార్పొరేట్ పన్నులను తగ్గించింది. ఇవన్నీ అమల్లోకి వస్తే ప్రభుత్వానికి పన్ను వసూళ్లు తగ్గడం ఖాయమని అధికారులు చెబుతున్నారు. అయితే సీబీడీటీ ఉన్నతాధికారులు మాత్రం ఉద్యోగుల లేఖ గురించి స్పందించడానికి నిరాకరించారు. ఈ నెల ప్రారంభంలో సీబీడీటి అధికారులు ఒక ప్రకటనలో కొత్తగా అమల్లోకి వచ్చిన ఫేస్‌లెస్ అసెస్‌మెంట్ వల్ల పారదర్శకత పెరుగుతుందని, లిటిగేషన్లు తగ్గుతాయని, కొన్ని ప్రమాణాలు పాటిస్తున్నందు వల్ల ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మెరుగుపడు తుందని వెల్లడించింది. అదే సమయంలో కేసులను వేగవంతంగా పరిష్కరించుకోవచ్చునని ప్రకటనలో వివరించింది.




కొత్త పోస్టులను భర్తీ చేయడానికి అధికారులను బదిలీ చేయడంతో ప్రాంతీయ ఈ - అసెస్‌మెంట్ సెంటర్లలో అదనపు పనిభారం పడుతుందని..యూనియన్ లేఖలో ప్రస్తావించింది. కొత్తగా పోస్టులను సృష్టించారు కానీ వారికి కావాల్సిన మౌలిక వసతులు సమకూర్చ లేదని, ముఖ్యంగా సీటింగ్ వసతి నుంచి కంప్యూటర్ల వరకు అన్నీ కొరతగా ఉంటున్నాయని లేఖలో ప్రస్తావిం చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికే జీఎస్టీ అమల్లోకి తెచ్చి ఆర్థిక వ్యవస్థ నెమ్మదించడానికి కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో తాజాగా ఫేస్‌లెస్ అసెమెంట్ పేరుతో కొత్త నిబంధనలు తేవడం మరోమారు విమర్శలకు దారి తీసే అవకాశాలున్నాయి.

## ఎగుమతుల్లో పురోగతి లేదు

- సెప్టెంబర్‌లో 6.5 శాతం క్షీణత
- వాణిజ్యలోటు అదుపులోకి...

**న్యూఢిల్లీ:** దేశం నుంచి ఎగుమతులు సెప్టెంబర్ నెలలో 6.57 శాతం క్షీణించి 26 బిలియన్ డాలర్లకు పరిమితం అయ్యాయి. ముఖ్యంగా కొన్ని కీలక రంగాలకు చెందిన ఎగుమతులు బాగా తగ్గుముఖం పట్టాయి. వాటిలో పెట్రోలియం, ఇంజినీరింగ్, తోలు, (లెదర్) రసాయనాలు, వజ్రాలు, నగలుగా చెప్పు కోవచ్చు. దీనికి వ్యతిరేకంగా దిగుమతులు కూడా గణనీయంగా తగ్గాయి. గత నెలలో 13.85 శాతం క్షీణించి 36.89 బిలియన్ డాలర్లు దిగివచ్చాయని ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన అధికారిక గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఎగుమతులకు సంబంధించి మొత్తం 30 కీలక రంగాలకు గాను 22 రంగాల్లో ఎగుమతులు తిరోగమనబాట పట్టాయి. వజ్రాలు, నగలు, ఇంజినీరింగ్ గూడ్స్, పెట్రోలియం ఉత్పత్తుల వరుసగా 5.56 శాతం, 6.2 శాతం, 18.6 శాతంగా నమోదైనాయి. చమురు దిగుమతులు 18.33 శాతం తగ్గి 8.98 బిలియన్ డాలర్లకు దిగిరాగా.. ఏడాది క్రితం 10.99 బిలియన్ డాలర్లుగా నమోదైనాయి. అదే సమయంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలానికి ఎగుమతులు 2.39 శాతం క్షీణించి 159.57 బిలియన్ డాలర్లుగా నమోదైనాయి. దిగుమతులు క ూడా 7 శాతం తగ్గి 243.28 బిలియన్ డాలర్లు పరిమితం అ య్యాయి. బంగారం దిగుమతులు 50.82 తగ్గి 1.27 బిలియన్ డాల ర్లకు దిగివచ్చా యని ప్రభుత్వం విడుదలచేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది.




### తగ్గిన వాణిజ్యలోటు

ఇదిలా ఉండగా సెప్టెంబర్ నెల వాణిజ్య లోటు మాత్రం 8.98 బిలియన్ డాలర్లకు దిగిరాగా.. ఏడాది క్రితం ఇదే నెలలో 10.99 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

## వృద్ధిరేటులో భారత్ టాప్

- చైనాతో పోటీ పడుతున్న భారత్
- ఐఎంఎఫ్ అంచనా

**న్యూయార్క్ :** ప్రపంచ ఆర్థికవ్యవస్థ మందగమనంలో కొట్టుమిట్టాడుతోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. అయితే ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉందని వెల్లడించింది. చైనాతో సమానంగా ఈ ఏడాది జీడీపీ వృద్ధిరేటు 6.1 శాతం సాధిస్తుం దని తెలిపింది. ముందుగా అంచనా వేసినా వృద్ధిరేటులో ఒక శాతం కోత విధించినా.. భారత్ వృద్ధి రేటులో అగ్రస్థానంలో ఉంటుందని ఐఎంఎఫ్ వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్ (డబ్ల్యుఈఓ) మంగళవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. 2020 ఆర్థిక సంవత్సరంలో భారత్ జీడీపీ వృద్ధిరేటు 7 శాతానికి చేరుతుందని అంచనా వేసింది. కాగా డబ్ల్యుఈవో భారత్ వృద్ధిరేటును ఈ ఏడాది జులైలో 7 శాతం నుంచి 0.9 శాతం కోత విధించింది. కాగా అంతకు ముందు ఏప్రిల్ 7.3 శాతం నుంచి 1.2 శాతం తగ్గించింది. భారత్ విషయానికి వస్తే ఆర్థిక వ్యవస్థ మందగిస్తుందని పేర్కొనగా.. గ్లోబల్ వృద్ధిరేటు ప్రకారం చూస్తే భారత్‌వృద్ధిరేటులో కోత విధించినా వృద్ధిరేటు కాస్తా మెరుగ్గానే ఉంటుందని తెలిపింది. భారత్ వృద్ధిరేటు అంచనా 6.1 శాతంగా అంచనా వేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు ఈ ఏడాది 3 శాతం, వచ్చే ఏడాది 3.4 శాతంగా వృద్ధిరేటు ఉండవచ్చునని డబ్ల్యుఈవో పేర్కొంది. చైనా వృద్ధిరేటు వచ్చే ఏడాది మరింత మందగించి 5.8 శాతానికి దిగివస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రధాన ఆర్థికవేత్త గీతా గోపీనాథన్ నివేదికలో పేర్కొన్నారు.






## అంచనాలను మించిన విప్రో

- క్యు2లో లాభం రూ. 2,561 కోట్లు




**బెంగళూరు :** ఐటి దిగ్గజం విప్రో సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభంలో 35.82 శాతం వృద్ధితో రూ.2,561.30 కోట్లు ఆర్జించింది. ఏడాది క్రితం రూ.1,885.70 కోట్లు నమోదు చేసింది. త్రైమాసికం ప్రాతి పదికన చూస్తే 6.2 శాతం వృద్ధిని సాధించింది. మొత్తానికి చూస్తే ఫలితాలు మార్కెట్ అంచనాలను మించిపో యా యి. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం రూ.2,303 కోట్లు నికరలాభం ఆర్జించవచ్చునని లెక్కగట్టారు. రెవెన్యూ 4 శాతం పెరిగి రూ.15,130 కోట్లకు ఎగబాకగా.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.14,716.10 కోట్లని తెలిపింది. రెవెన్యూలో 2.78 శాతం వృద్ధిని సాధించింది. ఫలితాలపై మేనేజింగ్ డైరెక్టర్ సీఈవో అబిదలీ నీమూచ్ వాల్ మాట్లాడుతూ.. క్యూ2లో మంచి ఫలితాలను సాధిం చామని.. రెవెన్యూ పరంగాను లాభాల పరంగా మంచి ప్రదర్శన చూపించామని చెప్పారు. అలాగే అతి పెద్ద ఒప్పందాలను కుదుర్చుకున్నామని తెలిపారు.

## ఖరీదైన గృహ ప్రాజెక్టుల్లోనే జాప్యం




**న్యూఢిల్లీ :** దేశంలోని ఏడు నగరాల్లోని ప్రీమియం గృహ ప్రాజెక్టుల నిర్మాణంలోనే జాప్యం జరుగుతోంది. ఈ జాప్యం ఢిల్లీ- ఎన్సీఆర్, ముంబైలలో అత్యధికంగా 84 శాతం ఆక్రమించాయని స్థిరాస్థి కన్సెల్టెంట్ జెఎల్ఎల్ పరి శోధన నివేదికలో వెల్లడించింది. ఈ నగరాల్లో రూ.75 లక్షల సెగ్మెంట్‌లను అందుబాటు ధర .. మిడ్ సెగ్మెంట్ కింది విభజించింది. అదే ముంబై నగరం విషయానికి రూ.1 కోటిగా నిర్ణయించింది. దేశవ్యాప్తంగా గృహ నిర్మాణ రం గానికి చెందిన ప్రాజెక్టులు సంక్షోభంలో కూరుకుపోయా యన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో జెఎల్ఎల్ తాజా అధ్య యనం చేపట్టింది. ఈ అధ్యయనంలో తేలింది ఏమిటంటే అప్పర్ మిడ్‌సెగ్మెంట్, ప్రీమియం ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరుగుతోందని జెఎల్ఎల్ ఇండియా ప్రధాన ఆర్థి కవేత్త సమంతక్‌దాస్ చెప్పారు. జెఎల్ఎల్ గణాంకాల ప్రకారం ముంబైలో రూ.1.99 కోట్లు, బెంగ ళూరులో రూ.95 లక్షలు, హైదరాబాద్‌లో రూ.94 లక్షలు, చెన్నైలో రూ.87 లక్షలు, న్యూఢిల్లీ- ఎన్సీఆర్‌లలో రూ.75 లక్షలు,పూనే, కోలకతా లలో సరాసరి గృహ ప్రాజెక్టుల విలువ రూ.65.62 లక్షలు, రూ.28.83 లక్షలుగా పేర్కొంది. అందుబాటు ధరల్లోని ప్రాజెక్టుల్లో పెద్దగా జాప్యం జరగడం లేదని, కేవలం కోలకతా, పూనేలో తప్పించి మిగతా నగ రాల్లో పెద్ద ప్రభావం లేదని శ్రద్ధా అగర్వాల్ రీసెర్చి ఎనలిస్టు జెఎల్ఎల్ ఇండియా తెలిపారు. మొత్తం జాప్యంతో పాటు నిలిచిపో యిన ప్రాజెక్టుల విలువ రూ.4.62 లక్షల కోట్లుగా తేలినట్లు జెఎల్ఎల్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

## ఎయిర్‌ఇండియాకు ఇంధనం నిలిపేస్తాం

- రూ. 5 వేల కోట్ల బకాయిలు

**న్యూఢిల్లీ :** ఎయిర్‌ఇండియాపై ప్రభుత్వరంగానికి చెం దిన చమురు కంపెనీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రతి నెల రూ.100 కోట్లు చమురు బిల్లు చెల్లిస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం హామీ నిలబెట్టుకోవడం లేదని ఆరోపిస్తున్నాయి. ప్రస్తుతం చమురు కంపెనీలకు ఎయిర్ ఇండియా మొత్తం రూ.5,000 కోట్లు బకాయిపడింది. బకాయిలు చెల్లించ కపోతే శుక్రవారం నుంచి దేశంలోని పెద్ద విమానాశ్ర యాల్లో ఇంధనం నిలిపివేస్తామని హెచ్చరించాయి. ఎయిర్‌ఇండియా ఈ ఏడాది జూన్‌లో సెప్టెంబర్‌లో మూడు పీఎస్‌యు చమురు కంపెనీలకు ప్రతి నెల రూ.100 కోట్లు చెల్లించి పాత బకాయిలు తీరుస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు ఇచ్చినమాటను నిలబెట్టుకోలేదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డైరెక్టర్ ఫైనాన్స్ సందీప్‌కుమార్ గుప్తా చెప్పారు. 3 చమురు కంపెనీలు ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు కూడా ఎయిర్ ఇండియాకు నోటీసులు జారీ చేసి బకాయిలు చెల్లించకపోతే సరఫరా నిలిపి వేస్తామని హెచ్చరించాయి.

## ఆటో షేర్లు హవా

- మూడో రోజు లాభాల్లోనే
- సెన్సెక్స్ 291 పాయింట్ల వృద్ధి

**ముంబై :** భారతీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభాలతో ట్రేడ్ అయ్యాయి. అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి కనిపించడంతో పాటు రాబోయే పండుగ సీజన్‌లో డిమాండ్ పెరుగుతుందన్న అంచనాతో ఇన్వెస్టర్లు పెద్దెత్తున షేర్లు కొనుగోలు చేశారు. బీఎస్ఈ సెన్సెక్‌లో 421 పాయింట్ల ర్యాలీ ఏర్పడింది. అయితే మార్కెట్ ముగిసే నాటికి ఆ లాభాలు కాస్తా తగ్గి 291.62 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 38,506.09 పాయింట్ల వరకు ఎగబాకింది. నిఫ్టీ కూడా 87 పాయింట్లు లాభపడి 11,428.30 వద్ద స్థిర పడింది. బీఎస్ఈలో ఆటో, లోహ రంగానికి చెందిన షేర్లలో ర్యాలీ ఏర్పడింది. బీఎస్ఈలో అత్యధి కంగా లాభపడిన షేర్లలో వేదాంత, ఎంఅండ్ఎం, ఒఎన్ జీసీ, హీరోమోటోకార్ప్, మారుతి సుజుకియ హెచ్ యూఎల్ షేర్లలో 3.79 శాతం వరకు లాభపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా భారతి ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, టాటామోటార్స్, హెచ్ సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్‌లు 2.53 శాతం వరకు క్షీణించాయి. బీఎస్ఈలో 30 షేర్లకు గాను 24 షేర్లు లాభాలతో ముగియగా.. 6 షేర్లు నష్టాలతో ముగిశాయి. రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌తో కాస్తా పుంజుకోవడంతో డిసెంబర్‌లో జరిగే ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ నిపు ణులు అభిప్రాయపడుతున్నారు.

కాగా రిటైల్ ద్రవ్యోల్బ ణం సెప్టెంబర్‌లో 14 నెలల గరిష్టానికి 3.99 శాతానికి ఎగబాకింది. కూరగాయలు, పప్పుల ధరల పెరగడంతో దాని ప్రభావం ద్రవ్యోల్బణంపై కనిపించింది. అయినా.. ఆర్‌బీఐ పరిధిలోనే ద్రవ్యోల్బణం ఉంది. డాలర్ మారకంతో రూపాయి 31 పైసలు క్షీణించి 71.54 వద్ద ముగిసింది.




## సబ్బవరంలో సురక్షిత గ్రామీణం

- ప్రారంభించిన అమెరికా కౌన్సిల్ జనరల్

**హైదరాబాద్ :** సురక్షితమైన గ్రామీణం కార్యక్రమం పేరుతో ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 100 గ్రామాల్లో మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించేందుకు యూస్ కౌన్సిల్ జనరల్ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ అవగాహన సదస్సుకు ప్ర జల నుంచి విశేష స్పందన లభించింది. వందలాది మంది ప్రజలు స్వచ్ఛంద కార్యకర్తలుగా తమ పేర్లను నమోదు చేయించుకు న్నారు. యూఎస్ కౌన్సులెట్ జనరల్ హైదరాబాద్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మై చాయిస్ పౌండేషన్ విశాఖపట్టణం సమీపంలోని సబ్బవరం గ్రామంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. యూఎస్ కౌన్సులెట్ జనరల్ హైదరాబాద్ జోయెల్ రెఫిమాన్ సేఫ్ విలేజ్ కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. మానవ అక్రమ రవాణాలను ఎలా ఎదుర్కొవాలో గ్రామీణులకు వర్క్‌షాపు ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఆపరేషన్ రెడ్ అలర్ట్ కింద స్థానిక ఎన్‌జీఓలు మహిళను అక్రమ రవాణా గురించి సురక్షిత గ్రామీణం అనే పేరుతో గ్రామీణులకు శిక్షణ ఇచ్చినట్లు మైచాయిస్ చీఫ్ సుధా ఉపాధ్యాయులు చెప్పారు.



## ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ డిస్కౌంట్లపై ప్రభుత్వం ఫోకస్




**న్యూఢిల్లీ:** ఇటీవల ముగిసిన పండుగ సీజన్‌లో ఈ-కామర్స్ కంపెనీలు వాల్‌మార్ట్- ఫ్లిప్‌కార్ట్‌లు విదేశీ పెట్టుబడుల నిబంధనలు ఉల్లంఘించి పెద్ద మొత్తంలో డిస్కౌంట్లు ఇచ్చాయని అని ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆన్‌లైన్ డిస్కౌంట్ల వల్ల దేశం లోని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనే వారు ఇబ్బందులు పడ కుండా ఉండేం దుకు ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఈ నిబంధ నలను దృష్టిలో ఉంచు కొని ఈ -కామర్స్ కంపె నీలు తమ వ్యాపార పంథాలను మార్చుకోవాల్సి వచ్చింది. దీంతో అమెరికా ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో న్యూఢిల్లీ - వాషింగ్టన్‌ల మధ్య సం బంధాలు దెబ్బతిన్నాయి. అమెజాన్, ఫ్లిప్ కార్ట్‌లు మాత్రం కేంద్ర ప్రభుత్వం నిబంధ నలకు లోబడి వ్యాపారాలు చేశామని చెబు తుండగా.. స్థానిక వ్యాపార గ్రూపులు మాత్రం పండుగ సీజన్‌లో కొన్ని కొన్ని సందర్భాల్లో 50 శాతం కంటే ఎక్కువ డిస్కౌంట్ల ను ఆఫర్ చేశాయని ఆరోపిస్తున్నాయి. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటి) ఆధారాలతో సహా వాణిజ్య మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేసింది. ఫిర్యా దులపై కేంద్ర ప్రభుత్వం సమీక్ష జరుపుతోందని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఎగ్జిక్యూటివ్‌లను గత వారం వాణిజ్య మంత్రి త్వశాఖ అధికారులు ఈ అంశంపై చర్చలకు పిలిచారు. ఫ్లిప్ కార్ట్ ఒక ప్రకటనలో చట్ట ప్రకా రం వ్యాపారం చేశామని చెబుతుం డగా.. అమె జాన్ మాత్రం ప్రభుత్వ అధికారులతో బహి రం గంగా.. పారదర్శకంగా చర్చలు జరిగాయని చెబుతోంది. రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని కస్టమ ర్లను ఆక ర్షించేందుకు అమె జాన్‌తో పాటు ఫ్లిప్‌కార్ట్‌లు జాతీయ వార్తా పత్రికల్లో ఫుల్‌పేజీ అడ్వ ర్టయిజ్ మెంట్లు ఇస్తున్నట్లు సీఏఐటి తెలి పింది. ఈ ఆఫర్లు శ్యాం సంగ్ నుంచి ఆపిల్ ఫోన్‌లకు వరకు బట్టల నుంచి డైపర్ల వరకు ఇస్తున్నా యని తెలిపింది. భారీ డిస్కౌంట్ ఆఫర్ల వల్ల కస్టమర్లు ఆన్ లైన్‌లో కొనుగోలు చేస్తున్నారని.. ఈ నెల తమ వ్యాపారం 30 నుంచి శాతం వరకు పడిపో యిం దని సీఏఐటి సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు.





## 25వేల హోంగార్డుల తొలగింపు

**లక్నో:** యూపీలోని యోగి ఆదిత్య నాథ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.25 వేల మంది హోం గార్డులను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీపావళి పండగ వేళ భారీ స్థాయిలో ఉద్యోగాల కోత విధించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తర్ ప్రదేశ్‌లో మొత్తం లక్ష మంది హోంగార్డులుండగా.. వారందరూ.. రోజువారీ చెల్లింపుల కింద పనిచేస్తున్నట్లు పేర్కొన్న యూపీ ప్రభుత్వం ఆర్థిక భారంతోనే 25 వేల మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. హోంగార్డులకు గతంలో రోజుకు రూ. 500 ఇవ్వగా.. ఇటీవల ఆ చెల్లింపులను రోజుకు రూ.672 పెంచారు. దీంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరిగింది. 25వేల మంది హోంగార్డులను ఈ ఏడాది ఏప్రిల్‌లో పోలీసులకు సహాయ సహకారాలు అందించేందుకు నియమించుకున్నారు. వారి అవసరాలు తీరిపోవడంతో యూపీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఆగస్టులో జరిగిన సమావేశంలో నూతనంగా తీసుకున్న హోం గార్డులను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్ 11 నాటికే వారి సేవలు ముగిసినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. దేశ ఆర్థిక వృద్ధిరేటు ఐదేళ్ల కనిష్ఠాన్ని తాకి 5 శాతంగా నమోదుకావడం, పన్నురాబడి తగ్గిపోవడం వంటి కారణాల వల్ల ప్రభుత్వ ఖర్చులు తగ్గించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందంటూ ఇటీవల నేషనల్ శాంపిల్ సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. 2017-18 లో నిరుద్యోగం రేటు 6.1 శాతానికి చేరుకుని.. 45 ఏళ్ల కనిష్ఠాన్ని తాకినట్లు వివరించింది. అయినా యూపీ ప్రభుత్వం హోంగార్డులను మూకుమ్మడిగా తొలగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## చిద్దూ అరెస్టుకు ఈడీకి గ్రీన్‌సిగ్నల్



**న్యూఢిల్లీ:** ఐఎన్ఎక్స్ మీడియా కేసులో సెప్టెంబర్ 5 నుంచి తీహార్ జైలులో ఉన్న 74ఏళ్ల సీనియర్ కాంగ్రెస్ నేత చిదంబరాన్ని అరెస్టు చేసేందుకు ఈడీకి ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేంద్ర మాజీ ఆర్థికమంత్రి చిదంబరాన్ని బుధవారం అరెస్టు చేసే అవకాశం ఉంది. మనీలాండరింగ్ కేసులో ఆయనను అధికారికంగా అరెస్టు చేయడానికి ఈడీ సోమవారం న్యాయస్థానంలో రెండు దరఖాస్తులను దాఖలు చేసింది. ఈడీ దరఖాస్తులను పరిశీలించిన న్యాయస్థానం దర్యాప్తు సంస్థకు రెండు అవకాశాలు ఇచ్చింది. చిదంబరాన్ని కోర్టు ప్రాంగణంలోనే అరగంటపాటు ప్రశ్నించడం అనంతరం కస్టడీ కోరుతూ దరఖాస్తు దాఖలు చేయడం లేదా తీహార్ జైలు నుంచి అరెస్టు చేయడం ఏదో అవకాశాన్ని ఎంచుకోవాలని కోరింది. న్యాయస్థానం సూచించిన ఆప్షన్ మేరకు ఈడీ చిదంబరాన్ని ఉదయం అరెస్టు చేసి సాయంత్రం 4గంటలకు కోర్టులో హాజరుపరుస్తామని తెలిపింది. అనంతరం కస్టడీ కోరుతూ దరఖాస్తు చేయనుంది. కాగా చిదంబరం ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో సెప్టెంబర్ 5నుంచి తీహార్ జైల్లో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు.

# ట్యాక్సీబోట్ ఎక్కిన ఎయిరిండియా

**న్యూఢిల్లీ:** జాతీయ విమానయాన సంస్థ ఎయిరిండియా మరో మైలురాయిని చేరుకుంది. ప్రపంచంలోనే తొలిసారి ట్యాక్సీబోట్‌ను వాడుకలోకి తీసుకొచ్చి రికార్డు సృష్టించింది. ఎయిర్‌బస్ ఎ-320ని రన్‌వేపై సమీప గమ్యస్థానాలకు (పార్కింగ్‌బే) తీసుకెళ్లేందుకు దీన్ని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ట్యాక్సింగ్ వాహకానికి ప్రత్యామ్నాయంగా, పైలట్ నియంత్రణలో నడిచే సెమీ రోబోటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ట్రాక్టర్‌ను ప్రవేశపెట్టింది. ట్యాక్సీబోట్‌ను ఫ్రెంచ్ కంపెనీ భాగస్వామ్యంతో ఇజ్రాయిల్ ఏరోస్పేస్ సంస్థ నిర్మించింది. కాగా దీన్ని ఢిల్లీ-ముంబై ఎయిరిండియా సర్వీస్ విజయవంతంగా పరీక్షించింది. ఇంజిన్లను స్విచ్ఆఫ్ చేసిన తర్వాత విమానాన్ని పార్కింగ్ ప్రదేశం నుంచి రన్‌వేకు, రన్‌వే నుంచి పార్కింగ్ ప్రదేశానికి ట్యాక్సీబోట్ తీసుకెళ్తుంది. తద్వారా ఆ సమయంలో విమానం ఉపయోగించే ఇంధనంలో 85 శాతం ఆదా అవుతుంది.విమానాలు ల్యాండ్ అయిన తర్వాత వాటిని లాగడానికి కూడా దీనిని ఉపయోగించవచ్చు. కానీ, యిర్ ఇండియా వాటిని ప్రస్తుతం పార్కింగ్ ప్రాంతం నుంచి రన్‌వే వరకు లాక్కెళ్లేందుకు మాత్రమే వాడాలని భావిస్తోంది. ఇంధనం ఆదా చేయడంతోపాటు, కర్బన ఉద్గారాలను ప్రతి 15 నిముషాలకు 800 గ్రాముల మేరకు తగ్గించేందుకు, 60 శాతం ధ్వని కాలుష్యాన్ని నివారించేందుకు ట్యాక్సీబోట్ ఉపకరిస్తుంది. ఈ ఏడాది ప్రారంభంలో టాక్సీబోట్ ట్రయల్స్‌ను ఎయిరిండియా పూర్తిచేసింది. తద్వారా ఈ ఘనత సాధించిన మూడవ దేశీయ విమానసంస్థగా నిలిచింది. ఎయిరిండియా కంటే ముందు స్పైస్ జెట్, జెట్ ఎయిర్‌వేస్ ఈ ప్రయత్నాలు చేశాయి. బోయింగ్ 737-800 విమానంలో కూడా ట్రయల్స్ చేపట్టనున్నారు. ఇక్కడ సక్సెస్ అయితే, త్వరలో దేశంలోని అన్ని బోయింగ్ విమానాలు టాక్సీబోట్‌ను వాడేందుకు మార్గం సుగమం అవుతుంది.

ట్యాక్సీబోట్ల వినియోగం నేపథ్యంలో ఇందుకు సంబంధించి ప్రొటోకాల్ విడుదల చేయబోతున్నామని ఎయిరిండియా పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విమానాశ్రయాలకు మొత్తం 40 ట్యాక్సీ బోట్లను తరలించనున్నారు. గతేడాది అక్టోబర్‌లో స్పైస్‌జెట్ ట్యాక్సీబోట్ ద్వారా విజయవంతంగా బోయింగ్ 737 విమానాన్ని రన్‌వేపైకి ఎక్కించింది. దేశంలో మొదటిసారి ఈ పరికరాలను ఉపయోగించిన ఘనత దక్కించుకుంది. ఆగస్టు 15న, ఢిల్లీ నుండి శాన్‌ఫ్రాన్సిస్కోకు ఉత్తర ధ్రువం మీదుగా తొలిసారి ప్రయాణించిన ఎయిర్ ఇండియా, రెండు నుంచి ఏడు టన్నుల ఇంధనం ఆదా చేసింది. అదే సమయంలో 6- 21 టన్నుల ఉద్గారాలను తగ్గించగలిగామని చెప్పింది.



# ఆర్మీ - అపాచీ హిట్ ఫార్ములా!

- పదాతి బలగాలతో అనుసంధానిస్తేనే మంచి ఫలితాలు
- యుద్ధ హెలికాప్టర్లను పూర్తిస్థాయిలో వినియోగించాలి
- రక్షణరంగ నిపుణుల అభిప్రాయం

**న్యూఢిల్లీ:** నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతలు చేట్టిన తర్వాత రక్షణరంగం అంత్యంత శక్తివంతంగా నిర్మితమవుతోంది. ముఖ్యంగా వైమానికదళం శత్రుదుర్భేధ్యంగా మారింది. అగ్రదేశాలకు ధీటుగా యుద్ధవిమానాలను ఐఏఎఫ్ సమీకరించింది. 2020 నాటికి మరిన్ని అత్యాధునిక జెట్‌ఫైటర్లు రక్షణసేనలో భాగస్వామ్యం కానున్నాయి. ఈ జాబితాలో ఫ్రెంచ్‌కు చెందిన రాఫెల్ జెట్ ఫైటర్ల నుంచి అమెరికాకు చెందిన అత్యాధునిక అపాచీ యుద్ధహెలికాప్టర్లు, రష్యా నిర్మిత ఎస్-400 యుద్ధ విమానాలు భారత గగనతలంపై బలమైన రక్షణకవచంగా నిలవబోతున్నాయి. ఇటీవలి సంవత్సరాల్లో పొరుగుదే శాలతో నెలకొన్న ఉద్రిక్తల నేపథ్యంలో వీటికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అమెరికాకు చెందిన 22 అధునాతన అపాచీ హెలికాప్టర్లు వచ్చే యేడాది మార్చిలో వైమానిక దళంలో చేరబోతున్నాయి. వీటిని భూ బలగాలతో అనుసం ధానం చేసినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని రక్షణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. సంయుక్త ఆపరేషన్స్ ద్వారా వ్యూహాత్మక ప్రణాళికలు రచించాలని విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ దీపేంద్ర సింగ్ హుడా చెప్పారు. ఎంఐ-18, ఎంఐ-17, ఎంఐ-25, ఎంఐ-35 హెలికాప్టర్ల స్థానాన్ని ఎపాచీ ఎహెచ్-64ఇ (ఐ) తరహా యుద్ధ హెలికాప్టర్లు ఆక్రమించనున్నాయి. గతనెలలో పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌కు 8 అపాచీలు చేరుకున్న సంగతి తెలిసిందే. ఐఏఎఫ్ కోసం 2015లో బోయింగ్ కంపెనీతో రక్షణ ఒప్పం దం కుదిరింది. ఇదికాకుండా ఆర్మీ కోసం ప్రత్యేకంగా మరో ఆరు అపాచీలు అవసరమని రక్షణశాఖ గుర్తించింది. దీనికిగా ను రూ.4168 కోట్లతో విడిగా ఒప్పందం జరిపింది. ముంద స్తు ఒప్పందం ప్రకారం, దశలవారీగా ఎఎహెచ్ 64 ఇ యుద్ధ హెలికాప్టర్లను బోయింగ్ సరఫరా చేయనుంది. ఈ ఏడాది డిసెంబర్‌లో మరో ఐదింటిని అందజేయనున్న బోయింగ్, వచ్చే యేడాది మార్చిలో ఇంకొక ఐదు అపాచీలను సరఫరా చేయనున్నట్లు వెల్లడించింది. అపాచీ హెలికా ప్టర్లను ట్యాంక్ కిల్లర్స్‌గా పిలుస్తారు. శత్రు సైన్యానికి చెందిన యుద్ధట్యాంకులను 30-50 అడుగుల ఎత్తునుంచే ధ్వంసం చేయగలడం దీని ప్రత్యేకత.

### స్వదేశీ అస్త్ర శక్తి: రావత్

రక్షణరంగంలో స్వదేశీ ఆయుధ వ్యవస్థలు కీలకం కానున్నాయని, భవిష్యత్ యుద్ధాల్లో స్వదేశీ ఆయుధాలతో సాయుధ బలగాలు విజయాలు సాధిస్తాయని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ ధీమా వ్యక్తంచేశారు. ఢిల్లీలో జరిగిన 41వ డిఆర్‌డిఓ డైరెక్టర్ల సదస్సులో రావత్ పాల్గొని ప్రసంగించారు. ప్రసంగించారు. ''ఆయుధాలు -మందుగుండు సామగ్రిని అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాలలో భారతదేశం ఒకటి. స్వాతంత్ర్యం సాధించిన 70 ఏళ్ల తర్వాత కూడా ఇలాంటి పరిస్థితి కొనసాగుతుండటం మంచి పరిణామం కాదు. అయితే, గత కొన్నేళ్లుగా ఇది మారుతోంది. అని రావత్ చెప్పారు.

### టెక్నాలజీలో భారత్ రన్నరప్: దోవల్

మెరుగైన ఆయుధాలు కలిగిన సైన్యాలు మానవజాతి విధిని నిర్ణయిస్తాయని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అన్నారు. ఢిల్లీలో జరిగిన రక్షణ పరిశోధన-అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదైనా సైనిక చర్య సక్సెస్ కావాలంటే, సాంకేతికత, డబ్బు కీలకమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రపంచంలో సైనిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో ఇండియా రన్నరప్‌గా ఉందన్నారు. సముచిత సాంకేతిక పరిజ్ఞానాలు భారతదేశాన్ని మరింత సురక్షితంగా ఉంచుతాయి. ఆరు కొత్త జలాంతర్గాముల నిర్మాణానికి కేంద్రం 40 వేల కోట్లను కేటాయించింది. వీటితోపాటు రూ. 21వేల కోట్లతో 111 కొత్త హెలికాప్టర్లు తయారు చేయనున్నాం. దేశంలోని రెండవ స్కార్పియన్ తరహా యుద్ధ జలాంతర్గామి అయిన ఐఎన్ఎస్ ఖండేరి నేవీలో చేరింది అని దోవల్ వివరించారు.



## హైకోర్టుల్లో జడ్జీల కొరత

- 25 రాష్ట్రాల్లో 420 ఖాళీలు



**న్యూఢిల్లీ:** ప్రజలకు సత్వర న్యాయసేవలు అందించాలన్న లక్ష్యం ఎండమావిని తలపిస్తోంది. ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జీల కొరత ఇందుకు నిదర్శనం. ఒకవైపు మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇంకొకవైపు కోర్టుల్లో సరిపడా న్యాయమూర్తులు లేకపోవడం కేసుల పరిష్కారంలో మరింత జాప్యానికి కారణం అవుతోంది. ప్రస్తుతం సుప్రీం కోర్టులో పరిమితి మేరకు పూర్తిస్థాయిలో జడ్జిలు ఉండగా, హైకోర్టుల్లో మాత్రం జడ్జీల ఖాళీలు భర్తీకావడం లేదు. దేశంలోని 25 హైకోర్టుల్లో ఈ సమస్య ఉన్నదని సాక్షాత్తు కేంద్రన్యాయ శాఖ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. పదవీవిరమణ, రాజీనామాల వల్ల ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. అక్టోబర్ 1న విడుదల చేసిన నివేదిక ప్రకారం, వివిధ రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో 420 జడ్జీల ఖాళీలు ఉన్నాయి. ఈ యేడాదిలో ఇదే అత్యధికం. హైకోర్టుల్లో మొత్తం 1079 మంది న్యాయమూర్తులు పనిచేయాల్సి ఉండగా, కేవలం 659 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. జులైలో 403 ఖాళీలుండగా, ఈ సంఖ్య ఆగస్టులో 409కి, సెప్టెంబర్‌లో 414కి, అక్టోబర్‌లో 420కి చేరింది. అదే సమయంలో హైకోర్టుల్లో 43 లక్షల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. హైకోర్టుల్లో న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో భాగంగా అర్హులైన వారి పేర్లను ముగ్గురు సభ్యుల సుప్రీం కొలీజియం న్యాయశాఖకు సిఫార్సు చేస్తుంది. జాబితాలోని న్యాయ మూర్తుల నేపథ్యాన్ని, సమర్థతకు సంబంధించి ఇంటెలిజె న్స్ నివేదికలను పరిశీలించిన మీదట తుది జాబితాను న్యాయశాఖ ఖరారు చేస్తుంది. అనంతరం ఫైనల్ జాబితాను సుప్రీం కొలీజియంకు అందజేస్తుంది. ఇదే సుప్రీంలో ఖాళీల భర్తీకిఐదుగురు సభ్యులు కొలీజియం ఈ బాధ్యతలను నిర్వర్తిస్తుంది. సెప్టెంబర్‌లో నలుగురిని కొత్తగా సుప్రీం జడ్జీలుగా నియమించడంతో సర్వోన్నత న్యాయస్థానంలో కేటాయింపులకు అనుగుణంగా 34 మంది అందుబాటులో ఉన్నట్లు అయింది.

# పాక్‌కు చుక్క నీరివ్వం!

- రైతుల కళ్లలో వెలుగులు నింపుతాం
- నీటి హక్కులను కాపాడుతాం
- హర్యానా ఎన్నికల ర్యాలీలో ప్రధాని

**చక్రిదాద్రి:** దాయాది దేశం పాకిస్థాన్‌కు ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి తీవ్ర హెచ్చరికలు చేశారు. భారత్ మీదుగా పాకిస్థాన్‌కు చుక్క నీటిని కూడా వదలబోమని స్పష్టం చేశారు. హర్యానా ఎన్నికల ర్యాలీలో మోడీ ప్రసంగిస్తూ.. సరిహద్దుల మీదుగా పాకిస్థాన్‌కు వెళ్తున్న నీటి వల్ల హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని... వారి నీటి హక్కులను కాపాడేందుకు ఇక మీదట పాకిస్థాన్ వైపు వెళ్లే నీటిని ఆపేస్తామని తెలిపారు. గత 70 ఏళ్లుగా హర్యానా ప్రజలకు రావాల్సిన నదీ జలాలు పాకిస్థాన్‌కు వెళ్లాయి.

ఆ నీటిని మోడీ నిలిపివేస్తారు. ఇళ్లు లేని పేదలుకు సొంతింటి కలను నేరవేరుస్తాడు. అని హామీ ఇచ్చారు. హర్యానా నదీ జలాలపై తన పోరాటం ఆగదని వ్యాఖ్యానించిన మోడీ.. అక్కడి రైతుల జీవితాల్లో వెలుగులు నింపేలా సాగునీటి కష్టాలకు చెక్ పెడతామని చెప్పారు. ఇటీవల చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో జరిగిన భేటీ సందర్భంగా దంగల్ సినిమాలో హర్యానా కుస్తీ నారీ బబితా ఫొగాట్ ధైర్యసాహసాలను ప్రసంగించాలని గుర్తు చేశారు. చైనా అధ్యక్షుడి మాటలు వింటుంటే తనకెంతో గర్వంగా అనిపించిందని చెప్పారు.

కామన్‌వెల్త్ క్రీడల్లో రెండు సార్లు దేశానికి బంగారం పతకం సాధించిపెట్టిన బబిత దాద్రి అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ తరపున పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆమెకు మీరు పూర్తిమద్దతునివ్వాలని మోడీ పిలుపునిచ్చారు. హర్యానా ముఖ్యమంత్రతి మనోహర్ లాల్ ఖట్టర్ బేటీ బచావో.. బేటీ పఢావో ప్రచారాన్ని విస్తృతం చేసి..గ్రామీణ ప్రాంతాల బాలికల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారని ప్రశంసించారు. జమ్ము కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుపై కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించిన మోడీ.. గత 70 ఏళ్లలో కాంగ్రెస్ సాధించలేని విజయాన్ని ఐదేళ్లలో బీజేపీ ప్రభుత్వం సాధించిందని గుర్తు చేశారు. హర్యానాకు నేను ఎన్నికల ప్రచారానికి రాలేదు.



ఓట్లు అడగాలన్నది నా ఉద్దేశమే కాదు. హర్యానా ప్రజలే నన్ను రప్పించారు. వారి ప్రేమాను రాగాలే ఇంతదూరం రప్పించాయి. ఈ దీపావళి మనకెంతో ప్రత్యేకమైనది. ఈ దీపావళిని మన ఆడబిడ్డలకు అంకితమిద్దాం. వారి విజయాలకు గుర్తుగా జరుపుకుందాం. హర్యానాలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది. ఒక వాహనానికి రెండు ఇంజిన్లు ఉంటే దాని పరుగు ఎలా ఉంటుందో.. బీజేపీ హయాంలో హర్యానా అభివృద్ధి కూడా అలా ఉంది. అని మోడీ పేర్కొన్నారు. 90 అసెంబ్లీ స్థానాలున్న హర్యానాలో ఈనెల 21న ఎన్నికలు జరగనున్నాయి.

# ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు





**పూణె:** మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుడంతో ప్రధాన రాజకీయ పార్టీల ప్రచారం నువ్వా.. నేనా అన్నట్లుగా సాగుతోంది. మరోసారి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బీజేపీ, ఈసారి ఎలాగైనా బీజేపీ, శివసేనలను దెబ్బతీసి.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ తహతహలాడుతోంది.

### బీజేపీ మేనిఫెస్టో విడుదల

వచ్చేఐదేళ్లలో కోటి మందికి ఉద్యోగాలు, 2022 నాటికి ప్రతీ కుటుంబానికి సొంతిల్లు నిర్మించి ఇస్తామని మహారాష్ట్ర బీజేపీ హామీ ఇచ్చింది. రెండోసారి అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన బీజేపీ.. వచ్చే ఐదేళ్లలో మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్‌గా మారుస్తామని హామీ ఇచ్చింది. రైతులకు రుణమాఫీతో పాటు రాష్ట్ర, జాతీయ రహదారుల నిధులు కేటాయిస్తామని ప్రకటించింది. రూ. 16 వేల కోట్లతో చేపట్టే ప్రతిష్ఠాత్మక మరట్వాగ డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా పేదల సురక్షిత మంచినీరు అందిస్తామని పేర్కొంది. రాష్ట్రంలో ఏడు మౌలిక రంగ ప్రాజెక్టుల్లో రూ. 5 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టి ఉద్యో, ఉపాధి అవకాశాలను పెంచుతామని వివరించింది. బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో మహారాష్ట్ర అంటే అవినీతికి అడ్డాగా ఉండేదని.. గత ఐదేళ్లలో తాము అవినీతి రహిత రాష్ట్రంగా మార్చామని.. మరోసారి అధికారంలోకి వస్తే అవినీతి అనే మాట కూడా వినిపించకుండా చేస్తామని తెలిపారు.

### ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు..

మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదర్భలో ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోడీని పిక్ పాకెటర్‌గా అభివర్ణించిన రాహుల్... రైతుల గోడు, నిరుద్యోగం వంటి సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మోడీ ప్రభుత్వం చంద్రయాన్ 2, కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాలను తెరపైకి తెస్తున్నారని రాహుల్ విమర్శించారు. మోడీ ప్రభుత్వ హయాంలో అమలులోకి వచ్చిన జీఎస్టీ వల్ల చిన్న వ్యాపారుల జీవితాలు చిద్రమైపోయాయని మండిపడ్డారు.

# జాటేతర ఓట్లు కొల్లగొట్టేదెలా..?

**చండీగఢ్:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీగా వ్యూహాలు రచిస్తున్నాయి. కుల రాజకీయాలకు పెట్టింది పేరుగా చెప్పుకునే హర్యానాలో సెంటిమెంట్‌ను పండించి ఓట్లు కొల్లగొట్టేందుకు ఇరు పార్టీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రస్తుత బీజేపీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ జాట్ కులస్తుడు కాకపోవడంతో ఇతర వర్గీయుల ఓట్లన్నీ బీజేపీకే వేసేలా ప్రచారం నిర్వహిస్తున్నారు. అభ్యర్థులను కూడా అత్యధికంగా నాన్ జాట్లను ప్రకటించడం బీజేపీకి కలిసివచ్చే అంశమని రాజకీయ విశ్లేషకులు పేర్కొనడంతో అందరి దృష్టి ఇప్పుడు జాట్‌ఏతర కులస్తులపై పడింది. హర్యానా మొత్తం జనాభాలో జాట్ కులస్తులు 28 శాతం ఉండగా..

తమకు ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కొంతకాలంగా తీవ్ర ఆందోళనలు చేశారు. వారి డిమాండ్లను నెరవేర్చేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ.. రిజర్వేషన్లకు సుప్రీంకోర్టు అంగీకరించకపోవడంతో జాట్లు ఖట్టర్ ప్రభుత్వంపై గుర్రును ప్రదర్శించారు.

దీంతో ఈ ఎన్నికల్లో వారి ఓట్లు ఎవరికి పడతాయన్నదే ఆసక్తికరంగా మారింది. జాట్ల రిజర్వేషన్ డిమాండ్‌ను నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ సైతం సాహసించకపోవడంతో ఇతర కులస్తుల ఓటు బ్యాంకును కొల్లగొట్టేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ పోటీపడుతున్నాయి.

### కాంగ్రెస్‌కు చీలికల దెబ్బ

జాట్లకు ఉద్యోగ రిజర్వేషన్లు కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆవర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ పార్టీ దాన్ని క్యాష్ చేసుకోవడంలోనూ విఫలమైంది. బీజేపీ వ్యతిరేక ఓట్లన్నీ కాంగ్రెస్, ఓం ప్రకాశ్ చౌతాలా నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్డీ)కు పడతాయనుకుంటున్న తురణంలో కాంగ్రెస్ మిత్రపక్షం ఐఎన్ఎల్డీలో చీలికలు వచ్చాయి. రాజకీయంగా చక్రం తిప్పగల రెండు కుటుంబాల మధ్య వచ్చిన విభేదాలతో ఓట్లన్నీ చీలిపోయే పరిస్థితి తలెత్తింది. దీంతో ఆ ఓట్లు కూడా బీజేపీకే పడే అవకాశముందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### మారిన వ్యూహాలు

2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మొత్తం అభ్యర్థుల్లో 22.2 శాతం మంది జాట్లకు సీట్లు కేటాయించగా.. ఈసారి ఇద్దరిని తగ్గించి 90 అసెంబ్లీ స్థానాల్లో కేవలం20 మాత్రమే జాట్లకు కేటాయించింది. కాంగ్రెస్ పార్టీ సైతం గత ఎన్నికల కంటే ఈసారి జాట్ అభ్యర్థులను తగ్గించడం గమనార్హం. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున 28.8 శాతం జాట్ అభ్యర్థులు ఎన్నికల బరిలో దిగగా.. ఈసారి ఇద్దర్ని తగ్గించి..26 మందికి టికెట్లు కేటాయించింది.హర్యానాలో జాట్ల తర్వాత అధికంగా ఎస్సీ జనాభా ఉంది. 21 శాతం ఎస్సీలుండగా.. వారి ఓట్లను కొల్లగొట్టేందుకు బీజేపీ కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. ఇక మిగతా కులాల్లో పంజాబీలు, బ్రాహ్మణులు, అహిర్లు, వైష్ణవులు, గుజ్జర్లు, జాట్ సిక్కులు, రాజ్‌పూత్లు, ముస్లింలు,బిష్ణోవ్‌లు ఉన్నారు. ఆయా వర్గాలు ఓటర్లను ఆకర్షించేందుకు టికెట్ల కేటాయింపులో బీజేపీ, కాంగ్రెస్ కుల సమీకరణలకు ప్రాధాన్యతనిచ్చాయి.





### వెనకబడిన వర్గాలపై దృష్టి

జాట్ల తర్వాత హర్యానాలో ఉన్న మిగతా వర్గాల ఓట్లను తమ ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. గత ఐదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ..ఉద్యోగాల్లో జాట్లకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించేందుకు న్యాయపరమైన చిక్కులు అడ్డురావడంతో ఆ వర్గం డిమాండ్‌ను బీజేపీ నెరవేర్చలేకపోయింది. దీంతో జాట్లు బీజేపీపై తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జాట్లు కాకుండా మిగతా కులస్తుల ఓట్ల కోసం బీజేపీ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా గుజ్జర్లు, రాజ్‌పూత్‌లు, బిష్ణోయ్‌లు, ఇతర వెనకబడిన వర్గాల వారీ ఓట్ల కోసం గాలం వేస్తోంది. ప్రస్తుత ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కూడా జాటేతర కులస్తుడే కావడంతో ఇతర వర్గాల ఓట్లు రాబట్టేందుకు బీజేపీకి కొన్ని అంశాలు కలిసి రావొచ్చని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## కాశ్మీర్‌లోశాంతి కోసమే ఆర్టికల్ 370రద్దు

**గుర్గావ్:** జమ్ము కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాత్మక యుద్ధం లాంటిదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి చరమగీతం పాడేందుకే మోడీ ప్రభుత్వం కాశ్మీర్‌లో 370, 35ఏ రద్దు చేసిందని అన్నారు. కేంద్రం చర్యలతో జమ్ము కాశ్మీర్ ప్రజలకు మనశ్శాంతి లభించిందని పేర్కొన్నారు. ఎన్ఎస్‌జీ 35వ రైజింగ్ డే సెలబ్రేషన్స్‌కు హాజరైన అమిత్ షా.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న సాహసోపేత నిర్ణయాల వల్ల జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదం పూర్తిగా నిర్మూలించేందుకు మార్గం ఏర్పడిందని చెప్పారు. ఉగ్రవాదాన్ని సములంగా నాశనం చేయాలన్నదే మోడీ లక్షమన్న అమిత్ షా.. ఆ లక్ష్య సాధ నలో ఎన్ఎస్‌జీ పాత్ర కీలకమైనదని గుర్తు చేశారు. భారత్ సహా ప్రపంచంలోని ఎన్నోదేశాలు ఉగ్రవాద స మస్యనుఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్నాయన్న షా.. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ దేశాలతో కలిసి ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటం చేస్తోందని తెలిపారు.

2008 ముంబై దాడుల సమయంలో ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో ఎన్ఎస్‌జీ కమాండోలు ప్రదర్శించిన ధైర్య, సాహసాలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి ఎన్ఎస్‌జీ కమాండోల సహకారం ఎంతో కీలకమన్న అమిత్ షా.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఉగ్రవాదం పనిపట్టాలని పిలుపునిచ్చారు.



# దాదా టీం రెడీ..!

## 23న ఆధికారిక ప్రకటన

( ఆంధ్రప్రభ క్రీడా విభాగం )

టీమిండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికవడం లాంఛనమే. సోమవారం నామినేషన్‌ల చివరి రోజు అధ్యక్షపదవికి గంగూలీ ఒక్కడే నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. దీంతో గంగూలీకి ఎవరూ పోటీ లేకపోవడంతో అతను ఎన్నికవడం ఖాయమై పోయింది. ఈ విషయాన్ని బీసీసీ ఐ ఎన్నికల అధికారి ఎన్.గోపాలస్వామి కూడా ధృవీకరంచారు. ఈ నెల 23న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. గంగూలీ అధ్యక్షతన బీసీసీఐ నూతన కార్యవర్గానికి రంగం సిద్ధమైంది. భారత క్రికెట్ బోర్డులో చాలా కాలం తర్వాత ఓ క్రికెటర్ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిం చనున్నాడు. బీసీసీఐ సుదీర్ఘ చరిత్రలో విజయనగరం మహరాజు ఎకెఎస్ విజ్జీ (1955-56 మధ్య కాలంలో) బీసీసీఐ అధ్యక్షుడిగా పని చేశారు. విజ్జీ 1936లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఇప్పుడు గంగూలీ రెండో భారత క్రికెటర్‌గా ఈ పదవికి ఎన్నికవడం భారత క్రికెటర్ల సంతోషాన్ని రెట్టింపు చేసింది. ఇక గంగూలీ కార్యవర్గానికి రంగం సిద్ధమైంది. నూతన అధ్యక్షుడిగా గంగూలీ .. మహిమ్ వర్మ ఉపాధ్యక్షుడుగా, కార్యదర్శి పదవికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తనయుడు జయ్ షా , సంయుక్త కార్యదర్శిగా జయేష్ జార్జ్ , కోశాధికారిగా అరుణ్ సింగ్ ధుమాల్ బాధ్యతలు చేపట్టనున్నారు.

### ఏకగ్రీవంగా..

నాటకీయ పరిణామాల మధ్య టీమిండియా మాజీ సారథి సౌరభ్ గంగూలీ బీసీసీఐ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు. దేశంలోని అన్ని క్రికెట్ సంఘాలు గంగూలీకే మక్కువ చూపెట్టడంతో ఆదివారం వరకు అధ్యక్ష పదవికి ముందు వరుసలో ఉన్న బ్రిజేష్ పటేల్‌ను గంగూలీ అనూహ్యంగా వెనకకు నెట్టి ఈ పదవిని దక్కించుకున్నాడు. సోమవారం నామినేషన్ల చివరి రోజు ముంబైలోని బీసీసీఐ హెడ్ క్వార్టర్స్‌లో గంగూలీ తన నామినేషన్ పత్రాలను సమర్పించుకున్నాడు. గంగూలీకి దాదాపు అన్ని రాష్ట్రాల క్రికెట్ బోర్డులు అండగా నిలవడంతో అతని ఎన్నిక ఏకగ్రీవంమైంది. బ్రిజేష్ పటేల్‌కు మాజీ అధ్యక్షుడు ఎన్ శ్రీనివాసన్ మద్దతు ఉన్నా లాభం లేకుండా పోయింది. దీంతో చివరి సమయంలో బ్రిజేష్ అధ్యక్ష పదవి పోటీ నుంచి తప్పుకొని ఐపీఎల్ చైర్మన్ పదవి కోసం నామి నేషన్ దాఖలుచేశాడు. దీంతో గంగూలీ పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నాడు. ఇక ఇతర పదవులకూ ఒకొక్కరే నామి నేషన్లు వేయడంతో ఎన్నికకు ముందే దాదాపు పదవులు ఖాయమై పోయాయి. కీలక అధ్యక్ష పదవికి సౌరభ్ గంగూలీ పేరు లాంఛనమైపోయింది. బీసీసీఐ కొత్త రాజ్యాంగం ప్రకారం గంగూలీ వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకూ మాత్రమే ఈ పదవిలో కొనసాగుతాడు. 2000 దశకంలో భారత జట్టు క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు గంగూలీ టీమిండియా పగ్గాలను తన భుజాన వేసుకున్నాడు. 1983 ప్రపంచకప్ తర్వాత గంగూలీ సారథ్యంలో భారత జట్టు మళ్లీ ఆ స్థాయిలో ప్రతిష్టను సాధించింది. గంగూలీ అద్భుతమైన సారథ్యంతో 2003 ప్రపంచకప్‌లో భారత జట్టును ఫైనల్స్ వరకు తీసుకెళ్లాడు. 2008లో క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకునేవరకు టీమిండియాకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. అనంతరం 2009లో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (సీఏబీ) వర్కింగ్ కమిటీ సభ్యుడిగా పనిచేశాడు. 2014లో సీఏబీ సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. తర్వాతి ఏడాది బెంగాల్ రాష్ట్ర క్రికెట్ సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఇక అప్పటి నుంచి గంగూలీ అధ్యక్షపదవిలో కొనసాగుతున్నాడు. తాజాగా గత నెలలో జరిగిన సీఏబీ ఎన్నికల్లో మళ్లీ బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఇక గంగూలీ భారత తరపున 113 టెస్టులు, 311 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. టీమిండియా విజయవంతమైన కెప్టెన్‌గా గంగూలీ మంచి పేరు సాధించాడు. గంగూలీ తన కొత్త ఇన్నింగ్స్‌ను త్వరలోనే ఆరంభించనున్నాడు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశావాళీ క్రికెట్‌ను మెరుగుపరచేందుకు కృషి చేస్తానని గంగూలీ పేర్కొన్నాడు.



### మహిమ్ వర్మ (ఉపాధ్యక్షుడు)..

ఈ నెల 23న బీసీసీఐ నూతన ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న మహిమ్ వర్మ ప్రస్తుతం ఉత్తరాఖండ్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఉన్నాడు. వర్మ బీసీసీఐ కార్యవర్గంలో కీలక పదవికి ఎన్నికవుతుండటంతో ఉత్తరాఖండ్ క్రికెట్ సంఘానికి మంచి రోజులు రావడం ఖాయమని ఆ రాష్ట్ర క్రికెటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ యువ క్రికెటర్లు పంత్, ఉన్ముక్త్ చంద్, పవన్ నేగి, అర్యన్ జుయల్ తదితరులు జూనియర్ జట్లలో తమ జోరును ప్రదర్శిస్తున్నారు.

### జయ్ షా (కార్యదర్శి)..

బీసీసీఐ నూతన కార్యవర్గంలో కార్యదర్శిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తనయుడు జయ్ షా నియమితుడు కానున్నాడు. వ్యాపార రంగంలో మంచి పేరు సంపాదించుకున్న జయ్ షా కు గుజరాత్ క్రికెట్ సంఘంలో సంయుక్త కార్యదర్శిగా కూడా పనిచేసిన అనుభవం ఉంది. 2009లో గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ (జీసీఏ)లో సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చైర్మన్ రాజీవ్ శుక్లాతో కలిసి దాదాపు తొమ్మిదేళ్లు పనిచేశాడు. ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన జయ్ షా అహ్మదాబాద్‌లో విశాలమైన క్రికెట్ స్టేడియం నిర్మించడంలో కీలకపాత్ర పోషించాడు.

### జయేష్ జార్జ్ (సంయుక్త కార్యదర్శి)..

జయేష్ జార్జ్‌బీసీసీఐ నూతన కార్యవర్గంలో సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నాడు. ప్రస్తుతం కేరళ రాష్ట్ర క్రికెట్ సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న జయేష్ జార్జ్ బీసీసీఐలో కీలక పదవికి శ్రీకారం చుట్టనున్నాడు. ఈ పదవికి జార్జ్ పేరును ఇటీవల ఎన్నికైన నూతన హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు మహ్మద్ అజరుద్దీన్ సిఫార్సు చేశాడని సమాచారం. ఇక గంగూలీ కార్యవర్గ జట్టులో చోటు దక్కించుకున్న జయేష్ తమ రాష్ట్ర యువ ఆటగాళ్ల మెరుగైన భవిష్యత్తు కోసం కృషి చేస్తానని తెలిపాడు.

### అరుణ్ సింగ్ ధుమాల్ (కోశాధికారి)..

బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, కేంద్ర ఆర్థిక మంత్రి అనురాగ్ ఠాకుర్ తమ్ముడు అరుణ్ సింగ్ ధుమాల్ బీసీసీఐ నూతన కార్యవర్గంలో కోశాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నాడు. ధుమాల్ తండ్రి ప్రేమ్ కుమార్ ధుమాల్ హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి. అరుణ్ ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం (హెచ్‌పీసీఏ) అధ్యక్షుడిగా ఉన్నాడు. ధర్మశాలలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించడంలో అరుణ్ ఎంతో కృషి చేశాడు.

అరుణ్ హెచ్‌పీసీఏ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆ రాష్ట్ర క్రికెట్ సంఘం చాలా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం ధర్మశాలలో అంతర్జాతీయ క్రికెట్ వ్యాచ్‌లు కూడా ఎక్కువగా జరుగడానికి కూడా ఇతనే కారణం.

## టి20 పోరులో సచిన్, లారా



**ముంబై:** అలనాటి దిగ్గజాలు సచిన్ టెండూ ల్కర్, బ్రయాన్ లారా తిరిగి బ్యాట్ పట్టనున్నారు. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లో కాదులెండి. ప్రపంచ రోడ్డు భద్రత ఉత్సవాల్లో భాగంగా తొలిసారిగా భారత్‌లో నిర్వహిం చనున్న సిరీస్‌లో వారు పాల్గొననున్నారు. ఈ సిరీస్‌ను వచ్చే ఏడాది ఇండియాలో నిర్వహిం చనున్నారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్, ఇండియాకు చెందిన రిటైర్డ్ క్రికెటర్లు ఈ సిరీస్‌లో పాల్గొంటారు. ఫిబ్రవరి 2-16 తేదీలలో దేశవ్యాప్తంగా నిర్వహించే మ్యాచ్‌లలో సచిన్, లారాలతోపాటు వీరేందర్ సెహ్వాగ్, బ్రెట్ లీ, తిలకరత్నె దిల్షన్, జాంటీ రోడ్స్ తదితర ప్రముఖ ఆటగాళ్లు పాల్గొననున్నారు. శాంత భరత్ సురక్షిత్ భరత్ అనే స్వచ్ఛంద సంస్థ మహరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థతో కలిసి ఈ సిరీస్‌ను నిర్వహించనున్నది. 46 ఏళ్ల టెండూల్కర్ టెస్టులు, వన్డేలలో కలిపి 34వేలకు పైగా పరుగులు సాధించాడు. 24 ఏళ్ల కెరీర్‌లో రెండు ఫార్మాట్లలో రికార్డు స్థాయిలో 100 సెంచరీలు నమోదు చేశాడు. 2013లో సచిన్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. 2008లో సచిన్ బ్రయాన్ లారా పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును అధిగమించాడు. ఎడమచేతి వాటం విండీస్ బ్యాట్స్‌మన్ లారా టెస్టులలో 11,953 పరుగులు సాధించాడు. కాగా టెస్టులలో అత్యధిక పరుగుల రికార్డు లారా పేరిటే ఉన్నది. 2004లో ఇంగ్లండ్‌పై ఆంటిగ్వా టెస్టులో లారా అజేయంగా 400 పరుగులతో నెలకొల్పిన రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరలేదు.

## బీసీసీఐ మెరుగౌతుంది: లక్ష్మణ్



**న్యూఢిల్లీ :** భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ నేతృత్వంలో బీసీసీఐ పనితనం మెరుగౌతుందని దిగ్గజ బ్యాట్స్‌మెన్ వివిఎస్ లక్ష్మణ్ ఆశాభావం వ్యక్తంచేశాడు. బీసీసీఐ కార్యవర్గానికి నామినేషన్ల పర్వం ముగిసిన తరువాత అధ్యక్షపదవికి సౌరవ్ ఒక్కడే దరఖాస్తు చేసినందున అతని ఎన్నిక నామమాత్రమే. ఈనెల 23న జరిగే బీసీసీఐ సర్వసభ్య సమావేశంలో గంగూలీ ని అధ్యక్షునిగా ప్రకటించనున్నారు. భారత్ తరపున 113 టెస్టులు, 311 వన్డేలు ఆడిన గంగూలీ సోమవారం బీసీసీఐ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశాడు. అధ్యక్ష పదవికి మరెవరూ పోటీలో లేనందున గంగూలీ ఎన్నిక ఏకగ్రీవమే. దీనిపై లక్ష్మణ్ స్పందిస్తూ అధ్యక్ష పదవిని చేపట్టనున్న గంగూలీకి అభినందలను తెలియజేశాడు. గంగూలీ నేతృత్వంలో బీసీసీఐ మరింత పరిపుష్టం కావాలని ఆకాంక్షించాడు. కొత్త బాధ్యతలలో గంగూలీ సక్సెస్ కావాలని శుభాకాంక్షలు తెలిపాడు. ఇందుకు గంగూలీకూడా లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. తన సలహాలు, సూచనలుకూడా కావాలని అభ్యర్థించాడు. టీమిండియా కెప్టెన్‌గా విశిష్ట సేవలందించిన 47 ఏళ్ల గంగూలీ బీసీసీఐ అధ్యక్ష పదవిలో నిబంధనల ప్రకారం కేవలం 9 నెలలుమాత్రమే కొనసాగనున్న విషయం తెలిసిందే.

## విండీస్ కోచ్‌గా సిమన్స్



**సెయింట్ జాన్స్(ఆంటిగ్వా-బార్బడోస్) :** వెస్టిండీస్ జట్టు ప్రధాన కోచ్‌గా ఫిల్ సిమన్స్ తిరిగి నియమితుడయ్యాడు. మూడేళ్ల క్రితం వివాదాస్పద రీతిలో కోచ్ పదవినుంచి ఉద్వాసనకు గురైన సిమన్స్‌ను తిరిగి కోచ్‌గా నియమించినట్టు వెస్టిండీస్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. రానున్న నాలుగేళ్ల కాలానికి సిమన్స్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడు. 2016లో వెస్టిండీస్‌కు టి20 ప్రపంచకప్ అందించిన సిమన్స్‌ను విండీస్ బోర్డు వేతన విషయంతో విభేదాలతో తొలగించింది. సిమన్స్‌ను తిరిగి నియమించడం తప్పును సరిదిద్దకోవడం కాదని, తాము సరైన వ్యక్తినే కోచ్‌గా ఎన్నుకున్నామని భావిస్తున్నట్టు విండీస్ బోర్డు అధ్యక్షుడు రికీ స్కెరిట్ తెలిపాడు.

56 ఏళ్ల సిమన్స్ నేతృత్వంలోనే వెస్టిండీస్ 2016లో టి20 ప్రపంచకప్‌ను నెగ్గింది. ఇంగ్లండ్‌తో జరిగిన ఫైనల్లో విండీస్ బ్యాట్స్‌మన్ కార్లోస్ బ్రాత్‌వైట్ చివరి క్షణాలలో వరుసగా నాలుగు సిక్సర్లు కొట్టి జట్టును గెలిపించాడు. సిమన్స్ నేతృత్వంలో టి20లో రాణించిన విండీస్ టెస్టులలో ఆ స్థాయి ప్రతిభను ప్రదర్శించలేకపోయింది. సిమన్స్ కోచ్‌గా ఉన్న సమయంలో విండీస్ జట్టు 14 టెస్టులలో ఒక్క టెస్టును మాత్రమే గెలిచింది. ఈ నేపథ్యంలో సిమన్స్, బోర్డు పెద్దలకు మధ్య విభేదాలు పెరిగిపోయాయి. 2015లో వన్డే జట్టు ఎంపికపై సిమన్స్ సెలక్టర్లను దుయ్యబట్టడంతో మితిమీరిన జోక్యం చేసుకుంటున్న ఆరోపణపై మరుసటి సంవత్సరం అతనికి ఉద్వాసన పలికారు. తిరిగి మూడేళ్ల తరువాత సిమన్సే విండీస్ బోర్డుకు దిక్కయ్యాడు.

ప్రో కబడ్డీ-7 సెమీస్ పోరు

| | |
|---|---|
| బెంగళూరు బుల్స్ X దబాంగ్ ఢిల్లీ | రాత్రి గం.7.30 లకు |
| యు ముంబా X బెంగాల్ వారియర్స్ | రాత్రి గం.8.30 లకు |

## టాప్ ర్యాంక్ కోల్పోయిన మంధాన



**దుబాయ్ :** గాయంతో కొంతకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉన్న భారత మహిళా క్రికెట్ జట్టు ఓపెనర్ స్మృతి మంధాన టాప్ ర్యాంక్‌ను కోల్పోయింది. తాజాగా విడుదల చేసిన ఐసీసీ మహిళా క్రికెట్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్‌కు చెందిన అమి శాటర్‌వైట్ అగ్రస్థానం చేరుకుంది. దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో వన్డే సిరీస్‌కు ముందు ప్రాక్టీస్‌లో కుడి పాదానికి గాయం కావడంతో మంధాన వన్డే సిరీస్‌నుంచి తప్పుకుంది. దీనితో 23 ఏళ్ల మంధాన 755 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకుంది. వన్డే సిరీస్‌ను భారత మహిళల జట్టు 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. కాగా తతిమా భారత క్రీడాకారిణుల్లో మిథాలీ రాజ్ ఏడో స్థానానికి దిగజారగా, హర్మన్‌ప్రీత్ కౌర్ ర్యాంకింగ్ మెరుగుపరచుకుని 17వ ర్యాంక్‌కు చేరుకుంది.

## ఒలింపిక్స్ అర్హతే లక్ష్యం: ద్యుతీ



**న్యూఢిల్లీ:** టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే ప్రస్తుతం తనముందున్న లక్ష్యమని ఇండియా స్ప్రింట్ క్వీన్ ద్యుతీచంద్ తెలిపింది. ఒలింపిక్స్‌కు అర్హత టైమింగ్ 11.15సె. అందుకోవడమే తన లక్ష్యమన్నది. ఇటీవల దోహాలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్ చాంపి యన్‌షిప్‌లో ద్యుతీ విఫలమైన అనంతరం రాంచీలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ చాంపి యన్‌షిప్‌లో 100మీ. పోటీసెమీస్‌లో 11.22సె.తో జాతీయ రికార్డు నెలకొల్పింది. అంతేగాక ఫైనల్స్‌లో స్వర్ణం దక్కించుకుంది. అయితే ఒలింపిక్స్ అర్హత టైమింగ్‌ను అందుకోలేకపోయింది. 200మీ. పరుగులో ఈ ఏడాది అత్యుత్తమ టైమింగ్(23.17సె.)ను నమోదు చేసింది. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు పొందిన తర్ఫీదువల్లనే తాను జాతీయ పోటీలలో మెరుగైన ప్రదర్శన చేయగలిగానని ద్యుతి తెలిపింది. ఇక ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంపైనే దృష్టిసారిస్తానన్నది.

## సింధు, ప్రణీత్ శుభారంభం

**కశ్యప్, సౌరభ్‌వర్మ పరాజయం.. డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్**





**ఒడెన్స్:** ప్రపంచ చాంపియన్, భారత స్టార్ షట్లర్ పీవీ సింధు డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ టోర్నీలో శుభారంభం చేసింది. మరోవైపు ప్రపంచ చాంపియన్‌షిప్ లో కాంస్య పతనం నెగ్గిన బి. సాయి ప్రణీత్ తొలి రౌండ్‌లోనే దిగ్గజ ఆటగాడు లీన్ డాన్‌ను ఓడించి రెండో రౌండ్‌లో దూసుకెళ్లాడు. కాగా, పారుపల్లి కశ్యప్, సౌరబ్ వర్మలు పరాజయాలతో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ కూడా శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత స్టార్ ఐదో సీడ్ పీవీ సింధు 22-20, 21-18తో మాజీ ప్రపంచ జూనియర్ చాంపియన్ గ్రెగొరియా మారిస్కా (ఇండోనేసియా)ను వరుస గేముల్లో ఓడించి తర్వాతి రౌండ్‌లో ప్రవేశించింది.

### లిన్‌డాన్‌కు ప్రణీత్ షాక్..

పురుషుల సింగిల్స్‌లో మాజీ ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ లిన్ డాన్ (చైనా)ను భారత స్టార్ సాయి ప్రణీత్ 21-14, 21-17తో వరుస గేముల్లో చిత్తు చేశాడు. మరో మ్యాచ్‌లో కొరియా ఓపెన్ సెమీఫైనలిస్ట్ పారుపల్లి కశ్యప్ 13-21, 12-21తో థైయిలాండ్‌కు చెందిన సిథికోమ్ థామసిన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. సౌరభ్ వర్మ 21-19, 11-21, 17-21తో నెదర్లాండ్స్ క్రీడాకారుడు మార్క్ కాల్జౌ చేతిలో ఓడి టోర్నీ నుంచి వైదొలిగాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ శెట్టి జోడీ 24-22, 21-11తో కొరియా జంట కిగ్ గి జాంగ్-లీ యాంగ్ డేలను వరుస గేముల్లో చిత్తు చేసి రెండో రౌండ్‌లో అడుగు పెట్టింది.

## ఖర్చులలో భాగస్వాములవ్వాలి

**తటస్థ వేదికలపై టెస్టుల నిర్వహణకు పాక్ మెలిక**

**కరాచి:** ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా ఇరు దేశాల మధ్య జరగాల్సిన టెస్టు మ్యాచ్‌లను తటస్థ వేదికపై నిర్వహించాలంటే ఖర్చులలో భాగస్వాములు కావాలని శ్రీలంక క్రికెట్ బోర్డుకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. భద్రతా కారణాల దృష్ట్యా డిసెంబర్‌లో పాక్‌లో నిర్వహించాల్సిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను తటస్థ వేదికపై నిర్వహించాలని శ్రీలంక బోర్డు పాకిస్తాన్‌ను కోరింది. సెప్టెంబర్-అక్టోబర్‌లలో శ్రీలకం జట్టుతో కరాచి, లాహోర్‌లలో పరిమిత ఓవర్ల సిరీస్‌లను నిర్వహించిన పాకిస్తాన్ బోర్డు డిసెంబర్‌లో జరగాల్సిన ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌కు తమ జట్టును పంపాలని శ్రీలకంను కోరింది. అయితే శ్రీలంక ప్రధాన ఆటగాళ్లు పాకిస్తాన్‌లో విముఖత చూపుతుండడంతో తటస్థ వేదికపై సిరీస్ నిర్వహించాలని శ్రీలంక పాక్ బోర్డును కోరింది. అందకు పాక్ బోర్డు ఖర్చులను సమంగా భరించాలని కోరింది. ఇటీవల పరిమిత ఓవర్ల సిరీస్ సందర్భంగా ఆటగాళ్లెవరూ స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతి లభించలేదు. ఇరు జట్ల ఆటగాళ్లు హోటళ్లకే పరిమితమయ్యారు. అందుకే శ్రీలంక జట్టు టెస్టు సిరీస్‌ను పాకిస్తాన్‌లో ఆడేందుకు సుముఖంగా లేదు.

## పరువు నిలిపిన ఆదిల్‌ఖాన్



చివరి క్షణాల్లో గోల్‌తో మ్యాచ్ డ్రా

**కోల్‌కతా :** ప్రపంచ కప్ క్వాలిఫయర్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఇండియా తృటిలో పరాజయ పరాభవాన్ని తప్పించుకుంది. చివరి క్షణాల్లో ఆదిల్‌ఖాన్ హెడర్‌తో చేసిన గోల్‌తో స్కోరు సమమై మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్థానికి సాల్ట్ లేక్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో సాద్ ఉద్దీన్ ప్రత్యర్థి జట్టుకు 42వ నిమిషంలో గోల్ సాధించి ఆధిక్యంలో నిలిపాడు. విరామానికి 1-0 ఆధిక్యం సాధించిన బంగ్లాదేశ్ చివరివరకు భారత్‌ను గోల్ చేయకుండా నిలువరించింది. ఇంకా రెండు నిమిషాలలో మ్యాచ్ ముగుస్తుందనగా కార్నర్ నుంచి బ్రాండన్ ఫెర్నాండెజ్ అందించిన పాస్‌ను ఆదిల్‌ఖాన్ హెడర్‌గా మలిచి స్కోరును సమం చేశాడు. దీనితో భారత్ మ్యాచ్‌ను 1-1గా ముగించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 104 స్థానంలో ఉన్న ఇండియా తనకంటె 83 ర్యాంక్‌లు వెనుకంజలో ఉన్న బంగ్లాపై ఈ టోర్నీలో ఇప్పటివరకు విజయం సాధించలేదు. 1999లో శాఫ్ క్రీడల్లో బంగ్లాపై 1-0తో గెలిచిన తరువాత భారత్ మళ్లీ బంగ్లాపై ఇప్పటివరకు విజయం సాధించలేదు. గతరెండు మ్యాచ్‌లు 1-1(2013), 2-2(2014)తో డ్రాగా ముగిశాయి. ఫీఫా క్వాలిఫయింగ్ టోర్నీ తొలి మ్యాచ్‌లో ఇండియా 1-2తో ఒమన్ చేతిలో ఓడి, ఖతార్‌తో మ్యాచ్‌ను 0-0గా డ్రా చేసుకుంది. బంగ్లాతో మ్యాచ్ డ్రాగా ముగియడంతో ఇండియా మూడు మ్యాచ్‌లలో రెండు పాయింట్లు దక్కించుకుంది. బంగ్లాదేశ్ మూడు మ్యాచ్‌లలో ఒక పాయింట్లతో అట్టడుగున నిలిచింది.

ఆరంభంనుంచి దూకుడు ప్రదర్శించిన బంగ్లాదేశ్ పలుమార్లు భారత్ గోల్‌పై దాడులు చేసింది. 42 నిమిషంలో ఎట్టకేలకు బంగ్లా వ్యూహం ఫలించింది. రాహుల్ బెకె తప్పిదంతో బంగ్లాదేశ్‌కు ఫ్రీకిక్ లభించింది. దీనిని వారి కెప్టెన్ గోల్‌వద్ద కాచుకుని ఉన్న సాద్ ఉద్దీన్‌కు అందించగా అతడు హెడర్‌తో గోల్ సాధించాడు. దీనితో 65వేల ప్రేక్షకు లతో నిండిన సాల్ట్ లేక్ స్టేడియం మూగబోయింది. ఆ తరువాత 54వ నిమిషంలో లభించిన మరో అవకాశాన్ని బంగ్లాదేశ్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. విరామం తరువాత కూడా భారత దాడులను బంగ్లా దేశ్ సమర్థంగా తిప్పికొట్టింది. ఇక పరాజయం తప్పదనుకున్న తరుణంలో మరో రెండు నిమి షాలలో ఆట ముగుస్తుందనగా కార్నర్‌నుంచి బ్రాండన్ అం దించిన షాట్‌ను ఆదిల్‌ఖాన్ హెడర్‌తో గోల్‌గా మలిచి భాతర అభిమానుల కళ్లలో ఆనందం నింపాడు.

### శాఫ్ అండర్-15 మహిళల విజేత భారత్

**థింపు :** భూటాన్ రాజధానిలో జరిగిన శాఫ్ అండర్-15 మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ లో భారత్ విజేతగా నిలిచింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు గోల్ చేయడంలో విఫలమవడంతో షూటవుట్ ద్వారా విజేతను తేల్చారు. షూటౌట్‌లో భారత్ 5-3తో విజయాన్నం దకుంది. షూటవుట్‌లో బంగ్లాదేశ్ తొలి షాట్‌ను భారత గోల్‌కీపర్ అద్రిజ షర్కీల్ అడ్డుకుని భారత్ విజయంలో ముఖ్యపాత్ర పోషించింది. భారత కెప్టెన్ శిల్కి దేవి చివరి షాట్‌ను గోల్‌గా మలచడంతో భారత్‌కు 5-3తో విజయం దక్కింది.

## నవ్రతిలోవా నాకు స్ఫూర్తి: పేస్



**ముంబై :** వెటరన్ క్రీడాకారిణి మార్టినా నవ్రతిలోవా తనకు స్ఫూర్తి అని భారత టెన్నిస్ దిగ్గజ ఆటగాడు లియాండర్ పేస్ అన్నాడు. ఇంతకాలం తాను ఫిట్‌నెస్‌తో ఉండడానికి ఆమె సూచనలే కారణమన్నాడు. 18 సింగిల్స్‌తో పాటు రికార్డు స్థాయి లో మొత్తం 59 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గిన నవ్రతిలోవా పేస్‌తో కలిసి రెండు మిక్స్‌డ్ డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సొంతం చేసుకుంది. 2003లో పేస్ నవ్రతిలోవాతో జోడీకట్టి వింబుల్డన్, ఆస్ట్రేలియా ఓపెన్, వింబుల్డన్ టైటిల్స్ నెగ్గాడు. టెన్నిస్ ఆస్ట్రేలియా, సోనీ పిక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం పొడిగింపు కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న పేస్ విలేకరులతో మాట్లాడుతూ టెన్నిస్ ఆటగాళ్లకు ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో నవ్రతిలోవా తనకు తెలిపిందని, ఆమె సూచనల మేరకు తాను సుదీర్ఘకాలం దేశానికి ప్రాతినిధ్యం వహించగలిగానని పేస్ తెలిపాడు. 50 ఏళ్ల వయసులోనూ ఆమె చలాకీగా గ్రాండ్‌స్లామ్ పోటీలలో పాల్గొన్న విషయాన్ని 46 ఏళ్ల పేస్ గుర్తుచేసుకున్నాడు. స్విస్ దిగ్గజ ఆటగాళ్లు రోజర్ ఫెదరర్, మార్టినా హింగిస్‌ల ప్రభావంకూడా తనపై ఉందని పేస్ తెలిపాడు. వచ్చే ఏడాది తన లక్ష్యాలేమిటో ఇంకా నిర్ణయించుకోలేదన్నాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

epaper.prabhanews.com

Lively
Interaction
For
Ever
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I
బుధవారం 16 అక్టోబర్ 2019





నాలుగు శతాబ్దాల చరిత్ర కల్గిన చిత్రకళ.. నాలుగు తరాలుగా కాపాడుకుంటూ వస్తున్న అరుదైన కళాకారులు.... ఆయిల్ పెయింట్లు, గ్రాఫిక్ మాయాజాలంలో వచ్చే ఫ్లెక్సీలు, కటౌట్‌ల కాలంలో సైతం...సంప్రదాయ చిత్రకళకు ఊపిరి పోస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారీ సిద్ధిపేటజిల్లా, చేర్యాలకు చెందిన నకాషి చిత్ర కళాకారులు. నిజాం నవాబులు మెచ్చిన, దేశవిదేశాల్లో ఖ్యాతి గడించిన, ఈ సం ప్రదాయ చిత్రకళను... ప్రస్తుతం ధనాల కోట నాగేశ్వర రావు,ధనాల కోట వైకుంఠం కుటుం బాలు నకాషి కళను బతికిస్తున్నారు. అసలు నకాషి చిత్రకళ అంటే ఏమిటి? ఇతర చిత్రాలకు వీటికి మధ్య తేడా ఏంటి? ఆ కళను బతికించడం కోసం వారెందుకు అంతగా ఆరాటపడుతున్నారు? అందులోని గొప్పతనమేమిటి? ఇవే ప్రశ్నలను నకాషి చిత్రకారుడు, మూడు పదులు వయస్సు కూడా దాటని డి.సాయికిరణ్ వర్మను ప్రశ్నించింది ఆంధ్రప్రభ లైఫ్. వివరాలు కిరణ్ మాటల్లోనే..!



# రంగుల కళ నకాషి!

❑ సంప్రదాయ హంగులు ❑ పురాణాల సొబగులు

## నిజాం నవాబులు మెచ్చిన కళ!

తెలంగాణ ప్రాంతంలో వర్ధిల్లినరంగుల రంగుల జానపద చిత్రకళ నకాషి. సంప్రదాయ రంగులతో చిత్రాలను వేయడమే నకాషి చిత్రకళ. గతంలో చిత్రకారులు జానపద కథలు, పురాణాలలోని ఘట్టాలను గుడ్డపై రంగులతో చిత్రిస్తే, కొందరు దాని ఆధారాంగా కథలు చెప్పి జీవనం సాగించేవారు. అంటే అటు కథలు చెప్పే వారికి, నకాషి కళాకారులకు చిత్రాలు జీవనోపాధి కల్పించాయన్నమాట. ఆ చిత్రాలను వేసే వారే నకాషి చిత్ర కళాకారులు. నకాషి అనే పదం ఉర్దూ నుంచి వచ్చింది. నక్ష్ అంటే ఉన్నది ఉన్నట్లుగా చిత్రించడం అని అర్థం. కాలక్రమంలో వారిది నకాషి కులంగా మార్పు చెందింది. పూర్వ వరంగల్ జిల్లా చేర్యాల(ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్నది), కరీంనగర్ జిల్లా వేములవాడ మండలంలోని అప్పారం, అనుపురం గ్రామాలలో నకాషి కళాకారులు ఉన్నారు. ప్రస్తుతం చాలా మంది తమ కుల వృత్తిని మానేసి వేరే వృత్తులలో కొనసాగుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాలలో ఉన్న వారు మాత్రం ఇప్పటికీ ఈ చిత్ర కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. చేనేత గుడ్డనే నకాషి చిత్రాలను వేసేందుకు ఉపయోగిస్తారు. చిత్రాన్ని బట్టి తెల్లని ఖాదీ వస్త్రాన్ని సేకరిస్తారు. ఆ బట్టకు ముందుగా గంజి, సుద్దపొడి, చింతగింజల అంబలి కలిపిన మిశ్రమాన్ని పట్టిస్తారు. బట్ట బాగా ఆరిన తరువాత రెండో సారి అదే మిశ్రమాన్ని పట్టిస్తారు. బాగా ఎండిన ఆ గుడ్డను చాపలాగ చుట్టి భద్రపరుస్తారు.దాని మీదే రంగురంగుల చిత్రాలు వేస్తారు.





### నకాషి చిత్రాల్లో పురాణాలు

నిజాం నవాబు కాలంలో దర్బారుల్లోనూ, మహళ్ళలో ఈ చిత్రాలనే వేయించుకునేవారు. అవే నకాషి చిత్ర పటాలు. 16వ శతాబ్దం నాటి చిత్రాలు కూడా ఇప్పటికి అందుబాటులో ఉన్నాయి. మురుగున పడుతున్న చిత్ర కళకు ఒక కుటుంబమంతా అంకితమై జీవనం సాగిస్తోంది. వారి చేతిలో రూపుదిద్దుకోని పూరాణమంటూ లేదు. మారుతున్న కాలంతో పాటు కొన్ని మార్పులను సంతరించుకుని పురాణాలతో పాటు ప్రాంతీయ సంస్కృతి, సాంప్రదాయాలు కూడా మన కళ్ళకు కట్టినట్లుగా వివరించేలా చిత్రాలు వేస్తారు. ఈ కళాసంపదను ప్రభుత్వం ఆదరించి అండగా నిలిచింది. ధనాలకోట వైకుంఠం నకాషీ, వనజ నకాషీలు ఈ చిత్రకళను వారి పూర్వీకుల నుండి నేర్చుకుంటే, వారి కుమారుడు రాకేశ్ వర్మ చిత్రకళను వృత్తిగా మార్చుకుని కొత్త ప్రయోగాలను చేస్తూ కళాభివృద్ధికి పాటు పడుతున్నారు. యువతను ఆకర్షించే విధంగా చిత్రాలను వేస్తున్నారు.

ఈ నకాషీ చిత్రాలలో రామాయణం, మహాభారతం ఘట్టాలు, జాంబవంతుని కథ, కాటమరాయుని కథ, మార్కేండయ కథ, ఆది శక్తి పుట్టిన నాటి నుండి మహాభారత యుద్ధం పూర్తయ్యే వరకు అన్ని ఘట్టాలను కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తారు. ఇలా సహజసిద్ధమైన లేపనాలతో తయారు చేసిన గుడ్డ కాన్వాస్ వేసిన చిత్రాల ఆధారంగా ...సంచార జాతుల వారు ఊరూరా తిరుగుతూ కథలు చెప్పి జీవనం సాగించేవారు. ఒకప్పుడు తోలు బొమ్మలాట ఎంత ఆదరణ కలిగి ఉండేదో నకాషీ చిత్రాల ద్వారా చెప్పే కథలకు అంతటి ఆదరణ ఉండేది. ఇటీవల కాలంలో నకాషీలు మాస్కలను తయారు చేస్తున్నారు. ఒక మాస్క్ తయారు చేయాలంటే వారం రోజుల సమయం పడుతుంది. చెక్కపొట్టు, కోడి గుడ్డు సొన, బంక కలిపి బొమ్మను తయారు చేస్తారు. రెండు రోజులు ఆరిన తరువాత, పైన చింత గింజల అంబలితో వస్త్రాన్ని అతికిస్తారు. అతికించిన వస్త్రంపై రెండుసార్లు సున్నంనీటిని అద్ది రంగులు వేస్తారు. అలా తయారైన మాస్కులు ఆబాల గోపాలం హృదయాలను దోచుకుంటాయి.

### అంతర్జాతీయంగా...

చేర్యాల పేయింటింగ్స్ గురించి ధనాలకోట కుటుంబం ఎన్నో అంతర్జాతీయ, జాతీయ వేదికలపై పలు ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా కళకు మంచి గుర్తింపు తీసుకొని వచ్చింది. 2015వ సంవత్సరంలో చైనా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్‌లో, 2016 సంవత్సరంలో సూరజ్‌కుండ్ మేళాలో వీరు పాల్గొని నకాషి చిత్రాలను ప్రదర్శించారు. 2015వ సంవత్సరంలో జెనీవా, స్విట్జర్లాండ్‌లలో వారం రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. వీరు అనేక అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. గత సంవత్సరం దేశ వ్యాప్తంగా నిర్వహించిన రైల్వేస్టేషన్ల సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలలో నకాషి చిత్రాలతో వేసిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ జాతీయ స్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది. దీంతో పాటు 2013వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి బెస్ట్ ఆర్టిజన్ అవార్డు, 2016వ సంవత్సరంలో జరిగిన సూరజ్‌కుండ్ మేళాలో కళామణి అవార్డును అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు మ్యూజియంలలో చేర్యాల పెయింటింగ్స్ ప్రదర్శనకు ఉంచారు. ఇంతటి ఘనమైన చేర్యాల నకాషి చిత్రాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులు ఉండడంలో అతిశయోక్తి లేదు.

- కొట్టె కరుణాకర్,
ప్రభన్యూస్, కొమురవెళ్ళి

## మాకు వారసత్వ సంపద

- సాయి కిరణ్ వర్మ

మాది సిద్దిపేట జిల్లాలోని చేర్యాల గ్రామం.. నేను హైదరాబాద్‌లో ఫైన్ ఆర్ట్స్ చదివాను. మా ముత్తాత వేంకటరామయ్యది వేములవాడ..స్వామి వారిని నమ్ముకుని, నకాషి చిత్రకళతో కూడిన బొమ్మలను తయారు చేసి విక్రయించి జీవనం సాగించేవారు. అయితే వేంకటరామయ్య కొడుకైన మా తాత ధనాలకోట చంద్రయ్య 1980లో బతుకు పోరాటంలో భాగంగా చేర్యాలకు వచ్చి స్థిరపడ్డారు. మానాన్న నాగేశ్వర్ వాళ్ల తమ్ముళ్లు, మేము అంతా చేర్యాలలోనే పుట్టి పెరిగాము. మా కుటుంబం చేర్యాలలో ఉన్నందున ఈ కళకు చేర్యాల నకాషి చిత్రకళగా పేరు వచ్చింది.

ఇది మా వారసత్వ సంపద. మేము సోమవర్మ వంశానికి చెందినవారము. అందుకే మా పేరు చివర వర్మ అనేది ఉంటుంది. మా తాతకు ముగ్గురు సంతానం..అందులో ఒక్కరు తప్ప, మా నాన్న, మా బాబాయి వైకుంఠం ఈ కళను బతికిస్తూ వచ్చారు. మా అమ్మ పద్మకు కూడా చిత్రాలు వేయడం వచ్చు. పెళ్లయిన తర్వాత ఆమెకు మా నాన్నే నకాషి చిత్రాలు వేయడం నేర్పించారు. మొత్తానికి నాలుగు తరాలుగా నకాషి చిత్రకళను నమ్ముకుని మా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మాతాత చంద్రయ్య హయాంలోనే ఆల్ ఇండియా హ్యాండి క్రాఫ్ట్గా.. నకాషి చిత్రకళకు గుర్తింపు వచ్చింది. దాంతో మేము చేతివృత్తి కళాకారులుగా కొనసాగుతున్నాము. నాటి నుంచి ఎక్కడ చేతి వృత్తి కళల ప్రదర్శన ఏర్పాటు చేసినా మాకు స్టాల్ ఇచ్చేవారు. అలా మాతాత చంద్రయ్య వల్ల నకాషి కళకు మంచి గుర్తింపు వచ్చింది. 1980లో మాతాతకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ చేతివృత్తి కళాకారునిగా అవార్డు ఇచ్చింది. 1983లో నేషనల్ అవార్డును అప్పటి రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. ఆ తర్వాత ఆయన విదేశాలకు వెళ్లి నకాషి చిత్రకళను ప్రదర్శించి వచ్చారు. మా తాత ద్వారా మానాన్న, మానాన్న నుంచి నేను తమ్ముడు కళను నేర్చుకున్నాము. నాకు తెలిసి దేశం మొత్తం మీద 10వేల మంది వరకు నకాషి చిత్రకళాకారులు ఉండవచ్చు. కొండపల్లి బొమ్మలు తయారు చేసేది కూడా మా నకాషి కళాకారులే. కాకపోతే బతుకు



తెరువుకోసం కొయ్యబొమ్మలు ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం నేను, మా తమ్ముడు శ్రవణ్ కుమార్ కళ అంతరించి పోకుండా కాపాడు తున్నాము. ఇదే ఆధారంగా జీవనం సాగిస్తున్నాము.

### సంప్రదాయ రంగులు

మేము సంప్రదాయమైన రంగులనే వాడతాము. కావాల్సిన ప్రాథమిక రంగులను తయారు చేసుకుని వాటినుంచి ఇతర రంగులు తయారు చేస్తాము. ప్రకృతిలో లభ్యమయ్యే ఆకులు,రంగు రాళ్లు తదితరాల నుంచి రంగులు తయారు చేస్తాము. భూమిలో దొరికే ఎర్రని రాళ్ల నుంచి ఎరుపు, ఇండిగో చెట్టు కాయల నుంచి బ్లూ, సముద్రాలు, నదుల్లో దొరికే శంకువు లాంటి గవ్వలు, చిప్పల నుంచి తెలుపు, కిరోసిన్ దీపం పొగ నుంచి నలుపు, పేగుడి రాళ్ల నుంచి పసుపు రంగులను తయారు చేస్తాము. మ న సంప్రదాయ రంగులు ఆధునిక రసాయనిక రం గుల కంటే బ్రైట్‌గా, ఆకర్షణీయంగా ఉంటాయి. రంగులు వేయడానికి వాడే బ్రష్‌లు సైతం తయారు చేసుకుంటాము. మేము బ్యాక్ గ్రౌండ్‌ను మాత్రం ఎరుపు రంగే వాడతాము. మేము గుడ్డమీద వేసే చిత్రాలు అన్నీ సైడ్ ఫేస్ ఉంటాయి. సాలార్జంగ్ మ్యూజియంలోని రూమ్ నెంబర్-2లో 150 సంవత్సరాలు క్రితం చిత్రాలు ఉన్నాయి.ఇప్పటికి అవి వన్నె కోల్పోలేదు. 2009లో చేర్యాల నకాషి చిత్రకళకు జియోలాజికల్ ఇండికేషన్ (పేటెంట్) కూడా వచ్చింది.

### అరుదైన చిత్రకళ

సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో కొందరు సంచార జాతులవారు కులాల వారీగా కథలు చెప్పి జీవనం సాగించేవారు. ఆర్డర్ ఇచ్చిన వారి స్తోమతను బట్టి 10 నుంచి 30 మీటర్ల గుడ్డమీ ద కథల బొమ్మలు చిత్రించి ఇచ్చేవారు. దాని ని తీసుకెళ్లి ఊరూరా తిరుగుతూ వారు జీవనం సాగిస్తే, మేము వారిచ్చే ఆర్డర్ల మీద ఆధారపడి మావాళ్లు బతికేవాళ్లు. కొందరు బొమ్మలు తయా రు చేయించుకునేవారు. బొమ్మలు కూడా సంప్ర దాయం వస్తువులతో చేసేవే. ఇక్కడ మరో విష యం చెప్పాలి..మేము గీసిన చిత్రాలే సంచార జాతులకు ఆస్తి. ఒక తండ్రికి ఇద్దరు కొడు కులు ఉంటే మేము గీసి ఇచ్చిన చిత్రాలున్న కాన్వాస్‌లను అమ్మి వచ్చిన సొమ్మును కొడుకులకు పంచేవారంట. అంతటి విలువై నవీ చిత్రాలు. సంప్రదాయ రంగులతో వేసిన ఈచిత్రాలు, ఆయిల్ పెయింట్ల కంటే ఆకర్షణీయంగా ఉండడమే కాదు..తక్కువలో తక్కువ 150 సంవత్సరాలు చెక్కు చెదరకుం డాఉంటాయి. మన సంప్రదాయ రంగుల గొప్ప దనం అది. ప్రస్తుతం సినిమాలు, టీవీలు వచ్చిన తర్వాత ఆ కథలు చెప్పేవారు,వినేవారు లేరు. దీంతో మాకు కాన్వాస్ మీద చిత్రాలు వేసే పని తగ్గింది. అయితే కొందరు కర్టన్లమీద, చీరల మీద, సెల్‌ఫోన్ గార్డుల మీద, స్త్రీల డ్రెస్ మెటీరియల్, జ్యుయలరీ బాక్సుల మీద నకాషి చిత్రాలు వేయించుకుంటు న్నారు. అందుకే ఆర్డర్లు దృష్టిలో ఉంచుకుని ప్రస్తు తం మాకుటుంబం హైదరాబాద్‌లో ఉంటున్నా ము. ఎంతో అరుదైన చిత్రకళ ఇది. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే ..దీనిని సజీవంగా భావితరాలకు అందించాలనేదే మా ఆశ..ఆశయం కూడానూ!

# మీ పిల్లలు ప్రేమలో పడితే...!

ఓ ఫైన్ డే....మీ అబ్బాయి లేదా అమ్మాయి.....హై స్కూల్ నుంచి రాగానే ..మమ్మీ/డాడీ ఐ యామ్ ఫాల్ ఇన్ లవ్ అని చెప్పేసారనుకోండి.. ఏంటీ పాఠశాల దశలో ప్రేమ ఏంటని ఆశ్చర్యపోతున్నారా? నిజమే... కానీ పిల్లలు తమ తోటి విద్యార్థులతో ఆకర్షింపబడతారు... స్పీడ్ యుగం కదా..సినిమాలు, సీరియళ్ల ప్రభావం..కళాశాల స్థాయి నుంచి పాఠశాల స్థాయికి ప్రేమ అనే పదం దిగుమతి అయింది. అందుకే అమ్మా నేను మా క్లాస్‌మేట్ ను ప్రేమిస్తున్నానని చెప్పారనుకోండి... ఏమిచేస్తారు? చెడామడా చీవాట్లు పెడతారా? .. కోపం తగ్గకపోతే నాలుగు తగిలిస్తారా? ఇక మీదట అలా జరిగితే సహించేది లేదని హెచ్చరిస్తారు..అంతేనా? అక్కడే తల్లిదండ్రులు తప్పులో కాలేస్తున్నారు. ఎందుకంటే అది ఆకర్షణ మాత్రమే..ప్రేమ కాదు. అందుకే అలాంటి సందర్భాల్లో పేరెంట్స్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!

➩ అమ్మాయి /అబ్బాయి వచ్చి..మమ్మీ మేము ప్రేమించుకుని, విరామ సమయంలో పెళ్లి చేసుకున్నామని చెప్పినా కూడా.... పిల్లలు చెడిపోతున్నారని బాధపడకండి..అమ్మాయి /అబ్బాయి చెప్పిన విషయాన్ని లైట్ తీసుకోండి.. ఆ అబ్బాయి/ అమ్మాయి ఎవరు? నీ క్లాస్‌మేటా? లేక పక్కతరగతా అంటూ ఆరా తీయండి. తను చెప్పిన దానికి అమ్మ కోపపడలేదు కాబట్టి సంతోషంగా మిగిలిన విషయాలు దాపరికం లేకుండా చెప్పేస్తారు. అలాగే ఎలా జరిగింది? అప్పుడు ఎవరున్నారు? అంటూ విషయాలు తెలుసుకోండి. అంటే వారు ప్రేమకు, ఆకర్షణకు తేడా తెలియని పిల్లలు. కాబట్టి సినిమాల్లోనో..నిజ జీవితంలోనో చూసిన సంఘటనల ప్రభావం వల్ల అలాచేసి ఉంటారు. కాబట్టి..వారి మానసిక ప్రవర్తనను అర్థం చేసుకోండి. ఓ కన్నేసి ఉంచండి. పెళ్లే చేసుకున్నారా? లేక ఇంకేమయినా చేశారా? ఉదాహరణకు... పరిస్థితి ఎంతవరకు వచ్చింది? అని చాలా క్యాజువల్‌గా అడిగి తెలుసుకోండి. అంతేకాదు ఇక మీదట ప్రతిరోజు స్కూల్ వేళల్లో జరిగిన ప్రతి సంఘటనను మీతో పంచుకునేలా ప్రోత్సహించండి..ఎందుకంటే అవి మీకు తెలిస్తే...ఓ వైద్యుడు మానసిక రోగికి వైద్యం చేసినట్లు... మీరు మీ పాపను మార్చుకోవచ్చు. చెప్పగానే చీవాట్ల పురాణం అందుకుని,దెబ్బల పర్వం కానిచ్చి, స్కూల్ కు వెళ్లి ..ఇలాంటివి జరుగుతుంటే మీరేం చేస్తున్నారని టీచర్ల మీద పోట్లాడకండి.

➩ ఓ సారి మీ గత జీవితంలోకి వెళ్లి తరచి చూసుకోండి. మీరు కూడా ప్రేమలో పడినప్పుడు ఆ విషయం మీవారికి చెబితే ఏమి చేశారో గుర్తు చేసుకోండి. మీ తల్లిదండ్రులు మిమ్ములను కోపగించి,కొట్టి, నానా రభస చేస్తే.. మీరు ఏమి చేసుంటారు? మీలో పట్టుదల పెరిగి పెద్దలను ఎదిరించే స్థితికి చేరుకుంటారు..అందుకే మీవాళ్లు మిమ్ములను కోపడ్డారు కాబట్టి, అలానే మీరు చేయకండి.. మీరు మాత్రం చాలా ప్రశాంతంగా..వాళ్ల మాటలు వినండి..అటు ప్రోత్సహించకండి..ఇటు వ్యతిరేకించకండి.. మెల్లగా దాని గురించిన పూర్తి సమాచారం తెలుసుకోండి. అంతేకాదు మీ అమ్మాయి /అబ్బాయి తప్పుడు దారిపడితే మెల్లగా అర్థమయ్యేలా చెప్పండి.. లేక మంచి దారిలోనే పోతే పెద్దలుగా సరైన నిర్ణయాన్ని తీసుకోండి. ఎట్టి పరిస్థితిలోనూ మీరు వ్యతిరేక భావంతో ఉన్నారన్న విషయం తెలియనీయవద్దు.

➩ మీ అబ్బాయి/ అమ్మాయి స్నేహితుడిని ఆకర్షించడం అనేది గొప్ప విషయం అని చెప్పండి.. మీలో ఏదో ప్రత్యేకమైన టాలెంట్ ఉండబట్టే అది జరిగిందని ప్రశంసించండి. అదే సమయంలో అబ్బాయిలకు, అమ్మాయిలకు మధ్య ఉన్న హద్దులను తెలియ జేయడం ద్వారా..వాళ్ల మధ్య ఆకర్షణను..అంతవరకే పరిమితమయ్యేలా..జాగ్రత్త పడండి. కలిసి ఆడుకోవచ్చు.. కలిసి తిరగవచ్చు...కాని హద్దులు దాటడం సరైంది కాదన్న విషయం తెలియజేయండి. ప్రతి రోజు వారు కలిసి చేసే ప్రతి పనిని మీతో చెప్పేలా జాగ్రత్త పడండి. వారి స్నేహాన్ని తప్పుబట్టవద్దు. వాళ్లకు ఆకర్షణ తొలగి అవగాహన వచ్చేవరకు ఇలా జాగ్రత్త పడాలి. అప్పుడు వారి మధ్య బంధం స్నేహానికే పరిమితం అవుతుంది.

➩ ఇక్కడ మరో విషయం..మీ అబ్బాయి లేదా అమ్మాయికి స్నేహితుడు/ స్నేహితురాలు తన ప్రేమ విషయం చెప్పారా?లేదా? అనేది తెలుసుకోండి. చెప్పక పోతే అది వన్ సైడ్ లవ్ అని గ్రహించండి. అంటే తమ మిత్రుడు తనతో కలివిడిగా తిరిగేది స్నేహ భావంతో కాని, ప్రేమతో కాదన్న విషయం తెలిసేలా చేయండి. అందుకే ఇద్దరి మధ్య ఆకర్షణ ఉందని, దానిని అతను స్నేహంగానే భావిస్తే..తను మాత్రమే ప్రేమగా భ్రమిస్తున్నదని అర్థమయ్యేలా చెప్పండి.

తొందరపడి ప్రేమ ప్రస్తావన తెస్తే.. మీ స్నేహం చెడిపోయే ప్రమాదం ఉందని వివరించండి. అంతేకాదు మీ పిల్లల హృదయ స్పందన ఎలా ఉన్నా, మీరు అంగీకరించడానికి రెడీగా ఉండండి. లేదంటే నేను ప్రేమలో పడ్డానని చెప్పగానే గొడ్డును బాదినట్లు బాదారు అనుకోండి..పరిస్థితి ఇంతవరకు కూడా రాదు. ఆదిలోనే బెడిసి కొట్టి పిల్లలు తల్లిదండ్రులను శత్రువులుగా భావించే ప్రమాదం ఉంది. తస్మాత్ జాగ్రత్త!



# దినఫలాలు

**మేష రాశి**
ముఖ్యమైన పనుల్లో ప్రతిబంధకాలు, అనుకోని ప్రయాణాలు, ఇంటాబయటా ఒత్తిడులు, ఆలయాలు సందర్శిస్తారు. ఆరోగ్యభంగం, వ్యాపార, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి. ధనవ్యయం.

**వృషభ రాశి**
పలుకుబడి పెరుగుతుంది. సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతారు. ఆశయాలు నెరవేరుతాయి. వస్తు, వస్త్రలాభాలు, పాతమిత్రుల కలయిక. వ్యాపార, ఉద్యోగాలు మరింత మెరుగ్గా ఉంటాయి.

**మిథున రాశి**
సన్నిహితులతో వివాదాలు, ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యులతో వైరం, అనారోగ్యం. శ్రమ తప్పకపోవచ్చు. దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలు గందరగోళంగా ఉంటాయి.

**కర్కాటక రాశి**
శుభవార్తలు. వాహనయోగం. పనుల్లో విజయం. ఆప్తులు, బంధువులతో వివాదాలు సర్దుబాటు చేసుకుంటారు. నూతన ఉద్యోగయోగం. వ్యాపార, ఉద్యోగాలు ఆశాజనకంగా ఉంటాయి.

**సింహ రాశి**
మిత్రులతో విభేదాలు. ఆర్థిక ఇబ్బందులు. అనుకోని ప్రయాణాలు. ఇంటాబయటా చికాకులు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. అనారోగ్యం. వ్యాపార, ఉద్యోగాలు మందకొడిగానే ఉంటాయి.

**కన్యా రాశి**
కొన్ని సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఆత్మీయుల నుంచి పిలుపు అందుతుంది. వస్తులాభాలు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆటుపోట్లు తొలగుతాయి.

**తుల రాశి**
ఇంటర్వ్యూలు అందుకుంటారు. వస్తులాభాలు. బంధువులతో ముఖ్యవిషయాలు చర్చిస్తారు. ప్రముఖులతో పరిచయాలు. దైవచింతన. విందువినోదాలు. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహవంతంగా సాగుతాయి.

**వృశ్చిక రాశి**
చేపట్టిన పనులు కొంత నిరాశ పరుస్తాయి. దూరప్రయాణాలు. ఇంటాబయటా ఒత్తిడులు. ఆరోగ్యం మందగిస్తుంది. శ్రమాధిక్యం. వ్యాపార, ఉద్యోగాలు సామాన్యంగా ఉంటాయి.

**ధనూ రాశి**
పరిస్థితులు అనుకూలించవు. బంధుమిత్రులతో వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయ దర్శనాలు. వ్యాపార, ఉద్యోగాలు కొంత నిరాశ పరుస్తాయి.

**మకర రాశి**
వ్యవహారాలలో విజయం. శుభకార్యాలు నిర్వహిస్తారు. సంఘంలో గౌరవం. కష్టానికి ఫలితం దక్కుతుంది. దూరపు బంధువులను కలుసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలు ఆశాజనకంగా ఉంటాయి.

**కుంభ రాశి**
సన్నిహితుల నుంచి కీలక సందేశం. విలువైన వస్తువులు కొంటారు. స్థిరాస్తి వృద్ధి. కీలక నిర్ణయాలు. విందువినోదాలు. వాహనాలు కొంటారు. వ్యాపార, ఉద్యోగాలు మరింత అనుకూలిస్తాయి.

**మీన రాశి**
మిత్రులతో మాటపట్టింపులు. ధనవ్యయం. కుటుంబంలో చికాకులు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరోగ్యం మందగిస్తుంది. పనులలో ఆటంకాలు. వ్యాపార, ఉద్యోగాలు కొంత నిదానిస్తాయి.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

# గో గీత

గోషు భక్తశ్చ లభతేయద్య దిచ్ఛతి మానవః
స్త్రియోపి భక్తా యా గోషు తాశ్చ మానవాప్నుయుః
పుత్రార్థీ లభ్యతే పుత్రం కన్యార్థీ తామవాప్నుయాత్
ధనార్థీ లభతే విత్తం ధర్మార్థీ ప్రాప్నువాప్నుయాత్
విద్యార్థీ చాప్నుయాద్విద్యాం సుఖార్థీ ప్రాప్నుయాచ్ఛుఖమ్
న కించిదుర్లభం చైవ గవాం భక్తస్య భారత

(మహాభారతం అను. 83-51,52)

గోభక్తుడైన వ్యక్తి ఏదేది కోరితే అవన్నీ అతనికి లభిస్తాయి. గోభక్తులైన స్త్రీలకు కూడా వారి కోరికలు నెరవేరుతాయి. పుత్రుడు కావాలంటే పుత్రుడు, వివాహం చేసుకోదలచిన వారికి కన్య, విద్యార్థికి విద్య, సుఖాలు కోరుకునే వారికి సౌఖ్యం, ధనం కోరుకునే వారికి ధన ప్రాప్తి భారతా! గో భక్తునికి దుర్లభమైనదేదీ లేదు.



- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

# చింతన



# పురుషార్థాల్లో ధనం స్థానం

> **అక్రమంగా, అన్యాయంగా, దౌర్జన్యంగా, దోపిడీలతో, దొంగతనాలతో, మోసాలతో, సంపాదించిన డబ్బు కలుషితమైనదే! అటువంటి ధనంతో దేవాలయాలు, ఆరామాలు, తటాకాలు నిర్మించినా, విగ్రహ ప్రతిష్ఠలు, యజ్ఞ యాగాదులు, దానధర్మాలు చేసినా పొందాల్సిన ఫలం పొందలేము. కారణం ద్రవ్య శుద్ధి లేకపోవడమే!**

పురుషార్థాలు నాలుగని, అవి ధర్మార్థ కామమోక్షాలని అందరికీ తెలుసు. ఈ రోజుల్లో ప్రపంచం యావత్తు రెండవదైన అర్థం చుట్టూ ఎక్కువగా పరిభ్రమిస్తోంది. ఈ అర్థం పూర్వాపరాలను కొంత పరిశీలిద్దాం. అర్థ శబ్దానికి 'కారణం', 'ధనం', 'న్యాయం' అనే అర్థాలు ఉన్నాయి. అయితే సహజంగా ధనం అనే అర్థమే ఎక్కువగా వాడుకలో ఉంది.

మన జీవనానికి డబ్బు చాలా అవసరం. అదిలేకుంటే పూట గడవదు. తనపై ఆధారపడినవారి భుక్తి కోసం కూడా ధన సంపాదన అవసరమే. అందువల్లనే **ధర్మాన్న ప్రమదితవ్యం** (ధర్మాచరణలో ఏమాత్రం అజాగ్రత్త కూడదన్న శ్రుతి **భూత్యైన్నప్రమదితవ్యం** అని కూడా చెప్పింది. భూతి అంటే సంపద. దాన్ని సంపాదించడంలో అజాగ్రత్తకూడదని హెచ్చరించింది. అయితే ధర్మయుతంగా డబ్బు సంపాదించాలి. అధర్మంగా సంపాదించిన విత్తానికి అర్థ శుద్ధి ఉండదు. అర్థ శుద్ధి లేనిదే ద్రవ్య శుద్ధి ఉండదు. ద్రవ్య శుద్ధి లేనిదే పూజాదికాలకు, దానాదికాలకు ఆ ద్రవ్యాలు పనికి రావు.

అధర్మయుతమైన ధనంతో కొని వండుకు తినే ఆహారం కలుషితమైనది. కలుషితాహారం వల్ల మనస్సు కశ్మలమవుతుంది. చెడు ఆలోచనలు చిత్త చాంచల్యం కలిగించి మన చేత పాపకర్మలు చేయిస్తాయి. మనకెంత ప్రాప్తమో అంతే ధనం లభిస్తుంది. ఉన్నదానితోనే సంతృప్తి చెందాలి. భర్తృహరి తన సుభాషితంలో ఇలా అంటాడు.

**ర్వ్యప్రోనధ్యయనాత్కులం కుతనమాచ్ఛీలం ఖలోపాసనాత్**
**హ్రీర్మద్యాదన వేక్షణాదపి కృషిః స్నేహః ప్రవాసాశ్రయా**
**న్మైత్రించాప్రణయాత్సమృద్ధిరనయాత్త్యాగాత్ప్రమాదాద్ధనమ్**

దుర్మంత్రి చేత రాజు, స్త్రీసాంగత్యం చేత యోగి, లాలన చేత బాలుడు, వేదాధ్యయనం చేయక బ్రాహ్మణుడు, దుర్జనుల మైత్రితో శీలం, మద్యపానముచే లజ్జ, అనురాగం లేని చెలిమి, పరామర్శ (వ్యవసాయపనులు) లేని పొలం, నీతి లేమితో పొందిన ధనం ప్రమాదం వల్ల నశించిపోవును.

మన అవసరానికి మించిన ధనం కూడబెట్టడం వలన అనేక అనర్థాలు కలుగుతాయి.

**'అర్థమనర్థం భావయ నిత్యం**
**నాస్తితతస్సుఖ లేశస్సత్యం**
**పుత్రాదపి ధన భాజాం భీతిః**

అన్నారు ఆది శంకరులు. ధనవంతులకు దొంగలు ఇతరుల వలనేకాక స్వంత కొడుకుల వలన కూడా భయం ఉంటుందంటారు.

తమ 'వేదాంత పంచదశి'లో విద్యారణ్యస్వాముల వారు ధనం వలన భయమే కానీ సుఖం లేదంటారు. ధన సంపాదనలో చాలా కష్టం ఉంది. రాదేమో అన్న

**యద్ధాత్రా నిజఫాల పట్ట లిఖితం స్తోకం మహద్వాధనం**
**తత్ప్రాప్నోతి మరుస్థలే పినితరాం మే శౌచనాతోధికమ్**
**తద్ధీరో భవ విత్త వత్సుకృపణాం వృత్తిం వృథా మాకృథాః**
**కూపే పశ్య పయోనిధావపి ఘటో గృహ్ణాతి తులం జలమ్**

ఏ మనిషికైనా బ్రహ్మ దేవుడు నొసటిపై ఎంత ధనం కలుగునట్లు రాశాడో అంత ధనం కొంచెమైనా తగ్గకుండా శ్మశాన భూమి యందైనా లభిస్తుంది. బంగారంతో నిండిన మేరు పర్వతం చేరినా అంతకంటె ఎక్కువ లభించదు. కనుక ధనవంతుల వద్ద దీనంగా ఉండటం వలన నింద కలుగునే కాని ధనమెక్కువ రాదు. కుండను బావిలో ముంచినపుడు ఎంత నీరు వస్తుందో సముద్రంలో ముంచినా ఆ పరిమాణంలోనే వస్తుంది. బావి కంటె సముద్రం పెద్దదైనా ఎక్కువ నీరు రాదు కదా!

అందువలన న్యాయార్జితమైన సొమ్ము కొంచెమైనా చాలు.

**'వ్యాప్తిం జెందక వగవక ప్రాప్తంబడు లేశమైన పదివేలనుచున్**
**తృప్తిం జెందని మనుజుడు సప్త ద్వీపంబులందు జక్కంబడునే**

అని భాగవతం అంటుంది. అక్రమంగా, అన్యాయంగా, దౌర్జన్యంగా, దోపిడీలతో, దొంగతనాలతో, మోసాలతో, సంపాదించిన డబ్బు కలుషితమైనదే! అటువంటి ధనంతో దేవాలయాలు, ఆరామాలు, తటాకాలు నిర్మించినా, విగ్రహ ప్రతిష్ఠలు, యజ్ఞ యాగాదులు, దానధర్మాలు చేసినా పొందాల్సిన ఫలం పొందలేము. కారణం ద్రవ్య శుద్ధి లేకపోవడమే!

**దౌర్మం త్రాన్నృపతిర్వినశ్యతి**
**యతిస్సంగాత్సుతో లాలనా**

భయంతో బాటు, ఆర్జించిన దానిని కాపాడుకోవడంలోనూ, కష్టం, భయం ఉంటాయి. ధనం పోతే అమిత దుఃఖం కలుగుతుంది. కనుక ధర్మాచరణకు, ధర్మ యుత జీవనం కోసం ధన సంపాదన ఉండాలే కానీ దురాశతో, వ్యసనాలతో విలాసవంతజీవిక కోసం ఉండకూడదు.

**అజరామరవత్ ప్రాజ్ఞోవిద్యామర్థంచ సాధయేత్**
**గృహీత ఇవ కేశేషు మృత్యునా ధర్మ మాచరేత్**

తెలివైనవాడు తనకు ముసలితనం, చావు లేనట్లుగానే డబ్బు సంపాదించాలి. అలాగే చావు తన తలపైననే ఉందని భావించి ఎప్పటికప్పుడు ధర్మాచరణ చేయాలి.

**చత్వారో ధనదాయాదాః ధర్మాగ్నినృప తస్కరాః**
**తేషాం జ్యేష్ఠావమానేన త్రయం కుప్యన్తి చేతరాః**

ధనాన్ని అపహరించేవారు నలుగురుంటారు. ధర్మము, అగ్ని, రాజు, దొంగ. ఈ నలుగురిలో మొదటివాడైన ధర్మాన్ని అవమానిస్తే అంటే ధర్మం చేయకపోతే తక్కిన ముగ్గురూ అగ్ని, రాజు, తస్కరుడు కోప్పడతారు. అంటే ధనం వారి పాలవుతుంది. కనుక ధనాన్ని దాన ధర్మాలకు ఉపయోగించాలి.

(తరువాయి భాగం శుక్రవారం నాటి సంచికలో)

గొల్లాపిన్ని సీతారామశాస్త్రి
9440781236

# భీష్ముని వదలని పాపకర్మ ఫలం

మానవ జీవితం సుఖ దుఃఖమయం. పూర్వ జన్మల్లో చేసిన పాప పుణ్యాలే ఈ సుఖదుఃఖాలకు కారణమన్న విషయం తెలుసుకోవాలి. ఆ కర్మఫలాన్నుంచి ఎంతటి వారైనా తప్పించుకోలేరని మనం తెలుసుకున్నాం. కర్మ ఫలాన్ని అనుభవించి తీరాలని తెలిపే కథలు మన వాఙ్మయంలో ఎన్నో ఉన్నాయి. కర్మఫలానికి సంబంధించి మహేతిహాసం మహాభారతంలోని సన్నివేశం ఇందుకు నిదర్శనం.

మహాభారత యుద్ధంలో దెబ్బతిని అంపశయ్య మీద పడుకుని మరణం కోసం ఎదురుచూస్తున్నాడు భీష్మ పితామహుడు. ఆయనను చూడడానికి శ్రీకృష్ణుడు అక్కడికి వచ్చాడు. భీష్ముడు ఆయనను ఇలా అడిగాడు. 'కృష్ణా! ఈ జన్మలో నేను ఏ పాపమూ చేయలేదు. మరి నా శరీరం బాణాలతో ఇలా చిల్లులు ఎందుకు పడింది? నాకీ కష్టం ఎందుకు వచ్చింది?. దానికి శ్రీకృష్ణభగవానుడు బదులిస్తూ, 'భీష్మా! పూర్వజన్మలో నీవు చేసిన పాపకర్మ ఫలితం ఇది. పూర్వ జన్మలలో జరిగినది నీకు తెలియదు. సాక్ష్యం లేకుండా దానిని నీవు నమ్మవు కూడా. అందువలన నేను నీకు కొద్ది సేపు దివ్య దృష్టి ఇస్తున్నాను. నీ పూర్వ జన్మల పరిస్థితిని నీవు స్వయంగా చూడగలవు' అన్నాడు. దివ్యదృష్టి పొందిన భీష్ముడు తన పూర్వ జన్మ వృత్తాంతాన్ని చూడగలిగాడు.

దాని ప్రకారం కొన్ని జన్మల ముందు ఆయన ఒక రాజు వద్ద మావటివానిలా పని చేసేవాడు. ఏనుగుల మంచి చెడులు చూసేవాడు. ఏనుగులను అదుపు చేసేందుకు మావటి వాని వద్ద అంకుశం ఉంటుంది. ఆ జన్మలో మావటివానిగా ఉన్న భీష్ముడు తన అంకుశంతో ఊసరవెల్లిని పొడిచాడు. అది దాని శరీరంలో దిగబడింది. ఆయన అంకుశాన్ని పైకి ఎత్తి మొనకు చిక్కుకుని ఉన్న ఊసరవెల్లిని దూరంగా విసిరివేశాడు. అది వెళ్లి లెక్కలేనన్ని ముండ్లు ఉన్న నాగఫణి మొక్కమీద పడింది. అలా ఆ ముండ్లపై కొద్ది రోజులు విలవిల్లాడి చనిపోయింది. శ్రీకృష్ణుడు భీష్మునికి ఈ విషయం చూపి 'నీవు ఆ జన్మలో అకారణంగా ఆ ఊసరవెల్లిని అంకుశంతో చీల్చావు. ముండ్ల మీద పడేశావు. ఆ పాప కర్మ ఫలితం ఇన్ని జన్మల తర్వాత ఇప్పుడు నీకు ఈ విధంగా లభిస్తోంది. కర్మ ఎన్నడూ నిష్ఫలంకాదు. ఆలస్యంగానైనా, తొందరగానైనా దాని ఫలితాన్ని మాత్రం అనుభవించి తీరవలసిందే. పుణ్య ఫలం వల్ల సుఖం, పాప ఫలం వల్ల దుఃఖం కలుగుతాయి. పూర్వ జన్మ కృతం పాపం వ్యాధి రూపేణ,... పూర్వ జన్మ కృతం పుణ్యం భోగరూపేణ అంటారు. ఒక శరీరంతో చేసిన పాప పుణ్యాలు అదే శరీరంతో అనుభవించాలని లేదు. వేరొక జన్మలో వేరొక శరీరంతో అనుభవించవచ్చు. ఎవరెవరి పాప పుణ్య కర్మ ఫలితాన్ని వారికి పంచి ఇస్తానని శ్రీకృష్ణపరమాత్మే చెప్పాడు. అందరూ కోరుకునేది సుఖం కనుక మన పెద్దలు పదుగురికి మంచి చేయమన్నారు. దానితో పుణ్యం తద్వారా సుఖం లభిస్తాయి.



మనం భీష్ముని వలె దివ్య దృష్టిని పొందలేము. గత జన్మల గురించి తెలుసుకోలేము. అయితే వాటిని ఊహించగలము. ప్రస్తుత జీవితంలో మనం అనుభవించే కష్టనష్టాలు, రోగాలు అన్నీ మనం చేసే ఏదో ఒక పాపకర్మకు ప్రతిఫలం. ఈ విధంగా మన పాపం నశించిపోవడాన్ని మన అదృష్టంగా పరిగణించాలి. మన ఖాతాలో ఉన్న పాపకర్మలు నశించిపోతే భవిష్యత్తులో జీవితంలో సుఖం, ఆనందం వెల్లివిరుస్తాయి. భీష్మ పితామహునివలె పాపవిముక్తులమవుతాము. సుఖ జీవనం పొందవచ్చు. పాప కర్మ నుంచి తప్పించుకునే శక్తి ఉన్నా పాపకర్మను అనుభవించాలని, పాపాన్ని కడిగేసుకోవాలి. వాటిని స్వాగతించిన మహాత్ములూ ఈ పుణ్య భూమిలో ఉన్నారు. ఎంతటి గొప్పవారినైనా పాప కర్మ పట్టి పీడిస్తుంది. దానిని అనుభవించే తీరాలి. అయితే దైవ పూజలు వంటివి ఆ పాప ఫల అనుభవాన్నుంచి కేవలం ఉపశమనాన్ని మాత్రం కలిగిస్తాయని ఒక మహానుభావుడు పేర్కొన్నారు. పాప కర్మ చేయకుండా ఉండాలేకాని పూజలతో, జపతపాదులతో దానిని కడుగేసుకుందామనుకోవడం అవివేకం. ఇది తెలుసుకుని అందరం మంచి కర్మలు చేయడం శ్రేయస్కరమని తెలుసుకోవాలి.

సర్వేజనాస్సుఖినోభవంతు

కోసూరు హయగ్రీవరావు
99949514583

# భగవద్గీత

అధ్యాయం- 18
శ్లోకం- 73



**అర్జున ఉవాచ**
నష్టో మోహః స్మృతిర్లబ్ధా
త్వత్ప్రసాదాన్మయాచ్యుత।
స్థితోస్మి గతసందేహః
కరిష్యే వచనం తవ ॥

# అచ్యుతా! నా మోహం నశించింది

**తాత్పర్యం**

**అర్జునుడు పలికెను :** ఓ అచ్యుతా! నా మోహము ఇప్పుడు నశించినది. నీ కరుణచే నా స్మృతిని తిరిగి పొందితిని. ఇప్పుడు నేను స్థిరుడను, సందేహరహితుడను అయి నీ ఆజ్ఞానుసారము వర్తించుటకు సిద్ధముగా నున్నాను.

**భాష్యం**

ఈ శ్లోకము నందు మోహము అను పదము ముఖ్యమైనది. సహజముగా జీవుడు భగవంతుని దాసుడు. కాని తానే యజమానినని భావించి ఈ భౌతిక ప్రకృతిని అనుభవించాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. దీనినే మోహము అందురు. అది కేవలము కృష్ణుని కృప లేదా ఒక శుద్ధ భక్తుని కృప ఉంటే గాని తొలగింపబడదు. అలా మోహము పొయిన పిమ్మట భగవంతుని ఆజ్ఞలను పాటించుటకు సిద్ధమగుదురు. అర్జునుడు భగవద్గీత విన్న తరువాత శ్రీకృష్ణుడు కేవలము తన స్నేహితుడే కాక దేవాది దేవుడైన భగవంతుడని అర్థము చేసుకున్నాడు. అనగా భగవంతుడైన శ్రీకృష్ణున్ని అర్థము చేసుకొనుటయే భగవద్గీతా అధ్యయనము యొక్క లక్ష్యము. చివరకు అర్జునుడు, శ్రీకృష్ణుడు యుద్ధము ద్వారా భూభారాన్ని తగ్గించదలచినాడని అర్థము చేసుకుని తన విల్లు, బాణములను చేత బట్టి యుద్ధమునకు సంసిద్ధుడయ్యెను.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత యథాతథము' ఆధారంగా సమర్పిస్తున్నాము.

android Google play | iOS iTunes

# కలబడి...నిలబడి గెలిచిన ప్రాంజల్






స్ఫూర్తి

**మనలో తపన,పట్టుదల, కృషి ఉంటే ఎటువంటి శిఖరాలనైనా, ఎన్ని అవరోధాలు ఎదురైనా సాధించవచ్చునని నిరూపించారు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రాంజల్ పాటిల్. తన ప్రతిభకు అంధత్వం అవరోధం కానేకాదని అధికారులతో పోరాడి పట్టుదలతో అనుకున్న ఉన్నత పదవి (ఐఏఎస్)ని సాధించారు. సబ్ కలెక్టర్‌గా పదవి చేపట్టిన మొట్టమొదటి అంధురాలిగా రికార్డు సృష్టించారు. ఈ స్థాయికి చేరడానికి ఆమె ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. ఆ వివరాలు మీకోసం...**

## 'అంధత్వం సాకు'తో ఐఆర్ఎస్‌లో దక్కని కొలువు
## పట్టుదలతో సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించిన యువతి

ప్రాంజల్ పాటిల్ ఐఏఎస్ ఆఫీసర్‌గా ఎంపికైన మొట్టమొదటి అంధురాలు. ఆమె కేరళలోని తిరువనంతపురంలో సబ్‌కలెక్టర్‌గా సోమవారం నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె మహారాష్ట్ర జల్‌గావ్‌లోని వడాజీ గ్రామంలో ఏప్రిల్1, 1988లో జన్మించారు. ఆమె వయసు 31 సంవత్సరాలు. స్కూలు విద్యాభ్యాసం మహారాష్ట్రలోని ఉల్లాస్‌నగర్‌లోని చాందిబాయ్ హిమ్మత్ లాల్ మన్‌సుఖాని స్కూలులో, ముంబయిలోని కమలా మెహతా దాదర్ స్కూలులో పూర్తయ్యింది. ఆమెకు చదువంటే చాలా ఇష్టం. ఆర్ట్స్‌లో మాస్టర్ డిగ్రీని, ఎమ్.ఫిల్ పట్టాను పొందారు. అంతర్జాతీయ సంబంధాలమీద పిహెచ్‌డిని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ నుండి పొందారు. ఆమెకు పుస్తకాలు చదవడమంటే చాలా ఇష్టం. తల్లి జ్యోతి పాటిల్, తండ్రి లాహెన్ సింగ్ బి. పాటిల్ (ఇంజనీరింగ్ అసిస్టెంట్). ఆమెకు వివాహమైంది. భర్త పేరు కోమల్ సింగ్ పాటిల్( వ్యాపారవేత్త). ఆమె తన కంటిచూపును ఆరేళ్ల వయసులోనే కోల్పోయారు. ప్రాంజల్ పుట్టడమే తక్కువ శాతం కంటిచూపుతో పుట్టారు. కళ్లజోడు సహాయంతో ఆరేళ్లు గడిచాయి. అనుకోకుండా ఒకరోజు కళ్లజోడు లేకుండా సూర్యకిరణాలను తీక్షణంగా చూడడంతో మొత్తం చూపును కోల్పోయారు. పూర్తిగా అంధురాలుగా మారిపోయారు. ప్రాంజల్ పరిస్థితి అలా మారిపోయినందుకు తల్లిదండ్రులు ఆమెను కించపరచలేదు. ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ చదువులో రాణించాలని ప్రోత్సహిస్తూనే వచ్చారు. కమలా మెహతా అంధుల పాఠశాలలో ఆమెను చేర్చారు. చాలా తెలివైన విద్యార్థిని. అన్ని పరీక్షలలో మొదటిస్థానాన్ని దక్కించు కునేవారు. కాలేజీ చదువుతున్న సమయంలో ఆమె రోజూ ఇంటి దగ్గర (ఉల్లాస్‌నగర్) నుంచి ఛత్రపతి శివాజీ టెర్మినస్ (కాలేజ్) దగ్గరకు వెళ్లేవారు. ఆమె ప్రయాణించేటప్పుడు చుట్టుప్రక్కల ప్రజలు ఎప్పుడూ సహాయాన్ని అందించేవారు. ట్రైన్ ఎక్కాలన్నా, రోడ్డు క్రాస్ చేయాలన్నా, బ్రిడ్జిలు ఎక్కాలన్నా వారందరూ సహాయం చేయడంతో ప్రయాణంలో ఎప్పుడూ ఎటువంటి సమస్యలను ఎదుర్కోలేదు.

### సివిల్స్‌కు ప్రేరణ ఇలా...

ప్రాంజల్ డిగ్రీ చదువుతున్న సమయంలో ఆమె స్నేహితురాలు ఒకసారి ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ గురించి వచ్చిన ఆర్టికల్‌ను చదివింది. ఆ పదవిలో ఉన్న హోదా, గౌరవం ప్రాధాన్యత ఆమెను ఆకట్టుకున్నాయి. సివిల్స్ రాయాలని నిర్ణయించుకున్నారు. ఆ పరీక్షలు రాయాలంటే బాగా ప్రిపేర్ కావాలని ఆ సంవత్సరం పరీక్షలు రాయలేదు. 2015లో ఎమ్.ఫిల్ డిగ్రీ పూర్తయ్యాక సివిల్స్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఆమె ప్రిపరేషన్‌కి తనకు తెలిసిన టెక్నాలజీని జాబ్ యాక్సెస్ విత్ స్పీచ్ (జెఎడబ్ల్యుయస్) వాడారు. బ్రెయిలీ లిపిలో సమాచారమంతా ఈ యాప్‌లో ఉంటుంది. దీనిద్వారా ఆమె ప్రిపేర్ అయ్యారు. ఆమె పరీక్ష రాయాలన్నా మరో మనిషి అవసరం. మెయిన్ పరీక్ష మూడు గంటలు ఉంటుంది. కాని నాలుగు గంటల సమయం తప్పనిసరి కావాలి. తను చెప్పేది వేగంగా రాయగల వ్యక్తికోసం ఆమె వెదికారు. ఆమెలోని పట్టుదల చూసి స్నేహితురాలు విదుషి పరీక్ష రాయడానికి సిద్ధపడ్డారు. విదుషి పరీక్ష రాస్తాననడంతో ఆమెలో విజయం సాధిస్తాననే నమ్మకం పెరిగింది. పరీక్ష రాయడమే కాకుండా ప్రాంజల్ పరీక్షకు కావలసిన ప్రిపరేషన్స్‌ను విదుషి దగ్గరుండి చూసుకున్నారు.

"విదుషి మంచి రైటర్. నేను ఏది చెబితే అది క్షణంలో వేగంగా రాయగలిగేది. త్వరగా చెప్పకపోతే నన్ను తిట్టేది. ఆమె దొరకడం నా అదృష్టం" అన్నారు ప్రాంజల్ పాటిల్.

సివిల్స్ ప్రిపరేషన్ కోసం ఆమె ఎటువంటి కోచింగ్ సెంటర్లకు వెళ్లలేదు. కాని వారు పెట్టే పరీక్షలకు హాజరయ్యేది. దానివల్ల ఆమె ప్రతి పరీక్షలో ప్రతిభను పెంచుకోగలిగారు. 2016లో ఆమె సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఇండియన్ రైల్వే అకౌంట్ సర్వీస్‌లో ఉద్యోగాన్ని సంపాదించారు. డిసెంబర్‌లో శిక్షణకోసం హాజరవ్వాలని ఉత్తర్వు కూడా వచ్చింది. కాని నవంబర్ 2016లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ ట్రెయినింగ్ నుంచి ఆమెను ఉద్యోగానికి అనర్హురాలిగా గుర్తించి రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వు వచ్చింది. ఇప్పటివరకు ఇండియన్ రైల్వేస్‌లో అంధులకు ఉద్యోగాలు కేటాయించలేదని అందులో పేర్కొన్నారు. అది విన్న ఆమె చాలా బాధకు గురైంది. ఓటమిని అంగీకరించలేదు. వెంటనే తేరుకుని తన బాధను వ్యక్తం చేస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడికి , రైల్వే శాఖా మంత్రి సురేష్ ప్రభుకి తన వేదనను ఉత్తరం ద్వారా తెలియజేశారు. వారికే కాకుండా ఇతర ఉన్నతాధికారులకు కూడా కాపీలను పంపించారు. ఆమెకు జరిగిన అన్యాయం గురించి చాలా మీడియా సంస్థలు కవర్ చేయడంతో సమస్య అందరికీ తెలిసింది. నేను అంధురాలినని నన్ను అనర్హురాలిగా ప్రకటించారు. నేను అందరిలాగానే చదివి మంచి మార్కులు తెచ్చుకోగలిగినప్పుడు పని ఎందుకు చేయలేనని ఆమె అధికారులను ప్రశ్నించారు. ఈవిధంగా చేయడం సబబుకాదని నిలదీశారు. ఆమె ఫిర్యాదును పరిశీలించిన సురేష్ ప్రభు ఆమెను కలిసి తన ప్రతిభకు తగ్గ ఉద్యోగాన్ని త్వరలోనే ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సంఘటనతో ఆమె నిరుత్సాహపడలేదు. ఇంకా ఆమెలో పట్టుదల పెరిగింది. మరుసటి సంవత్సరం తిరిగి సివిల్స్ రాశారు. రెండవ ప్రయత్నంలో (2017)లో ఆమె జాతీయ స్థాయిలో 124 ర్యాంకును సాధించారు. ఆ విధంగా ఐఏఎస్‌కు ఎంపికైన మొట్టమొదటి అంధురాలిగా ప్రాంజల్ రికార్డు సృష్టించారు. ఈ విజయం సాధించినందుకు ఆకాశవాణి పుణె వారు ఆమెను సత్కరించారు.

ప్రాంజల్ పాటిల్ జపనీస్ బుద్ధిస్ట్ డైసాకు ఇకెడ పుస్తకాలను చదువుతారు. ఆయన రాసిన రచనలు ఆమెకెంతో ఇష్టం. ప్రతి రోజూ వాటిని చదువుతారు. వాటిని చదవడం వల్ల ఆమెలో ఆత్మ విశ్వాసం పెరిగి అసాధ్యమైన దాన్ని సాధించాలనే పట్టుదల పెరుగుతుందని, స్టీఫెన్ హాకింగ్ రచనలన్నా ఆసక్తి ఎక్కువే అని ఆమె చెప్పారు. 2018లో ఆమె ఐఏఎస్ శిక్షణలో మొదటి అంశాన్ని ఉత్తరాఖండ్ లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమి ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ ముస్సోరిలో పూర్తిచేశారు. మే28, 2018లో అసిస్టెంట్ కలెక్టర్‌గా కేరళలోని ఎర్నాకులంలోని బాధ్యతలు నిర్వహించారు. 2018లో ఆమె సోదరుడి పెళ్లిలో భార్యాభర్త లిద్దరూ ఆర్గాన్ డోనర్స్‌గా పత్రాలు సంతకం చేయడంతో న్యూస్ హెడ్‌లైన్స్‌లో ఆమె పేరు మారు మ్రోగిపోయింది. ఎన్ని అవాంతరాలు వచ్చినా పట్టుదలతో ముందుకు సాగి అనుకున్న పదవిని చేపట్టి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు ప్రాంజల్ పాటిల్.

# 'బిందు'...సేవా సింధు

## పల్లెసీమల్లో సేవలందిస్తున్న న్యూరాలజిస్టు



సేవ

**ఆమెకు న్యూరాలజీ సబ్జెక్ట్‌పై ఆసక్తి ఎక్కువ. ఆ ఆసక్తితోనే న్యూరాలజిస్ట్‌గా ఉన్నత చదువులు చదివారు. చదువుతున్న సమయంలో న్యూరాలజీకి సంబంధించిన క్రిటికల్ కేసులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచి రావడం గమనించారు. మెదడుకి సంబంధించిన వ్యాధుల మీద సరైన అవగాహన లేకపోవడంతోనే వారు ప్రాణాలు కోల్పోతున్నారని తెలుసుకుని బాధపడ్డారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెదడుకు సంబంధించిన వ్యాధులమీద సరైన అవగాహన కల్పించాలని నిర్ణయించుకుని సంచార న్యూరాలజిస్ట్‌గా మారారు. ఆమే డా॥ బిందు మీనన్.**

"వుయ్ రీచ్, వుయ్ టీచ్, వుయ్ ట్రీట్" అనే స్లోగన్‌తో డా॥ బిందు మీనన్ ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఆమె నెల్లూరుకి చెందిన న్యూరాలజిస్ట్. ఎన్నో గ్రామాల్లో ప్రజలకు న్యూరాలజీకి సంబంధించిన అనారోగ్య సమస్యలున్నా సరైన ఆర్థికస్థోమత లేక వాటిని భరిస్తూ అలాగే కృంగిపోతున్నారు. అలాంటి వారందరికీ సరికొత్త జీవనం అందించడానికి ఆమె ఈ ప్రయత్నం మొదలు పెట్టారు. డా॥ బిందుమీనన్ ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్. న్యూరాలజీ ఆన్ వీల్స్ అనే కార్యక్రమాన్ని మొదలుపెట్టిన తొలి మహిళ ఆమే. న్యూరాలజీ రోగులకు చేయాల్సిన పరీక్షలకు సంబంధించిన సామగ్రితో ఒక వాహనాన్ని 2015లో సిద్ధంచేసుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలా మొదలుపెట్టి న ఆమె ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో 23 గ్రామాలలో తన వైద్యసేవలను అందించారు.



నెలలో ఒక ఆదివారం డా॥ బిందు మీనన్ తన టీమ్‌తో మినీవ్యాన్‌లో ఏదో ఒక గ్రామానికి వెళతారు. ఆమెతో పాటు వచ్చేవారందరూ వారి ఆసక్తితో వాలంటీర్లుగా పనిచేయడానికి వచ్చినవారే. ఈ వ్యాన్ ద్వారా వారు ప్రతి గ్రామానికి వెళ్లి మెదడుకి సంబంధించిన వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్, మూర్ఛ వంటివి ఎందుకు వస్తాయో వివరిస్తున్నారు. అలాంటి బాధితులను గుర్తించి నప్పుడు వారి వ్యాధి నివారణ బాధ్యతను తీసుకుని పూర్తిగా తగ్గేంతవరకు చికిత్సను ఉచితంగా అందజేస్తున్నారు.

డా॥ బిందు మీనన్ 'న్యూరాలజీ ఆన్ వీల్స్' అనే కార్యక్రమమే కాకుండా 2016లో 'ఎపిలెప్సీ హెల్ప్'అనే యాప్‌ను ఏర్పాటుచేశారు. ఈ యాప్‌లో వ్యాధితో బాధపడేవారు పడిపోగానే వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందేలా వీరు చర్యలు తీసుకుంటారు. వారి సహాయం కోసం దేశమంతటా టోల్ ఫ్రీ 24x7 హెల్ప్ లైన్ సేవలు ఏర్పాటు చేశారు. బాధితులకు తగిన సమయంలో చేయాల్సిన సేవలను ఈ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌లు అందజేస్తాయి. డా ॥ బిందు మీనన్ రెండు దశాబ్దాల నుంచి న్యూరాలజిస్ట్‌గా సర్వీసులో ఉన్నారు. కాని ఆమె 2013 నుంచే డా॥ బిందు మీనన్ ఫౌండేషన్‌ని ఏర్పాటు చేసి న్యూరాలజికల్ సమస్యలతో బాధపడేవారికి ఉచిత చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం 200మంది రోగులు ఆమె దగ్గరకు వచ్చి చెకప్ చేయించుకుని వెళ్తుంటారు. వారందరికి నెలకు సరిపడా మందులను ఆమె ఉచితంగానే అందిస్తున్నారు. అదనంగా చికిత్స పొందాల్సి ఉంటే ఆ ప్రాంతంలో ఉండే ఆసుపత్రి వారితో మాట్లాడి నయమయ్యే వరకు చికిత్సను అందజేస్తున్నారు.

డా॥ బిందు మీనన్‌కి చిన్నప్పట్నించే మానవ నెర్వస్ సిస్టమ్ మీద, వాటి పనితీరు తెలుసుకోవాలని కుతూహలంగా ఉండేది. ఆ ఆసక్తితోనే న్యూరాలజీలో స్పెషలైజేషన్ చేశారు. ఆమె కాలేజీలో చదువుతున్నప్పుడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎన్నో భయంకర సంఘటనలు చూశారు. ఎంతోమంది రోగులు చాలా క్రిటికల్ కండీషన్‌లో గ్రామాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చేవారు. వారిలో చాలామందికి ఆ రోగం మీద సరైన అవగాహన లేకపోవడమైతే మరి కొంతమంది నిర్లక్ష్యం వల్ల రోగాలు పెంచుకుంటున్నారని ఆమె గ్రహించారు. చదువు అయ్యాక ప్రాక్టీసు కేవలం గ్రామీణ పేదరోగులకోసమే పెట్టారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన రోగులను గుర్తించి వారిని లోపలికి పిలిచి మాట్లాడి వారి సమస్యేమిటో కనుక్కునేవారు. 2013లో ఫౌండేషన్‌ను ప్రారంభించడం ద్వారా ఆమె అనుకున్న సహాయాన్ని అందించగలుగుతున్నారు.

"మిగతా అనారోగ్య సమస్యలకన్నా న్యూరాలజికల్ డిజార్డర్స్ చాలా ప్రమాదకరమైనవి. ఉదాహరణకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వ్యక్తి తిరిగి కోలుకోవడానికి 3,5 సంవత్సరాలు పడు తుంది. అది కూడా ప్రతిరోజూ ఫిజియో థెరపీ, మందులను వాడడం ద్వారానే నయమవుతుంది. ఒకవేళ ఎక్కువ చోట్ల రక్తం గడ్డకట్టుకుని ఉండి పోతే పక్షవాతానికి గురయ్యే ప్రమాద ముంది. ఇలాంటి వారికి జీవితమంతా ఎవరో ఒకరు వైద్యసహాయాన్ని అందిస్తూనే ఉండాలి. ఇటువంటి విషయాల మీద గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేకపోవడం విచారకరం. ఇటువంటి రోగులు ఎప్పుడూ మందులు వాడుతుంటే పెద్ద ప్రమాదాల నుంచి బయటపడే అవకాశాలెక్కువ. అందుకనే అలాంటి ప్రమాదాలను నివారించడానికి నా ఈ ప్రయత్నం" అని మీనన్ చెప్పారు.

బ్రెయిన్ స్ట్రోక్, మూర్ఛ గురించి మన దేశంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఆమె ఈ కార్యక్రమాన్ని సాగిస్తున్నారు. మనదేశంలో మూర్ఛతో బాధపడేవారి సంఖ్య ఎక్కువగా ఉందనే చెప్పవచ్చు. మూర్ఛను మనం కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నివారించవచ్చు. ఉదాహరణకు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వంట చేసేముందు కూర గాయలను పరిశుభ్రంగా కడుక్కోవాలి. దీనివల్ల చాలా రోగాలను దరిచేరకుండా ఉంటాయి. చాలామంది రోగులు పరిశుభ్రవాతావరణంలో ఉండటం లేదు.

"న్యూరాలజీ ఆన్ వీల్స్" ప్రారంభించక ముందు నా అవగాహన సదస్సులతో ఎంతమంది మారుతారా అన్న సందేహం నాలో ఉండేది. కాని కార్యక్రమం మొదలుపెట్టాక వచ్చే ప్రతిస్పందన చూశాక నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది" అన్నారు బిందు మీనన్. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు షాలిని ఫిజియోథెరపిస్ట్ కూడా సేవలు అందిస్తున్నారు. "మా సేవలను చిన్నచిన్న గ్రామాలలో చేస్తున్నాం. ముందురోజు గ్రామానికి వెళ్లి సర్పంచ్‌కి ఆరోగ్యం కేంద్రం గురించి తెలియజేస్తే క్యాంపు విష యాన్ని గ్రామప్రజలకు ఆయన తెలియజేస్తారు. ఆయన సహకారంతో మేము ఆ గ్రామంలో మాక్యాంపు నిర్వహించగలుగు తున్నాం. డా॥మీనన్ ఎటు జెడ్ స్ట్రోక్స్, మూర్ఛ, హైపర్ టెన్షన్, డయాబెటీస్ గురించి వివరించేవారు. దేశ జనాభాలో ఎక్కువమంది ఈ వ్యాధుల బారిన పడుతున్నారు. రోగంతో బాధపడుతున్నవారికి వ్యాధి తగ్గేవరకు చికిత్సను అందజేస్తున్నాం. ఎటువంటి సందేహాలున్నావారికి వివరిస్తున్నాం. ఈ విషయాలన్నీ తెలుసుకోవడంలో ఎక్కువగా ఆసక్తి చూపించేది గ్రామీణ మహిళలు మాత్రమే"అని శాలిని చెప్పారు.

"అవగాహన క్యాంపు అయిన తర్వాత చికిత్స క్యాంపును ఏర్పాటు చేస్తున్నాం. వ్యాధితో బాధపడేవారికి వ్యానులో ఉన్న సామగ్రితో పరీక్షలు చేసి, ఎటువంటి సమస్యతో బాధపడుతున్నారో చెప్పడం జరుగుతుంది. ఈవిధంగా ప్రతి గ్రామంలో 150 మంది రోగులు గుర్తించగలుగుతున్నాం. అందులో 20శాతంమంది చాలా సీరియస్ కండీషన్, తగ్గించలేని న్యూరాలజికల్ సమస్యలతో బాధపడుతున్నవారే. చిన్నచిన్న న్యూరాలాజికల్ సమస్యలున్న వారికి నెలకి సరిపడా మందులను అందజేస్తున్నాం. ప్రమాద పరిస్థితుల్లో ఉన్న వారి పేర్లను మా ఫౌండేష న్‌లో నమోదు చేసుకుంటున్నాం. ఎవరై నా వారి చికిత్సకు సరిపడా మొత్తా న్ని భరిస్తాం అని చెప్పినప్పుడు వారికి ఈ వివరాలను తెలియ జేస్తున్నాం. నిరుపేద కుటుంబాలకు మా సేవలు ఎల్లప్పుడూ ఉచితంగా అందుతాయి" అని మీనన్ అన్నారు.

డా॥ మీనన్ తండ్రి కెఎమ్ఆర్ నంబియార్. ఆయన కూడా ఈ ఫౌండేషన్‌కి అధ్యక్షులుగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. తన కూతురు సామాజిక సేవలో తరిస్తున్నం దుకు ఆయనెంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. "ఈ ఫౌండేషన్‌తో నేను ఐదు సంవ త్సరాలుగా సేవలు కొనసాగిస్తు న్నాను.

మా కార్యక్రమం ద్వారా ఎంతోమంది ప్రాణా లను కాపాడగలిగాము. ఇప్పటి వరకు 160 క్యాంపు లను నిర్వహించ గలిగాము. ఇవే కాకుం డా స్కూల్స్, కాలేజీలకు వెళ్లి ఆరోగ్యజీవన విధా నం మీద అవగాహన కల్పిస్తున్నాం. ఆకస్మా త్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌కి గురయ్యి నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్త లేమిటో వారికి వివరిస్తున్నాం. స్కూలులో నిర్వహించే ఈ క్యాంపులు చాలా పేరు సంపాదించాయి. పిల్లల్లో ఇలాంటి విషయాలు తెలుసుకోవాలనే ఉత్సుకత ఎక్కువగా ఉంటోంది. వారు అడిగే ప్రశ్నలు కొన్ని మమ్మల్నే ఆలోచింపజేసేలా ఉంటాయి" అని ఆమె అన్నారు. న్యూరాలజికల్ సమస్యలతో బాధపడేవారు వారి సమస్యలకు పరిష్కారాన్ని తెలుసుకోవడానికి 18001020237 అనే నెంబర్‌కి డయల్ చేయండి. అందులో రికార్డు చేసిన మెసేజ్ ద్వారా మీకు కావలసిన సమాచారం అందుతుంది. ఈ హెల్ప్‌లైన్‌లో సమాచారం తెలుగు, ఇంగ్లీషులో రెండింటిలో వస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజల కు ఉపయోగపడేలా ఆమె ఈవిధంగా ఏర్పాటు చేశారు. ఆమె చేస్తోన్న కార్యక్రమాలను నచ్చిన ఎంతోమంది యువ డాక్టర్లు వాలంటీర్లుగా మారి ఆమెతో క్యాంపులకు హాజరవడం అందరూ గర్వించదగ్గ విషయం.



ఆదర్శం

**పదహారేళ్ల వయసులోనే ఆమెకి వివాహం జరిగింది. పెళ్లయిన నాలుగేళ్లకే (20యేళ్లకే) అనుకోని ప్రమాదంలో భర్త దూరం కావడంతో జీవితం అంధకారం అయ్యింది. ఇద్దరు పిల్లల బాధ్యత ఆమె మీదే పడింది. భర్త లేడనే దుఃఖాన్ని దిగమింగి, మనసుకు ధైర్యం చెప్పుకుని తన పిల్లల భవిష్యత్తుకోసం ధైర్యంగా ముందడుగు వేసింది. ఆ ప్రయత్నం వల్లనే ఆమె ప్రశాంతంగా జీవనం సాగిస్తూ 600మంది కుటుంబాలకు మెరుగైన జీవనానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించగలుగుతోంది. ఆమే సిఫియా హనీఫ్. వితంతువుగా తను పడిన బాధ తనలాంటి మరొక మహిళ పడకూడదని భావించి తనకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ సేవలందిస్తోంది. ఆమె వివరాలు మీకోసం...**

# చింతలు తీర్చే 'ఛితాల్'

## వితంతువుల జీవితాల్లో కొత్త వెలుగులు
## 600 కుటుంబాలకు సిఫియా హనీఫ్ అండదండ

సిఫియా హనీఫ్ పలక్కడ్ ప్రాంతానికి చెందినది. చిన్నవయసులోనే భర్తపోయాడనే బాధను దిగమింగి ఇద్దరు కొడుకులు భవిష్యత్తుకోసం ఆలోచించడం మొదలుపెట్టింది. ఆమె తల్లిదండ్రులు తమ దగ్గరే ఉండమని లేదా ఇంకో పెళ్లి చేసుకోమని సలహా ఇచ్చారు. కాని దానికి ఆమె ఒప్పుకోలేదు. ఇద్దరు పిల్లలతో తన తల్లిదండ్రులకు భారంగా బతకడం సిఫియాకు ఇష్టం లేదు. వారి భవిష్యత్తుకోసం ఆమె పెద్ద చదువులు చదవాలనుకుంది. బెంగళూరుకు వస్తే సహాయం చేస్తామని మిత్రులు హామీ ఇవ్వడంతో 2011లో చిన్న కొడుకును తీసుకొని అక్కడికి చేరుకున్నది. పెద్దకొడుకును అమ్మ దగ్గర వదిలిపెట్టింది. అయితే, బెంగళూరు చేరుకున్నాక గాని తెలియలేదు వారి మాటలన్నీ అబద్ధాలని. తెలిసినవారెవరూ సిఫియాకు సహాయం చేయడానికి ముందుకు రాలేదు. ఇంటి దగ్గర నుంచి స్నేహితులను నమ్ముకుని వచ్చేసింది. తిరిగి వెనక్కి వెళ్లలేని పరిస్థితి. ఏమిచేయాలో తెలియని నిస్సహాయస్థితిలో మౌనంగా ఉండిపోయింది. సిఫియా కొడుకుకి ఏడాది వయసు ఉంటుంది. జ్వరంతో ఒళ్లు కాలిపోతుంది. ఏ ఆసుపత్రికి తీసుకువెళ్లాలన్నా ఏమీ తెలియని పరిస్థితి. అలా బాబుని పట్టుకుని మెజిస్టిక్ బస్ స్టేషన్‌లో రెండు రాత్రులు ఏడుస్తూ గడిపింది. ఆ సంఘటనే ఆమె జీవితాన్ని మార్చేస్తాయని సిఫియా కూడా ఊహించలేదు.

సిఫియా కొడుకును పట్టుకుని ఏడుస్తూ బస్‌స్టేషన్‌లో బెంచ్‌మీద కూర్చోవడం ఆమె జీవితంలో మర్చిపోలేని సంఘటన. ఆమె బాధను చూసిన ఓ అవ్వ (తమిళంలో పట్టి) సిఫియాకు తన సహాయాన్ని అందించి ఆదుకుంది. లేకపోతే ఆమె పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉండేది. అలా ఏడుస్తున్న సిఫియాను ఒక అవ్వ తన ఇంటికి తీసుకువెళ్లింది. అన్నం పెట్టి ఆదరించింది. ఎన్నిరోజులు కావాలంటే అన్నిరోజులు అక్కడే ఉండవచ్చునని నీడనిచ్చింది. ఆమె సహకారంతో సిఫియా ఎనిమిది నెలలు అక్కడే ఉండిపోయింది. అవ్వ(పట్టి) కూతురు వితంతువు కావడంతో ఒంటరిగా ఉండేది. ఆమెతో పాటు సిఫియాను ఉండమని సలహా ఇచ్చింది.

నెమ్మదిగా సిఫియాకు కాల్‌సెంటర్‌లో ఉద్యోగం వచ్చింది. అక్కడ పనిచేస్తూనే కేరళలో కరస్పాండెన్స్ కోర్సులో 11,12 తరగతు లను పూర్తిచేసింది. సిఫియా కాలేజ్‌కి, ఉద్యోగానికి వెళ్తున్న సమయంలో ఆమె కొడుకుని అవ్వ చూసుకునేది. సిఫియా కొడుకును చూసుకుంటున్నందుకు ఒక్క రూపాయి కూడా ఆమె దగ్గర నుంచి అవ్వ ఆశించకపోవడం మెచ్చుకోదగ్గ విష యం. ఈవిధంగా ఒక సంవత్సరం గడిచిపోయింది. పెద్దబ్బాయికి దూరంగా సిఫియా ఎక్కువ రోజులు ఉండలేకపోయింది. చిన్న అబ్బాయికి మూడు సంవత్సరాల సమయంలో ఆమె తిరిగి ఇంటికి వెళ్లాలనుకున్నప్పుడు సిఫియాకు అవ్వ చెప్పిన మాటలు ఎప్పటికీ గుర్తుండిపోయాయి.

సిఫియా తిరిగి వెళ్తున్నప్పుడు అవ్వ తనకు ఎన్నో విషయాలు చెప్పడమే కాదు, వస్తువులను కూడా ఇచ్చింది. అందులో ముఖ్యమైనది ఎవరికైతే మన అవసరం ఉంటుందో వారిని వదిలిపెట్టవద్దు అని చెప్పిన మాటలు సిఫియాకు ఎప్పటికీ గుర్తుండిపోయాయి. ఇంటికి వెళ్లాక తనలాంటి వితంతువుల గురించి ఆలోచించడం మొదలుపెట్టింది. సరైన చదువులేక, సంపాదన లేక ఎన్ని కష్టాలు పడుతున్నారో కళ్లారా పరిశీలించింది. వాటన్నింటిని పరిష్కరించడానికి పోరాడాలని నిర్ణయించుకుంది. అప్పటికి సిఫియా ఇంటర్మీడియట్ పూర్తిచేసి లిటరేచర్‌లో డిగ్రీ చేసింది. తను ఉంటున్న ఊరి ఆసుపత్రిలో రిసెప్షనిస్ట్‌గా ఉద్యోగంలో చేరింది. తనకొచ్చే ఆదాయంలో తనలాంటి వితంతువులకు ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకుని 2013 నుంచి 60 కుటుంబాలకు కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించడం మొదలుపెట్టింది. అలా ఆమె ఆర్థికసహాయం అందించడానికి కొంతమంది వితంతువుల ఇళ్లకు వెళ్లినప్పుడు మరికొన్ని విషాదకరమైన విషయాలు తెలిశాయి.

కొంతమంది వితంతువుల పిల్లలు మెంటల్ డిజేబిలిటీతో బాధపడుతున్నారు. వారిని చూసుకుంటూ ఇంట్లోనే ఉంటే ఇల్లు గడవడం కష్టమని ఆ పిల్లల తల్లులు వారిని ఇంట్లోనే కట్టివేసి ఉంచి ఇంటికి తాళం వేసి పనికి వెళుతున్నారు. ఆ దృశ్యాలను చూసి సిఫియా చలించిపోయింది. వాళ్ల కష్టాలు తీర్చగలిగేంత డబ్బులు తన దగ్గర లేకపోయినా తనకున్న దాంట్లో ప్రతి కుటుంబానికి ఆహారాన్ని, బట్టలను, నెలకు వెయ్యి లేదా రెండు వేల రూపాయలను ఇవ్వడానికి నిర్ణయించుకుంది. కేవలం తన సహాయంతో వారి జీవితాలు మెరుగుపడవని గ్రహించి మరింత ఆర్థిక సహాయం కోసం ఫేస్‌బుక్‌లో క్రౌడ్ ఫండింగ్ పేజ్ 'ఛితాల్'ను 2013లో మొదలుపెట్టింది. ఏ వితంతువుకు ఎటువంటి సహాయం కావాలన్నా సిఫియా ఈ ఛితాల్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తోంది. ఈ ట్రస్ట్‌ను 2015లో ప్రారంభించింది. క్లిష్టపరిస్థితుల్లో జీవనం సాగించిన సిఫియా నేడు భారతదేశ ప్రముఖ సామాజిక కార్యకర్తల్లో ఒకరిగా పేరు సంపాదించుకుంది. భర్తలేకపోతే కుటుంబ పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ఆమెకు తెలుసు. అందుకనే అలాంటి కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి కావలసిన సహాయాన్ని అందిస్తోంది. తన సంకల్పంతో వందమంది వితంతువులకు ఉపాధిమార్గాలను చూపించింది. 600కుటుంబాలు అభివృద్ధి మార్గంలో నడిచేలా చర్యలు తీసుకుంది. ఆమె చేస్తోన్న సామాజిక సేవను గుర్తించిన కొన్ని సంస్థలు నీర్జా భానోత్ అవార్డుతో సెప్టెంబర్‌లో సత్కరించారు. క్లిష్టపరిస్థితుల్లో ఉన్న సిఫియాకు అవ్వ ఇచ్చిన ప్రోత్సాహం,స్ఫూర్తి వల్ల మంచి మార్గంలో పయనించి నేడు అందరికి మార్గదర్శకురాలిగా నిలిచింది.



# ఈ సంక్రాంతి నాకు చాలా స్పెషల్

**-మహేష్‌బాబు**

**2020** సంక్రాంతి పండుగ నాకు చాలా స్పెషల్. ఎందుకంటే సరిలేరు నీకెవ్వరు వంటి అద్భుతమైన కథాచిత్రంలో నటిస్తుండటమే అందుకు కారణం అని సూపర్‌స్టార్ మహేష్‌బాబు చెప్పుకొచ్చారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఆ చిత్రం చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు, రామబ్రహ్మం సుంకర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని జనవరి 12న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా మహేష్‌బాబు పైవిధంగా పేర్కొనడం విశేషం. నిర్మాతలు దిల్‌రాజు, అనిల్ సుంకర మాట్లాడుతూ, మీ హృదయాలను జయించి..మీలో నవ్వుల్ని పూయిస్తుంది. యాక్షన్‌తో మిళితమైన నూరుశాతం ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఈ చిత్రం ద్వారా అందించబోతున్నాం అని అన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని చూసిన వాళ్లంతా నవ్వకుండా, చప్పట్లు కొట్టకుండా ఉండలేరని అన్నారు. హీరోయిన్ రష్మిక మండన్న మాట్లాడుతూ, క్యాలెండర్‌లో తేదీని మార్క్ చేసుకోండి. 12న థియేటర్స్‌లో కలుద్దాం అని అన్నారు.ఆర్మీ మేజర్ పాత్రలో మహేష్‌బాబు నటిస్తున్న ఈ చిత్రంలో ఆయన సరసన రష్మిక మండన్న నాయికగా నటిస్తుండగా...ఇతర ముఖ్యపాత్రలలో సీనియర్ నటి విజయశాంతి, రాజేంద్రప్రసాద్, ప్రకాష్‌రాజ్, సంగీత, బండ్ల గణేష్ తదితరులు తారాగణం. దేవిశ్రీప్రసాద్, రత్నవేలు, కిశోర్ గరికిపాటి, తమ్మిరాజు, రామ్, లక్ష్మణ్, యుగంధర్.టి., ఎస్.కృష్ణ ముఖ్య సాంకేతిక వర్గం.



కార్తీ

# దీపావళికి ఖైదీ

**కా**ర్తీ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం ఖైదీ. లోకేష్ కనకరాజ్ దర్శకుడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు, తిరుప్పూర్ వివేక్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ తెలుగు ప్రేక్షకులకు అందించబోతున్నారు. ఈ సందర్భంగా హీరో కార్తీ మాట్లాడుతూ, పాటలు, రొమాన్స్ వంటివి లేకుండా కేవలం యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలుండే విభిన్నమైన చిత్రమిదని అన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్న కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ, రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా ఉండే సినిమా ఇది. పాటలు, హీరోయిన్ లేకుండా ఒక విభిన్నమైన కాన్సెప్ట్‌తో సాగే చిత్రమిది. విభిన్నమైన యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాలో తండ్రీకూతుళ్ళ సెంటిమెంట్ కూడా ఓ ముఖ్యమైన అంశంగా ఉంటుంది. కార్తీ నటించిన యుగానికి ఒక్కడు, ఆవారా, నా పేరు శివ, ఊపిరి, ఖాకీ వంటి చిత్రాల తర్వాత వస్తున్న మరో ఆకట్టుకునే చిత్రమిది.కథ ప్రారంభం నుంచే చాలా ఆసక్తికరంగా, గ్రిప్పింగ్‌గా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు విశేషమైన స్పందన లభిస్తోంది. దీపావళి సందర్భంగా చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సి.ఎస్., సినిమాటోగ్రఫీ: సత్యన్ సూర్యన్, ఎడిటింగ్: ఫిలోమిన్‌రాజ్.



తాప్సీ

# ముందు పేరు ...తర్వాతే డబ్బు

చిత్ర పరిశ్రమలో నాయికల ప్రాధాన్యత బాగా పెరిగిపోయిన సందర్భమిది. వాళ్లకిచ్చే పారితోషికాల్లోనూ గణనీయమైన పెరుగుదల వచ్చింది. ఆంగ్ల చిత్ర పరిశ్రమల్లో ఈ మార్పు చాలా కాలం క్రితమే వచ్చినా, గత నాలుగైదేళ్లుగా మన దగ్గర కనిపిస్తోంది. బాలీవుడ్ అగ్రతారలు ఇరవై కోట్ల రూపాయలకు పైగా అందుకోవడం మార్పునకు సంకేతం. గతంలో నాయిక కోటి రూపాయలు తీసుకుంటే ఆశ్చర్యపోయేవారు. నాయిక ప్రధాన చిత్రాలు ఆదరణ పొందుతుండటం, ఆ చిత్రాలు వందల కోట్ల రూపాయల వసూళ్లను సాధిస్తుండటం తారల ఆదాయాన్ని పెంచుతోంది. పారితోషికాలు పెరిగినా, కథానాయకులకు ఇస్తున్న దానితో పోల్చి చూస్తే చాలా తేడా ఉందంటోంది అగ్రతార తాప్సీ పన్ను. తెలుగు, తమిళం నుంచి బాలీవుడ్ వెళ్లిన తాప్సీ, అక్కడ గుర్తుండిపోయే విజయాలు సాధించింది. ఇప్పుడామె అక్కడ పేరున్న నాయిక. తాప్సీ తాజా చిత్రం సాంధ్ కీ ఆంఖ్, అక్షయ్ కుమార్ హౌస్‌ఫుల్ 4 సినిమాతో పాటు దీపావళి పండక్కి తెరపైకి వస్తోంది. ఈ నేపథ్యంలో తాప్సీ మాట్లాడుతూ...మా సినిమా ట్రైలర్ చూసి అక్షయ్ కుమార్ నన్ను, భూమిని పిలిచి మాట్లాడారు. ట్రైలర్ బాగుందని ప్రశంసించారు. ఆయన హౌస్‌ఫుల్ 4, మా సాంధ్ కీ ఆంఖ్ ఒకే రోజున విడుదలవుతున్నాయి. ఇక్కడ పోటీ అంటూ ఏం లేదు. ఆ రోజుకు ఎవరి సినిమా చూడాలనుకుంటే వాళ్ల చిత్రాన్ని ప్రేక్షకులు చూస్తారు. గత రెండేళ్లుగా నాయిక ప్రధాన చిత్రాల్లో నటిస్తున్నాను. నాయికల సినిమా కూడా ఆదరణ పొందగలవు అని నిరూపించాలి. నేను అడిగినంత నిర్మాతలు ఇస్తున్నారు. కానీ నా సహ కథానాయకులతో చూస్తే నా ఆదాయం చాలా తక్కువగా ఉంటోంది. అయినా నేను ముందు పేరు కోసం చూస్తున్నా, ఆ తర్వాతే డబ్బు గురించి ఆలోచిస్తా. అని చెప్పింది.

# నవంబర్‌లో తెనాలి రామకృష్ణ ఆగమనం



సందీప్‌కిషన్

**సం**దీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న చిత్రం తెనాలి రామకృష్ణబి.ఎ., బి.యల్., హన్సిక హీరోయిన్. తమిళ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ తొలిసారిగా తెలుగు సినిమాలో నటిస్తున్నారు. జి.నాగేశ్వరరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ నీలకంఠేశ్వర స్వామి క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తిచేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. నవంబర్‌లో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం మాట్లాడుతూ, ఇటీవల విడుదలైన ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌కు విశేషమైన స్పందన లభించిందని వెల్లడించింది. పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రంగా దీనిని మలుస్తున్నామని, తెలుగు, తమిళ బాషల్లో చిత్రం విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని బృందం తెలిపింది. ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో మురళీశర్మ, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, ప్రభాస్ శ్రీను, పృథ్వీ, రఘుబాబు, సప్తగిరి, రజిత, కిన్నెర, అన్నపూర్ణమ్మ, వై.విజయ, సత్యకృష్ణ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి మాటలు: నివాస్, భవానీప్రసాద్, సంగీతం: సాయికార్తీక్, సినిమాటోగ్రఫీ: సాయిశ్రీరామ్, ఎడిటింగ్: ఛోటా కె.ప్రసాద్, ఆర్ట్ కిరణ్, యాక్షన్: వెంకట్.

# త్వరలో బ్యూటిఫుల్ మొదటి సింగిల్

**రా**మ్‌గోపాల్‌వర్మ కొత్త చిత్రం బ్యూటిఫుల్. (ట్రిబ్యూట్ టు రంగీలా ఉపశీర్షిక). నైనా కథానాయికగా, సూరి కథానాయకుడిగా నటిస్తున్నారు. అగస్త్య మంజు దర్శకుడు. లోగడ లక్ష్మీస్ ఎన్టీఆర్ సినిమాకు రామ్‌గోపాల్‌వర్మతో పాటు అగస్త్య మంజు సహ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. రామ్ గోపాల్‌వర్మ టైగర్ కంపెనీ ప్రొడక్షన్ పతాకంపై టి.అంజయ్య సమర్పణలో టి.నరేష్‌కుమార్, టి.శ్రీధర్ నిర్మిస్తున్నారు. రొమాంటిక్ ప్రేమ కథాంశంతో వైవిధ్య భరితంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ట్రైలర్ ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. దీనికి విశేష స్పందన రావడంతో ఇప్పుడు ఈ చిత్రంలోని మొదటి సింగిల్ (పాట)ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం తెలియజేస్తూ...ఈ నెల 20 నుంచి 25 లోపు మొదటి సింగిల్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ప్రీ రిలీజ్ వేడుకల్లో భాగంగా ఈ నెలాఖరులో వైజాగ్, విజయవాడ, హైదరాబాద్ కాలేజీలలో చిత్రబృందం సందడి చేయనున్నట్లు పేర్కొంది. షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉంది. ఈ చిత్రానికి పాటలను సిరాశ్రీ అందించగా...సంగీతాన్ని రవి శంకర్ సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి రచన, ఫోటోగ్రఫీ, దర్శకత్వం: అగస్త్య మంజు.



సూరి, నైనా



దీపికా పదుకొనే

**చ**పాక్, 83 లాంటి చిత్రాలతో తీరిక లేకుండా ఉంది అందాల తార దీపికా పదుకొనే. ఈ సుందరి పెళ్లయ్యాక తను ఎంచుకునే సినిమాల తరహా మార్చేసింది. ఇల్లాలిగా తాను ఎలాంటి కథల్లో నటిస్తే బాగుంటుందో ఆలోచించి ఎంచుకుంటోంది. యాసిడ్ దాడి బాధితురాలిగా చపాక్ చిత్రంలో నటిస్తోంది. ముంబైలో జరుగుతున్న మామి, మూవీ మేళాలో దీపికా అతిథిగా పాల్గొంది. ఆమె తను ఇప్పటిదాకా చేసిన సినిమాల గురించి మాట్లాడుతూ...చపాక్ సినిమా నేను చేసిన వాటిలో కష్టతరమైంది. భౌతికంగా, మానసికంగా కష్టపడాల్సిన పాత్ర ఇది. మేకప్ వేసుకునేందుకు మూడు గంటలు, దాన్ని తీసేందుకు గంట సమయం పడుతోంది. ఇక యాసిడ్ దాడి బాధితురాలి భావోద్వేగాలు పలికించడం సవాలుగా తీసుకున్నా. నా సినిమాల్లో ఇష్టమైంది పీకూ. అప్పటికి తీరిక లేకుండా ఉండటం వల్ల, ఆ

# ఇంటికొచ్చే వరకే...

సినిమా చిత్రీకరణను పూర్తిగా ఆస్వాదించలేకపోయాను. ఒక ఇంటిలో కుటుంబ సభ్యుల్లా మెలగండి, నటించడం మర్చిపోండని పీకూ దర్శకుడు చెప్పేవారు. మేమూ అలాగే చేశాం. అందుకే అంత సహజంగా ఆ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. చెన్నై ఎక్స్ ప్రెస్‌లో నేను పండించిన హాస్యం బాగా పేరు తెచ్చుకుంది. నవ్వించేందుకు ప్రణాళిక ఉండదు, నటిగా అప్పటికి ఏమనిపిస్తే అలా చేసుకుంటూ వెళ్లాలి, షారుక్ సరసన హాస్య సన్నివేశాల్లో మెప్పించడం కష్టం. నిజాయితీగా కష్టపడితే మంచి ఫలితాన్ని ప్రేక్షకులు ఇస్తారు. మీనమ్మ పాత్రకు అలాగే పేరొచ్చింది. పద్మావత్ సినిమాలో నటిస్తున్నప్పుడు, ఈ పాత్రకు నేను న్యాయం చేయగలనా లేదా అని భయపడ్డాను. దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఇచ్చిన ధైర్యంతో ముందడుగు వేశాను. రన్వీర్ సినిమా విషయాలు ఇంట్లోనూ మాట్లాడేందుకు ఇష్టపడతాడు. కానీ నేను సినిమా సంగతి సెట్స్ దగ్గరే వదిలేసి, ఇంటికొచ్చాక సాధారణ మహిళలా ఉండాలనుకుంటా. అని చెప్పింది.

# రెండో సినిమా నిర్మిస్తా

**-శివబాలాజీ**



**న**టుడిగానే కాకుండా నిర్మాతగా కూడా కొనసాగదలచుకున్నానని శివబాలాజీ తెలిపారు. హీరోగా, సపోర్టింగ్ నటుడిగా పలు చిత్రాలలో నటించిన ఆయన ఈ ఏడాది మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టారు. ఆ మధ్య గగన్ మ్యూజికల్ ఫ్రేమ్స్ సంస్థను స్థాపించి, ఆ బేనర్‌పై తొలి ప్రయత్నంగా స్నేహమేరా జీవితం చిత్రాన్ని నిర్మించిన శివబాలాజీ తన జన్మదినోత్సవాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ....స్నేహమేరా జీవితం చిత్రం నటుడిగా, నిర్మాతగా కూడా నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో మంచి కథతో మా సంస్థలో రెండో చిత్రాన్ని మొదలుపెడుతున్నాం. త్వరలోనే షూటింగ్ మొదలవుతుంది. అలాగే అందరూ కనెక్ట్ అయ్యేవిధంగా ఒక వెబ్ సిరీస్‌లో కూడా నటిస్తున్నాను. మంచి కథ, కథనం ఉన్న సినిమాలతోనే ప్రేక్షకుల ముందుకు రావాలని కాస్త సమయం తీసుకోవడం జరిగింది అన్నారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076